సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 152

మంగళవారం 22-8-2017



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



రాస్‌నెఫ్ట్ చేతికి ఎస్సార్ ఆయిల్

13 మిలియన్ డాలర్లకు సొంతం.. దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ డీల్ - బిజినెస్‌లో



శ్రీకాంత్ శుభారంభం

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ తొలి రౌండ్‌లో విజయం - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు

నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ దిగజారుడు

ఓ చానల్‌ను మేనేజ్ చేసి కథనాలు ప్రసారం చేయించిన నేతలు.. తెలుగుదేశం పార్టీ తోక పత్రికలోనూ అవే స్టోరీలు

ప్రజలను తప్పుదారి పట్టించేందుకు విఫలయత్నం.. తమ అనుమానాలే నిజమయ్యాయంటున్న వైఎస్సార్‌సీపీ వర్గాలు

5 లో

బీజేపీ, టీడీపీ

మైత్రి

కొనసాగుతుంది

మంత్రి కాలవ శ్రీనివాసులు

- వివరాలు 5లో

2 వేలు, 3 వేలు, 5 వేలు

ఓటమి భయంతో ఓటుకు వెల కట్టి పంచుతున్న అధికార పార్టీ

- ఒక్కో చోట ఒక్కో రేటేంటని జనం నిలదీత
- కొన్ని చోట్ల మహిళలకు ముక్కు పుడకలు, చీరల పంపిణీ
- జగన్‌కు వెల్లువెత్తిన ప్రజాభిమానం చూసి బెంబేలు
- ఓటమి తప్పదని తెలిసి ఏకంగా ఈసీపైనే విమర్శలు
- జిల్లాలోనే ఉండి ఓటింగ్ సరళి పర్యవేక్షించేందుకు అధికార పార్టీ నేతల ఏర్పాట్లు



డబ్బు పంచుతున్న టీడీపీ సర్పంచ్ లక్ష్మికొండారెడ్డి

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నిక ప్రచార హోరు ముగిసింది. అసలు పోరు ఈ నెల 23న ఓటింగ్ రూపంలో జరగనుంది. పోలింగ్‌కు గడువు దగ్గరపడుతున్న కొద్దీ అధికార పార్టీలో అలజడి రేగుతోంది. ఎంతగా అభివృద్ధి పేరుతో మాయమాటలు చెప్పినా, ఎంతగా నోట్ల కట్టలు గుమ్మరించి ప్రలోభాలకు గురి చేసినా, పోలీసులతో సోదాలు, నేతలపై దాడులు చేయించినా ప్రతిపక్ష పార్టీ వైపే

మిగతా 6వ పేజీలో ▶



మీ ఓటు రహస్యమే

మీరు ఓటెవరికి వేశారో ఇతరులెవరికీ తెలియదు

నిర్భయంగా ఓటు వేయండి.. నంద్యాల ఓటర్లకు సీఈఓ భన్వర్‌లాల్ పిలుపు

ఓటర్లు 92231 66166 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు

- 255 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 23వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- లైవ్ వెబ్‌కాస్టింగ్‌తో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- 16 తెలుగు ఛానెళ్లపై నిరంతర నిఘా
- స్థానికేతరులు నంద్యాల వీడి వెళ్ళాలి
- బాలకృష్ణ నగదు పంపిణీపై మరోసారి నివేదిక కోరతామని స్పష్టీకరణ

నంద్యాలలో ముగిసిన ప్రచారం 23న పోలింగ్ 5 లో

సాక్షి, హైదరాబాద్

ఓటరు ఎవరికి ఓటు వేసింది ఇతరులకు తెలిసే అవకాశం ఎంత మాత్రం లేదని, నంద్యాల ఉప ఎన్నికలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా నిర్భయంగా ఓటేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్ పిలుపునిచ్చారు. తమకు నచ్చినవారికి, అభీష్టం మేరకు ఓటు వేయాలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు వీలుగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్టు ఆయన వెల్లడించారు. పోలింగ్ పూర్తయ్యేవరకు ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్ నిర్వహించినా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో భన్వర్‌లాల్ మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఆరు గంటల సమయానికి పోలింగ్ స్టేషన్ వద్ద క్యూలో ఉన్న వారిని రాత్రి ఎన్ని గంటల వరకైనా ఓటేయడానికి అనుమతిస్తామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ లోపలా, బయట లైవ్ వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, పోలింగ్ తీరును అనుక్షణం పరిశీలిస్తారని భన్వర్‌లాల్ వివరించారు. ఎక్కడ ఏం జరిగినా ఎన్నికల సిబ్బంది క్షణాల్లో స్పందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రచారం ముగిసినందున స్థానికేత రులు నంద్యాల విడిచి వెళ్లాలని ఆయన ఆదేశించారు.

భారీ బందోబస్తు

2,500 మంది పోలీసులు, ఆరు కంపెనీల పారామిలటరీ బలగాలు బందోబస్తులో పాల్గొంటున్నారని భన్వర్‌లాల్ తెలిపారు. 82 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లందరికీ ఓటింగ్ స్లిప్‌లు పంపామని, పోలింగ్ బూత్‌లతో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించామని చెప్పారు. వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లున్నాయని,

మిగతా 2వ పేజీలో ▶

నంద్యాలలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ముగింపు సభలో భారీ జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి



ధర్మానికే ఓటెయ్యండి

నంద్యాల ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు


- వ్యవస్థలో మార్పు...నంద్యాల నుంచి ప్రారంభం కావాలి
- దెయ్యాలు డబ్బు పంచి ప్రమాణం చేయిస్తాయి..
- దైవాన్ని తలచుకుని ధర్మం, న్యాయం వైపు నిలబడండి
- పాపానికి ఓటెయ్యాలని ఏ దేవుడూ చెప్పడు
- నాపై మీ ప్రేమాభిమానాలు చూసి బాబు వెన్నులో వణుకు
- మూడున్నరేళ్లలో ఒక్క హామీనైనా నెరవేర్చలేదు..
- హామీలిచ్చి మోసం చేసే నేతల కాలర్‌పట్టుకునే రోజులు రావాలి
- నంద్యాల అభివృద్ధి నాకు వదిలేయండి..
- నవరత్నాలకూ ఇక్కడి నుంచే నాంది
- నంద్యాలలో ప్రతిపక్షనేత ఎన్నికల ప్రచారం ముగింపు..

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి

'ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయండి.. రాబోయే రోజుల్లో నవరత్నాల వెలుగులకు నంద్యాల నుంచే నాంది పలకండి' అని ప్రతిపక్షనేత, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

'ఇవాళ మూడున్నర సంవత్సరాల తర్వాత చంద్రబాబు పరిపాలకు తీర్పు ఇవ్వబోతున్నాం. చంద్రబాబు మోసాలకు వ్యతిరేకంగా మీరు ఓటు వేయబోతున్నారు. ఆయన చేసిన అవినీతికి, దుర్మార్గానికి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నాం. రాజకీయ వ్యవస్థలో విశ్వసనీయత లేకపోతే ప్రజాస్వామ్యం

మిగతా 2వ పేజీలో ▶



నెలాఖరున 'జలసిరికి హారతి'

- 'పోలవరం' కాంక్రీట్ పనులను వేగవంతం చేయండి
- జలవనరుల శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

7 లో

ఇదండీ సంగతి



....సెల్ఫీ ప్లీజ్!

ఎన్నికల కోడ్ అపహాస్యం!

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తున్న అధికారపార్టీ నేతలు

- సమయం దాటిన తర్వాత ప్రచారం చేసిన మంత్రి అఖిల
- రాత్రి పొద్దుపోయేవరకూ జిల్లాలోనే మంత్రులు
- వైఎస్సార్‌సీపీ నేతలపై కొనసాగుతున్న దాడులు
- విపక్ష ఎమ్మెల్సీ గంగుల ఇంట్లో సోదాలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఎన్నికల కోడ్‌ను అధికారపార్టీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ప్రచార సమయం ముగిసిపోవడంతో సోమవారం సాయంత్రం 5 గంటల తర్వాత ఇతర జిల్లాలకు చెందిన వారు జిల్లా వదిలివెళ్లాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే, ఆ ఆదేశాలను మంత్రులు లెక్కచేయలేదు. ముగ్గురు మంత్రులు బనగానపల్లె ఎమ్మెల్యే ఇంట్లో

మిగతా 6వ పేజీలో ▶

పట్టపగలే చిమ్మచీకట్లు

- అమెరికాలో కనువిందు చేసిన సంపూర్ణ సూర్య గ్రహణం.. 14 రాష్ట్రాల్లో పూర్తిగా.. మిగతా రాష్ట్రాల్లో పాక్షికంగా..

12 లో



సోమవారం ఓరెగావ్ రాష్ట్రంలోని రెడ్మండ్‌లో సంపూర్ణ సూర్యగ్రహణ దృశ్యం



చేతులు కలిపారు

ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల విలీనం

- డిప్యూటీ సీఎం, పార్టీ కన్వీనర్‌గా పన్నీర్..సీఎం, పార్టీ కో కన్వీనర్‌గా పళని
- శశికళ తొలగింపునకు త్వరలో జనరల్ కౌన్సిల్ భేటీకి నిర్ణయం
- నేడు గవర్నర్‌ను కలవనున్న శశికళ వర్గం ఎమ్మెల్యేలు

12 లో

నేడే 'కృష్ణా' పంచాయితీ

- అనుమతి లేకుండా ప్రాజెక్టులు నిర్మిస్తున్నారంటూ కేంద్రానికి రెండు తెలుగు రాష్ట్రాల ఫిర్యాదు
- కేంద్రం ఆదేశాలతో విజయవాడలో కృష్ణా బోర్డు భేటీ
- ఎనిమిది అంశాలతో సమావేశం అజెండా ఖరారు

7 లో

విశ్రాంత ఐఏఎస్ పీవీఆర్‌కే ప్రసాద్

కన్నుమూత



13 లో

- పంజాగుట్ట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్ర సర్వీసుల్లో వివిధ హోదాల్లో పనిచేసిన ప్రసాద్

29న కాకినాడ మున్సిపాలిటీకి సెలవు

సాక్షి, అమరావతి: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఈ నెల 29న ఎన్నికలు జరగనుండటంతో ఆ రోజు కార్పొరేషన్ పరిధిలో సెలవు ప్రకటిస్తున్నట్టు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. స్థానిక సెలవుగా ప్రకటించాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించారు.

రేపట్నుంచి భారీ వర్షాలు!

రెండ్రోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురవడానికి పరిస్థితులు మళ్లీ అనుకూలంగా మారుతున్నాయి. మూడు రోజుల క్రితం ఏర్పడిన అల్పపీడనం ప్రస్తుతం నైరుతి మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతోంది. ఇది క్రమేపీ బలహీనపడనుంది. అది అరేబియా సముద్రం వైపు పయనించిన అనంతరం ఒకట్రెండు రోజుల్లో పశ్చిమ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయి. మరోవైపు ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు రాయలసీమ, తెలంగాణల మీదుగా అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. అదే సమయంలో రుతుపవనాల ద్రోణి శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం వరకు విస్తరించి ఉంది. వీటన్నిటి ఫలితంగా మంగళవారం రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం తెలిపింది. బుధవారం నుంచి మూడు రోజుల పాటు కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల మోస్తరుగాను, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గడచిన 24 గంటల్లో టెక్కలిలో 4 సెం.మీ., సూళ్లూరుపేట, నగరి, తొట్టంబేడుల్లో 3, పాతపట్నం, తిరుపతిల్లో 2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.



నంద్యాలలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ముగింపు సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్. చిత్రంలో పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి



నంద్యాలలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ రోడ్డులో అశేష ప్రజానీకానికి అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

ధర్మానికే ఓటెయ్యండి

▶ మొదటి పేజీ తరువాయి

దిగజారిపోతుంది. ఎన్నికలప్పుడు హామీలిచ్చి, తర్వాత మోసం చేసే నాయకులను ప్రజలు కాలర్ పట్టుకుని నిలదీసే రోజు రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.' అని జగన్ పేర్కొన్నారు. 'మీ దగ్గరకు డబ్బు మూటలతో వస్తారు.. రూ. 5వేలు చేతిలో పెట్టి జేబులో నుంచి దేవుడి బొమ్మ తీస్తారు.. అది చూపించి ప్రమాణం చేయమంటారు. ఆ క్షణంలో ఒక్కసారి కళ్లు మూసుకుని దేవుడా.. ధర్మం వైపు ఉండేలా చూడమని ప్రార్థించండి. ఏ దేవుడైనా పాపానికి ఓటు వేయమని చెప్పడు.. దెయ్యాలు మాత్రమే అలా అడుగుతాయి. రేపు ఆ దెయ్యాలు వస్తాయి.. జాగ్రత్తగా ఉండండి. ధర్మానికి.. న్యాయానికి ఓటేయండి' అని ఆయన నంద్యాల ప్రజలకు పిలుపునిచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఉప ఎన్నికల ముగింపు ప్రచార సభలో మాట్లాడారు. నంద్యాల ప్రజలు తనపై చూపిస్తోన్న ప్రేమానురాగాలను చూసి చంద్రబాబు వెన్నులో భయంపుట్టిందని, అందుకే అడ్డదారుల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని జగన్ వ్యాఖ్యానించారు. నంద్యాల అభివృద్ధి బాధ్యతను తనపై మోపి నీతిని, ధర్మాన్ని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సభలో ఇంకా ఆయన ఏమన్నారంటే....

మార్పునకు నంద్యాలే నాంది కావాలి..

''చంద్రబాబునాయుడు ఎన్నికలముందు ఇచ్చిన హామీలనే మళ్లీ అరిగిపోయిన టేప్ రికార్డర్ ఆన్‌చేసి వల్లిస్తున్నాడు.. మళ్లీ మళ్లీ అవే అబద్ధాలు.. అవే మోసాలు. ఇలాంటి వ్యక్తులకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదు.. తెలుగుదేశం వంటి పార్టీలను బంగాళాఖాతంలో కలపండి. తాను సీఎంను అనే అహంకారంతో ఏమైనా చెయ్యొచ్చని.. పోలీసులు తన చేతిలో ఉన్నారని, చంద్రబాబు అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేస్తున్నారు.. మొన్న గోస్పాడులో పర్యటించినప్పుడు ఓ రైతు చంద్రబాబుని ఆ రోజు అక్కడే ఉండమని కోరాడు.. రేపు బ్యాంకుకు వెళదాం.. రుణాలు మాఫీ కాలేదు అని అన్నాడు. దీంతో సీఎం నీవు జగన్ మనిషివని కన్నెర్రజేశాడు.. 2019లో జరిగే కురుక్షేత్ర సంగ్రామంలో కూడా బాబు ఎన్నికల సమయంలో వస్తాడు ప్రతి ఇంటికి మారుతికారు, కేజీ బంగారం అంటాడు. మోసం చేసేవారికి ఓటెయ్యమని అడుగుతాడు. అందుకే ఈ వ్యవస్థను మారుద్దాం. అందుకు ఈ నంద్యాల ఉప ఎన్నికలు నాంది కావాలి. ఇక్కడి నుంచే మార్పు మొదలైతే శ్రీకాకుళం వరకు వెళుతుంది. అభివృద్ధి గురించి చంద్రబాబు మాట్లాడుతూ టీడీపీకి ఓటు వేయకపోతే నంద్యాల అభివృద్ధి ఆగిపోతుందంటున్నాడు. షాపులు కూలదోయించి గజానికి రూ. 18వేలు నష్టపరిహారం చెల్లిస్తానంటున్నాడు. అదే గజం స్థలం మార్కెట్ ధర రూ. 1.10 లక్షలు పలుకుతోంది. ఇదేనా అభివృద్ధి?

ఒక్క హామీ అయినా నెరవేర్చారా..?

కర్నూలులో 2014 ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేసిన చంద్రబాబునాయుడు జెండా సాక్షిగా అనేక హామీలు ఇచ్చాడు. ఆనాడు ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా నెరవేర్చాడా..? కర్నూలులో విమానాశ్రయం ఏర్పాటు చేశాడా..? కర్నూలును స్మార్ట్ సిటి చేస్తానన్నాడు..? చేశాడా..? కర్నూలులో ట్రిపుల్‌ఐటీ కళాశాల అన్నాడు.. వచ్చిందా..? కర్నూలులో స్విమ్స్ తరహా ఆసుపత్రి అన్నాడు.. కట్టించాడా..? అవుకు దగ్గర ఇండస్ట్రియల్ కారిడార్, కోవెలకుంట్ల వద్ద సిమెంట్ ఉత్పత్తుల హబ్, కర్నూలులో మైనింగ్ స్కూలు, ఉర్దూ యూనివర్శిటీ, ఆదోని – ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ క్లస్టర్, అపారెల్ పార్కులు ఏర్పాటు చేస్తానన్నాడు.. చేశాడా..? చివరకు రైతులను మోసం చేస్తూ కేసీకెనాల్ ఆయకట్టు స్థిరీకరణ, గుండ్రేవుల ప్రాజెక్టు కడతానన్నాడు.. కట్టించాడా..? మూడున్నరేళ్లలో వీటిలో ఏ ఒక్కటైనా చేశాడా? (లేదు లేదు అని జనం ముక్తకంఠంతో జవాబిచ్చారు) చంద్రబాబు ముఖ్యమంత్రి కాకముందు రేషన్‌షాపుకు వెళితే బియ్యం, కందిపప్పు, పామాయిల్, కిరోసిన్, చక్కెర, గోధుమపిండి, తదితర సరుకులు వచ్చేవి.. ఇప్పుడు అవన్నీ వస్తున్నాయా..? (జనం లేదు.. లేదు.. ఒక్క బియ్యం మాత్రమే ఇస్తున్నారని చెప్పారు.) టీవీలో, గోడలపై, మైకుల్లో జాబు రావాలంటే బాబు రావాలని ప్రచారం చేయించాడు.. జాబులు వచ్చాయా..? ప్రతి ఇంటికి రూ. 2వేలు నిరుద్యోగ భృతి ఇస్తానన్నాడు.. ఇచ్చాడా..? ఒక్కొక్క నిరుద్యోగికి ఈ 38 నెలల్లో మొత్తం రూ.76 వేలు చంద్రబాబు బకాయి ఉన్నారు. పొదుపు సంఘాలకు రూ. 14వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తానన్నాడు.. చేశాడా..? సీఎం కావడం కోసం రూ. 87,612 కోట్లు వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తానన్నాడు. చేశాడా? బ్యాంకుల్లోని బంగారం ఇంటికి రావాలంటే బాబు రావాలన్నాడు. బాబు వచ్చాడు. రుణాలు మాఫీ అయ్యాయా?, బంగారం ఇంటికి వచ్చిందా..? ఇప్పుడు బ్యాంకుల్లోని బంగారాన్ని వేలం వేయిస్తున్నారు.

నాన్న నాకిచ్చిన ఆస్తి మీరే

జగన్ మంచి పరిపాలన అందిస్తాడన్న ప్రజల నమ్మకమే నా ఆస్తి.. చంద్రబాబు మాదిరిగా నా దగ్గర డబ్బుల్లేవు. నా దగ్గర ముఖ్యమంత్రి పదవి లేదు. పోలీసుల బలం నా దగ్గర లేదు. చంద్రబాబు మాదిరిగా లేనిది ఉన్నట్టుగా... ఉన్నది లేనట్టుగా చూపించే టీవీ చానళ్లు, రాసే పేపర్లు నా దగ్గర లేవు. చంద్రబాబు మాదిరిగా నా దగ్గర దుర్బుద్ధి లేదు. అధికారం కోసం ఎంతకైనా దిగజారిపోయే మనస్తత్వం అంతకన్నా లేదు. నాకున్న ఆస్తి ఆ ప్రియతమ నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోతూ ఇంత పెద్ద కుటుంబాన్ని నాకిచ్చారు. నాకున్న ఆస్తి నాన్నగారు చేసిన ఆ సంక్షేమ పథకాలు ఇంకా మీ గుండెల్లో బతికే ఉండటం. నాకున్న ఆస్తి 'జగన్ అబద్ధం ఆడడు.. జగన్ మోసం చేయడు. జగన్ మాట ఇస్తే తప్పడు. జగన్ ఏదైనా చెబితే చేస్తాడన్న విశ్వసనీయత'. నాకున్న ఆస్తి విలువలతోకూడిన రాజకీయాలు చేయడం. నవరత్నాలతో జగన్ కూడా ప్రతీ పేదవాడి ఇంట్లో వెలుగులు నింపుతాడు.. అవకాశం ఇస్తే వాళ్ల నాన్న మాదిరిగానే మంచి పరిపాలన అందిస్తాడని ప్రజల్లో ఉన్న నమ్మకమే నాకున్న ఆస్తి. నాకున్న ఆస్తి దేవుడి దయ. మీ దీవెనలే.. మనం గుడికిపోయినా, చర్చికి పోయినా, మసీదుకు పోయినా.. దేవుడి దగ్గరికి కావాలని పోతాం. దేవుడు మనకేం చెబుతాడు? అన్యాయం చేయొద్దు, అధర్మం చేయొద్దు అని చెబుతాడు. మూడేళ్లుగా జరుగుతోన్న అన్యాయాన్ని వ్యతిరేకించండి.. అన్యాయాన్ని ఇప్పుడు తిప్పికొట్టే సమయం వచ్చింది.

నంద్యాల నుంచే నవరత్నాలు

మన ప్రభుత్వం వచ్చిన వెంటనే నవరత్నాల పథకాల అమలుకు నంద్యాల నుంచే శ్రీకారం చుడతా. ప్రతి ఇంటికి పథకాలు చేరాలంటే వ్యవస్థలో మార్పు రావాలి. నంద్యాలను జిల్లాగా చేస్తా. జిల్లాకేంద్రం అయితే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, వివిధ జిల్లాస్థాయి కార్యాలయాలు ఏర్పాటవుతాయి. దీంతో నంద్యాల అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఒక్క సంవత్సరం గట్టిగా దువా చెయ్యమని కోరుతున్నా. ఒక్క సంవత్సరం ఓపిక పడితే.. వచ్చేది మన ప్రభుత్వమే. ఏ పేదవాడూ అప్పుతీసుకుని ఇళ్లు కట్టుకోవల్సిన అవసరం లేదు. ఉచితంగా ఇల్లు కట్టి, రిజిస్ట్రేషన్ చేసిస్తామని మాటిస్తున్నా. నంద్యాల పేద ప్రజలకు మూడున్నర సెంట్లలో ఉచితంగా ఇళ్లు కట్టిస్తా. ఆటోనగర్ వాసులకు ఇళ్లస్థలాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తా. మార్కెట్‌లో ఏ ఒక్కరూ రాయల్టీ కట్టాల్సిన అవసరం లేకుండా చేస్తా. రోడ్డు విస్తరణ పనుల్లో వ్యాపార సముదాయాలు పోగొట్టుకున్న వారికి మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లిస్తా. రైతులకు కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరించడంతోపాటు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తా. అగ్రిగోల్డ్, కేశవరెడ్డి ఆస్తుల వెనుక చంద్రబాబు బినామీలే ఉన్నారు. అగ్రిగోల్డ్, కేశవరెడ్డి బాధితులకు హామీ ఇస్తున్నా.. మన ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే బాధితులకు ఇవ్వాల్సింది పూర్తిగా చెల్లిస్తాం. వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని ఏం చేయాలో ప్రభుత్వం చూసుకుంటుంది అడ్డుపడితే.. అవసరమైతే చంద్రబాబు చొక్కా ఇప్పిస్తాం. ఆదినారాయణరెడ్డి నిక్కర్ కూడా విప్పిస్తాం. వెళ్లే ముందు ఒక్క విషయం చెప్పాలి.. పార్టీ గుర్తు గుర్తుంచుకోండి. ప్రజల్ని అయోమయానికి గురిచేయడానికి ఎస్.మోహన్‌రెడ్డి అనే పేరుతో 10 మందితో నామినేషన్ వేయించారు. అందుకే గుర్తు గురించి మళ్లీ ఒకసారి చెబుతున్నా.. ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి '' అంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉప ఎన్నికల ప్రచారానికి ముగింపు పలికారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రెహమాన్, మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే నంద్యాల గుర్తొచ్చిందా..!

నందిగామలో 2014లో టీడీపీ ఎమ్మెల్యే చనిపోతే సానుభూతితో అక్కడ వైఎస్ఆర్‌సీపీ పోటీ పెట్టలేదు. పోటీ లేకపోవడంతో నందిగామ ముఖం కూడా సీఎం చూడలేదు. ఉప ఎన్నికలు రావడంతో నంద్యాలకు ఎప్పుడూ రాని చంద్రబాబు ఇప్పుడు వచ్చారు. ప్రజలతో పని ఉంటేనే ఆయన నోటి వెంట వాగ్దానాలు వస్తాయి. మూడున్నరేళ్లుగా నంద్యాలను పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు ఇళ్లు కట్టిస్తానని, రోడ్లు వేయిస్తానని చెబుతున్నాడు. అభివృద్ధి అంటే రెండు కిలోమీటర్ల మేర భవనాలన్నీ కూలదోసి రోడ్డు వెడల్పు పేరుతో ప్రజలను రోడ్డున పడేయటం కాదు. పక్కా గృహాల పేరుతో పేదల సొమ్మును ఎలా దోపిడీ చేయొచ్చన్న ప్రణాళికలు రచించారు. రూ. 3 లక్షలు విలువజేసే 300 అడుగుల ఫ్లాట్‌ను రూ. 6 లక్షలకు అంటగట్టాలని నిర్ణయించి ఈ పనులను తన బినామీ కాంట్రాక్టర్‌కి అప్పగించాడు. మామూలుగా అయితే ఎస్ఎఫ్‌టీ వెయ్యి రూపాయిలతో పక్కా గృహాల నిర్మాణం పూర్తి చేయవచ్చనిఎవరైనా చెబుతారు. అయితే నంద్యాలలో చంద్రబాబునాయుడు మాత్రం ఎస్ఎఫ్‌టీకి రూ. 2,078 వేలుగా నిర్ణయించి ప్రజలను అప్పుల పాలు చేసేందుకు సిద్ధమయ్యాడు. రూ. 1.50 లక్షలు కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మరో రూ.1.50 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన రూ. 3లక్షలు పేదకుటుంబాలు నెల నెల రూ. 3వేలు చొప్పున 20 ఏళ్లపాటు చెల్లించాలని చెబుతున్నాడు. చంద్రబాబు లంచాలు రైతులు చెల్లించాలా?. చంద్రబాబు చేసే మోసానికి వ్యతిరేకంగా నంద్యాల ప్రజలు ఓటు వేయాలి.

మీ ఓటు రహస్యమే

▶ మొదటి పేజీ తరువాయి

అంధులకు బ్రెయిలీ లిపి ద్వారా ఓటు వేసే సదుపా యం కల్పించామని తెలిపారు. ఓటరు ఎవరికి ఓటు వేసిందీ ఇతరులెవరికీ తెలిసే అవకాశం లేదని, పోలింగ్ బూత్‌లో ఓటరు తాను వేసిన ఓటును ఏడు సెకన్ల పాటు చూసుకోవచ్చన్నారు. నియోజకవర్గ పరిధిలో 15 వేలమంది ఓటర్లకు ఓటింగ్ స్లిప్‌లు ఇవ్వలేదని, వీరిలో స్థానికంగా లేనివారు, డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్టుగా గుర్తించామన్నారు. అనుమానా స్పద ఓటర్ల జాబితాను పోలింగ్ బూత్‌ల్లో అందుబా టులో ఉంచామని, విచారించిన తర్వాత వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు.

ఛానెళ్లపై నిఘా: రాష్ట్రంలోని 16 తెలుగు ఛానెళ్లను 24 గంటలూ వాచ్ చేస్తున్నామని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ప్రసారాలు చేసినా చర్యలు తప్పవని భన్వర్‌లాల్ హెచ్చరించారు. పోలింగ్ పూర్తయ్యేవరకు ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్, చర్చలను అనుమతించవద్దని ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలను కోరారు. పోలింగ్ ఫలితాలను ప్రభావితం చేసేలా ఎలాంటి కథనాలు ప్రసారం చేసినా దాన్ని ఎన్నికల నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తామని చెప్పారు. సామాజిక మాధ్యమాలు, వాట్సప్, బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం కొసాగుతుందన్నారు. వీటిని కూడా ఎన్నికల సిబ్బంది గమనిస్తున్నారని, ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని చెప్పారు. ఓటర్లు తమకు ఎలాంటి అసౌకర్యం కలిగినా, పార్టీలు నిబంధనలు ఉల్లంఘించినా 9223166166 అనే నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో డబ్బులు పంపిణీ చేసినట్టు వచ్చిన ఫిర్యాదులపై భన్వర్‌లాల్ స్పందించారు. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ కోరిందని, తమకు అందిన వివరణతో జిల్లా కలెక్టర్ ఓ నివేదిక పంపారని, అయితే, దాన్ని మరోసారి పరిశీలించి నివేదిక పంపాలని ఆయన్ను కోరినట్టు తెలిపారు. ఇప్పటివరకు రూ.1.16 కోట్ల నగదు సీజ్ చేశామని, 316 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. మద్యం అమ్మకాలపై బుధవారం సాయంత్రం వరకు నిషేధం ఉంటుందన్నారు.

ప్రతి రోజూ కిర్లంపూడికి వెళ్లువెత్తండి..

- నిరసనల హోరుతోనే సర్కారు దారికి వస్తుంది
- కాపు ఉద్యమనేత ముద్రగడ

జగ్గంపేట

రాష్ట్రవ్యాప్తంగా కాపుల నిరసనలతోనే ప్రభుత్వం దిగివచ్చి పాదయాత్రకు అనుమతి వస్తుందని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అన్నారు. అప్పటి వరకు ప్రతిరోజూ తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడికి తరలి రావాలని కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గీయులకు పిలుపునిచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల హామీని అమలు చేసి, కాపు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ చలో అమరావతి పాదయాత్ర తలపెట్టిన ముద్రగడను గత నెల 26 నుంచి ఇంటి వద్దనే నిలువరించడంతో ముద్రగడ తన పంథాను మార్చుకున్నారు. పాదయాత్రకు అనుమతి వచ్చేవరకు భిన్నమైన నిరసనలకు తెర తీశారు. ఇంటి గేటు వద్ద భారీగా ఏర్పాటు చేసిన శిబిరాలలో కాపు జేఏసీ నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారితో రోజు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిరసన సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఉదయం పది గంటలకు శిబిరంలో కూర్చుంటున్న ఆయన సాయంత్రం ఐదు గంటల వరకు తనదైన శైలిలో నిరసన తెలియజేస్తున్నారు.

ఐదోరోజు నిరసన అనంతరం ఆయన ప్రసంగిస్తూ చంద్రబాబు పోలీసులను అడ్డు తొలగించే వరకు పోరు ఆగదన్నారు. యువత సామాజిక మాధ్యమాల ద్వారా కాపు రిజర్వేషన్ల ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని, గ్రామాలలో ప్రతిరోజూ నిరసనలు కొనసాగించాలని, విజయం అంచున ఉన్నందున ఉద్యమ తీవ్రత కనిపించేలా ప్రభుత్వానికి నిరసనలు తెలియజేశాలని పిలుపునిచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి సోమవారం పెద్ద సంఖ్యలో కాపులు వచ్చి, ముద్రగడకు మద్దతు తెలిపారు. అనపర్తి నుంచి వచ్చిన కాపు వర్గీయులు 'జై ముద్రగడ', 'కాపు రిజర్వేషన్లను తక్షణం ఇవ్వాలి' అని నినాదాలు చేశారు. కాపు జేఏసీ నాయకుడు తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జగ్గంపేట నియోజకవర్గం నుంచి భారీగా మోటారు సైకిళ్లపై తరలివచ్చి ముద్రగడకు మద్దతు తెలిపారు. కిర్లంపూడి మండలం సింహాద్రిపురానికి చెందిన కాపులు ఎడ్ల బళ్లపై తరలివచ్చారు. పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన మహిళలు తరలివచ్చి ముద్రగడకు మద్దతుగా మెయిన్‌రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు.



కిర్లంపూడిలో సోమవారం ఏడు గంటల పాటు బైఠాయించిన అనంతరం ప్రసంగిస్తున్న కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం

రాష్ట్రంలో ఏయూ నంబర్ వన్

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఆంధ్రా యూనివర్సిటీ మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు అవుట్‌లుక్ మేగజీన్ ర్యాంకింగ్స్ కేటాయించిందని వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యా సంస్థలకు అందించిన ర్యాంకింగ్‌లో ఏయూ 20వ స్థానంలో నిలిచిందన్నారు. ఉన్నత విద్యారంగంలో పనిచేస్తున్న విశ్వవిద్యాలయాలకు అవుట్‌లుక్ ఇటీవల ర్యాకింగ్‌లను విడుదల చేసింది. అకడమిక్స్, విద్యార్థుల అభివృద్ధి, మౌలిక వసతులు తదితర విభాగాల్లో వర్సిటీ సామర్థ్యాన్ని గణించి ఏయూకు ఈ ర్యాంక్ అందించింది. దేశంలో ప్రభుత్వ వర్సిటీల్లో 14వ స్థానం, రాష్ట్ర వర్సిటీల్లో ప్రథమ స్థానంలో ఏయూ నిలిచింది.



తెలుగు రాష్ట్రాల వైద్య విద్యార్థులకు అన్యాయం

అడ్మిషన్లు పొందిన అభ్యర్థుల భర్తీ ప్రక్రియను నిలిపేసిన కేంద్రం

సాక్షి, అమరావతి : దేశవ్యాప్తంగా వివిధ వైద్య విద్యా సంస్థల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్య సీట్లను పొందిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇప్పటికే అడ్మినషన్‌లు పొందిన 64మంది అభ్యర్థుల భర్తీ ప్రకియను కేంద్రం రద్దుచేసింది. ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష ద్వారా సూపర్‌స్పెషాలిటీ సీట్లకు కౌన్సెలింగ్ జరిగింది. తమ సీట్లు తమకే కావాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు కేంద్రానికి లేఖ రాశాయి. కొంత మంది విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు తెలుగు రాష్ట్రాల సీట్లు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులతోనే భర్తీ చేయాలని, 371–డి ఆర్టికల్‌ను అమలుచేయాలని సూచించింది. ఈ సందర్భంగా ఇప్పటికే వైద్య సీట్లు పొందిన 64మంది అభ్యర్థుల సీట్లను సీబీఎస్‌సీ రద్దు చేసింది. వీరు తెలుగురాష్ట్రాలకే పరిమితమని అక్కడే సీట్లు పొందాలని సూచించింది. దీంతో సీట్లు పొందిన వైద్య విద్యార్థులు కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలవనున్నారు.

మున్సిపల్, పీఆర్ టీచర్లకు హాఫ్ పే సెలవుల పెంపు

సాక్షి, అమరావతి: పదవీ విరమణ అనంతరం ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే హాఫ్ పే లీవ్స్ (సగం వేతనం ఇచ్చే సెలవులు)ను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖల్లో పనిచేస్తున్న టీచర్లతో పాటు ఎయిడెడ్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంపై రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, కొండయ్యలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు బీసీ అభ్యర్థులకు అగ్రి ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయాల పరిధిలో బీఎస్సీ, బీటెక్, బీవీఎస్సీ, బీఎఫ్ఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం బీసీ– సీ, డీ, ఈ గ్రూపుల అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయి. లాం ఫారంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఈ కౌన్సెలింగ్ జరుగుతుంది. బుధవారం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని రిజిస్ట్రార్ డాక్టర్ టీవీ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా ఇంటర్వ్యూలు జరుగుతాయి. ఇతర వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

'జీఎస్టీ'లో పుట్నాల పప్పుపై స్పష్టతివ్వాలి

వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు మిల్లర్స్ అసోసియేషన్ వినతి



సోమవారం కమిషనర్‌ను కలిసిన ఏపీ ఫ్రైడ్‌గ్రామ్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

కంకిపాడు (పెనమలూరు): ఫ్రైడ్‌గ్రామ్‌కు జీఎస్టీ మినహాయింపుపై స్పష్టత ఇవ్వాలని ఏపీ ఫ్రైడ్‌గ్రామ్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. జీఎస్టీ మినహాయింపుపై ఈడుపుగల్లులోని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఎస్టీ మినహాయింపుల్లో పప్పులకు అవకాశం ఇచ్చారన్నారు. శనగల ఉప ఉత్పత్తి అయిన వేయించిన పప్పులు (పుట్నాలు)కు జీఎస్టీ వర్తిస్తుందని కొన్ని జిల్లాల్లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారన్నారు. జీఎస్‌డీ కోడ్ 07136000లో పప్పులు, ఫ్రైడ్‌గ్రామ్‌ను జీఎస్టీ నుంచి మినహాయించినట్లు చూపుతోందన్నారు. పప్పులు, వాటి ఉప ఉత్పత్తులకు పన్నులో మినహాయింపు ఉందన్నారు. జీఎస్టీ మినహాయింపుపై స్పష్టమైన ప్రకటన చేస్తే అధికారులకు, వ్యాపారులకు అవగాహన కలుగుతుందన్నారు. దీనిపై అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సుబ్బయ్య, కోశాధికారి సురేంద్రనాథ్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు గుర్తింపు

మంత్రి కామినేని శ్రీనివాస్



సాక్షి, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులను గుర్తించి ప్రభుత్వ పరంగా చట్టబద్ధమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు శిక్షణ ఇవ్వడంతోపాటు సర్టిఫికెట్ కూడా అందజేస్తామన్నారు. ఏపీ పారా మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి సమస్యలు విన్నవించారని, 40 ఏళ్లుగా ప్రభుత్వ గుర్తింపు కోసం పోరాడుతున్నట్లు వారు చెప్పారన్నారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించి గుర్తింపునిచ్చేందుకు సుముఖత వ్యక్తంచేశారని, మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేయనున్నట్టు కామినేని చెప్పారు. ఆరు నెలలపాటు మెడికల్ కళాశాలలో శిక్షణ పొందాలని, ఆ తర్వాత 104 వాహనంలో 3 నెలలు పనిచేసిన తర్వాత రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. అందులో ఉత్తీర్ణులైతే వారికి గుర్తింపునిస్తూ ప్రభుత్వం సర్టిఫికెట్ ఇస్తుందన్నారు. ఆయుష్ ఉద్యోగులకు వేతన బకాయిలు కూడా త్వరలో చెల్లిస్తామని ఓ ప్రశ్నకు కామినేని సమాధానం చెప్పారు.

వైద్యులు స్థానికంగా ఉండాలి: పనిచేస్తున్న చోటే వైద్యులు నివాసముండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంత్రి కామినేనితో కలిసి సోమవారం ఆయన సచివాలయంలో సమీక్షించారు. డెంగీ, క్షయ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం 463 పీహెచ్‌సీలను 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు సీఎస్‌కు వివరించారు. సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు శిశువులను మార్చేశారు

- ఒకరికి పుట్టిన శిశువు వేరొకరికి అప్పగింత
- 13 గంటల తర్వాత పొరపాటు అంగీకరించిన వైద్యురాలు
- విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన



మాధురికి పుట్టిన శిశువును అపర్ణలక్ష్మికి పుట్టినట్టు వేసిన ట్యాగ్

విజయనగరం ఫోర్ట్ : ఇద్దరు మహిళలకు అరగంట తేడాలో పుట్టిన శిశువులను ఒకరిది మరొకరికి అప్పగించేశారు. 13 గంటల తర్వాత పొరపాటు గుర్తించారు. తూచ్.. 'ఈ బిడ్డ మీ బిడ్డ కాదు.. అది వేరేవారి బిడ్డ, మార్చుకోండి' అని డాక్టర్ చెప్పడంతో ఓ శిశువు తండ్రి అభ్యంతరం తెలిపారు. ఈ సంఘటన విజయనగరంలోని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం వెనుకనున్న సాయి పీవీఆర్ ఆస్పత్రిలో సోమవారం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు.. విజయనగరం పట్టణంలోని పూల్‌బాగ్ కాలనీకి చెందిన బొడ్డు అపర్ణలక్ష్మి అనే గర్భిణి ఈ నెల 19న పీవీఆర్ ఆస్పత్రిలో ప్రసవం కోసం చేరారు. అదే విధంగా విజయనగరం మండలం చెల్లూరుకు చెందిన మాధురి అనే గర్భిణి కూడా ఇదే ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12.40 గంటలకు మాధురికి ఆపరేషన్ చేయగా ఆడపిల్ల జన్మించింది. 12:55 గంటలకు అపర్ణకు శిశువు పుట్టినట్టు ట్యాగ్‌వేసి అపర్ణ తల్లిదండ్రులు, బంధువులకు అప్పగించారు. అలాగే, 1.15గంటలకు అపర్ణకు సిజేరియన్ చేయగా ఆమెకూ ఆడపిల్ల జన్మించింది. 1:30 గంటల ప్రాంతంలో ఆ శిశువును మాధురి బంధువులకు అప్పగించారు. అయితే, మాధురి భర్తకు అనుమానం కలిగి ముందు తన భార్యకు కదా సిజేరియన్ చేశారు, ముందు వాళ్లకు ఎలా శిశువునిచ్చారని డాక్టర్‌ను అడిగారు. అనుమానం వచ్చిన వైద్యురాలు సీసీ ఫుటేజీని పరిశీలించి రాత్రి 2 గంటల సమయంలో... పొరపాటు జరిగిందని అపర్ణకు వైద్యురాలు సుధాకుమారి చెప్పి శిశువులను మార్చడానికి ప్రయత్నిస్తుండగా ఆమె బంధువులు అడ్డుకున్నారు. ఈలోగా అపర్ణ ఇజ్రాయిల్లో ఉన్న తన భర్త వెంకటేశ్వరావుకు ఫోన్ ద్వారా విషయాన్ని చెప్పారు. ఆయన డీఎన్ఏ పరీక్ష చేసి నిర్ధారణ అయిన తర్వాతే శిశువులను మార్చాలని ఫోన్‌లో వైద్యురాలికి స్పష్టంచేశారు. అలాగే ఈ విషయంపై కేంద్ర మంత్రి మేనకాగాంధీ, ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య, డీఎంహెచ్‌ఓ పద్మజ తదితరులకు మెయిల్ ద్వారా ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సి. పద్మజ సోమవారం ఆస్పత్రిలో విచారణ జరిపారు. కాగా, అపర్ణ భర్త డిమాండ్ మేరకు డీఎన్ఏ పరీక్ష చేయించి ఎవరి శిశువులను వారికి అప్పగిస్తామని ఆస్పత్రి డాక్టర్ సుధాకుమారి తెలిపారు.

దళితుల అభివృద్ధిని అడ్డుకుంటున్న సీఎం: చెంగయ్య

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): దళితుల అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకుంటున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య విమర్శించారు. విజయవాడలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దళితులపై ఆయన మంత్రివర్గ సహచరుడు అనుచిత వ్యాఖ్యలు చేసినా చంద్రబాబు స్పందించలేదని మండిపడ్డారు. చంద్రబాబు దళిత వ్యతిరేకి అనడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదన్నారు. నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీని ఓడించాలన్నారు. మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి దళితుల ఐక్యతను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.

'చలపతి'లో నూతన భవనం ప్రారంభం

గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాం గ్రామంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో సోమవారం యలమంచిలి సీతారామయ్య మెమోరియల్ బ్లాక్‌ను కేంద్ర మంత్రి సుజనాచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న కాలంలో ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు, పరిశోధనల్లో మరిన్ని అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్యే ఎం. వేణుగోపాల్‌రెడ్డి, చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన కాల్ సెంటర్

- ఆగిన 108 అంబులెన్సు సేవలు
- అల్లాడిన 'గ్రామీణ' బాధితులు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్సు కాల్ సెంటర్ వ్యవస్థ సుమారు 22 గంటలపాటు స్తంభించటంతో బాధితులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఈనెల 20న హైదరాబాద్‌లో ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో బీఎస్ఎన్ఎల్ లైన్లకు అంతరాయం ఏర్పడటంతో 108 అంబులెన్సులకు వచ్చే ఫోన్‌కాల్స్ స్తంభించినట్టు గుర్తించారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు సమస్య తలెత్తగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు పరిష్కరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీంతో 108 అంబులెన్సుల కోసం ఈఎంఆర్ఐకి ఫోన్‌కాల్స్ చేసిన వారు అవస్థలు పడ్డారు. 108కి నిత్యం సుమారు 1700కు పైగా ఎమర్జెన్సీ (అత్యవసర) కాల్స్ వస్తుంటాయి. కాల్ సెంటర్ లైన్లు పనిచేయకపోవటంతో గ్రామీణ ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్లు, ఆస్పత్రులకు ఫోన్లు చేసి అక్కడ్నుంచి అంబులెన్సు పైలట్ ఫోన్ నెంబర్లకు మళ్లించారు. కొంత మంది బాధితులు ప్రైవేట్ వాహనాలను మాట్లాడుకుని ఆస్పత్రులకు చేరుకున్నారు. గర్భిణులకు సైతం అగచాట్లు తప్పలేదు. అయితే 70 శాతం మాత్రమే సమస్య పరిష్కారమైనట్టు ఈఎంఆర్ఐ అధికార వర్గాలు తెలిపాయి. 108 అంబులెన్సులను ప్రారంభించిన నాటినుంచి ఇన్ని గంటలపాటు కాల్ సెంటర్ స్తంభించడం ఇదే తొలిసారని కుటుంబ సంక్షేమశాఖ అధికారి ఒకరు తెలిపారు.

గ్రూప్-3 మెయిన్స్‌లో అభ్యంతరాలుంటే 29 లోపు తెలపాలి

అభ్యర్థులకు ఏపీపీఎస్సీ సూచన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 1,055 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల భర్తీకి ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించిన గ్రూప్– 3 మెయిన్స్‌కు సంబంధించిన జవాబుల్లో అభ్యంతరాలుంటే ఈ నెల 29 లోపు తెలపాలని ఏపీపీఎస్సీ కార్యదర్శి వై.వి.ఎస్.టి.సాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్ 1, 2 ప్రశ్నాపత్రం సెట్లను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ నెల 8నే రెస్పాన్స్ షీట్లు, కీ విడుదల చేశామని, అయితే మాస్టర్ ప్రశ్నపత్రం సెట్ వెబ్‌సైట్లో పెట్టనందున తాజాగా వాటిని పొందుపరిచినట్లు వివరించారు. మాస్టర్ సెట్‌లోని సరైన జవాబులను రెస్పాన్స్ షీట్ల ద్వారా సరి చూసుకొని అభ్యర్థులు తమ అభ్యంతరాలను కమిషన్‌కు తెలపవచ్చని పేర్కొన్నారు.

సాక్షి
మంగళవారం, ఆగస్టు, 22

మళ్లీ ఘోర ప్రమాదం

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా ఖతౌలి సమీపాన శనివారం పూరీ–హరిద్వార్ ఉత్కళ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ప్రమాదం మరోసారి రైల్వే శాఖ లోపాలను పట్టిచూపింది. 22మంది నిండు ప్రాణాలు తీసి, మరో 156 మంది గాయాలపాలు కావడానికి దారి తీసిన ఈ దుర్ఘటనకు మానవ తప్పిదమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదాల్లో మానవ తప్పిదం విషయాన్ని వెనువెంటనే ఆ శాఖ అంగీకరించడం చాన్నాళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అంతే కాదు... కార్యదర్శి స్థాయి రైల్వే బోర్డు అధికారిని సెలవుపై పంపి, నలుగురు అధికారులను సస్పెండ్ చేయడంతోపాటు ఒకరిని బదిలీచేశారు. ప్రమాదం జరిగాక రైల్వే సిబ్బందిలో ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ వెల్లడికావడం వల్ల ఇంత చురుగ్గా వ్యవహరించి ఉండొచ్చు. ఆ సంభాషణ ప్రమాదం జరిగిన పట్టాలపై వెల్డింగ్ పనులు నడుస్తున్నాయని నిర్ధారిస్తోంది.

ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని రైల్వే శాఖ తరచు చెబుతుంటుంది. కానీ చాలా ప్రమాదాలు పట్టాలు తప్పడం కారణంగానే చోటు చేసుకుంటున్నాయి. శనివారంనాటి ప్రమాదానికి కేవలం పైనుంచి కింది వరకూ ఉండే సిబ్బంది మధ్య ఏర్పడ్డ సమాచార లోపమే కారణం. పట్టాలపై పనులు సాగుతున్నాయి గనుక 20 నిమిషాలు ఇటువైపు రైళ్లు రాకుండా చూడాలని తాము చెప్పామని కొందరంటుంటే, తనకసలు సమాచారం లేదని స్టేషన్ సూపరింటెండెంట్ చెబుతున్నారు. పట్టాలపై స్వల్ప మరమ్మతులేమైనా ఉంటే ఆ కొద్ది నిడివిలోనూ రైలును అతి నెమ్మదిగా నడుపుతారు. పనుల సంగతిగానీ, అటు వెళ్లకూడదన్న సంగతిగానీ తెలియని డ్రైవర్ యధాప్రకారం వేగంతో నడిపిన కారణంగా 22మంది ప్రాణాలు అర్థాంతరంగా ముగిసిపోయాయి. నిజానికి మరమ్మతులున్న పక్షంలో ఆ పని జరిగే ప్రాంతంవైపు రైళ్లు రాకుండా ఎర్రజెండాలుంచుతారు. కనీసం అది కూడా అక్కడ పాటించి ఉండరని ప్రమాదం జరిగిన తీరును చూస్తే అర్థమవుతుంది. పట్టాల మరమ్మతులు, ఇతరత్రా పనులు చేసేటపుడు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజెప్పే మాన్యువల్ ఉంటుంది. అలాంటి సమయాల్లో ఏ స్థాయి వారి బాధ్యతలేమిటో, ఎవరు ఏఏ పనులు నిర్వర్తించాలో స్పష్టంగా ఆ పుస్తకం వివరిస్తుంది. పైగా మరమ్మతులున్నప్పుడు ముందస్తుగా లిఖితపూర్వక అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. ఏదైనా లోపాన్ని గుర్తించినప్పుడు అత్యవసరంగా పట్టాల్ని మరమ్మతు చేయాల్సి రావొచ్చు. ఆ సమయంలో సైతం పనులకు సంబంధించిన వర్తమానాన్ని అన్ని స్థాయిల్లోనివారికి చేరేయగలగాలి. మరమ్మతుల విషయంలో అక్కడి రైల్వే డివిజన్ మొదలుకొని స్థానిక స్టేషన్ సూపరింటెండెంట్ వరకూ ప్రతి ఒక్కరికీ సమాచారం ఉండి తీరాలి. అప్పుడు మాత్రమే రైలు నడిపే డ్రైవర్‌కు విషయం తెలుస్తుంది. ప్రతి స్థాయిలోనూ అతడికి సూచనలు అందుతాయి. ఆ మార్గదర్శకాలను అనుసరిస్తే ఇలాంటి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదు. ఇందులో ఎక్కడ లోపం జరిగినా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వస్తుంది. నిజానికి సిబ్బంది సంసిద్ధత ఏమేరకు ఉన్నదో తెలుసుకోవడానికి నిర్ణీత కాలవ్యవధిలో కసరత్తులు జరుగుతుండాలి. వాటిల్లో బయటపడే లోపాలపై సమీక్ష నిర్వహించుకుని సరిచేసుకోవాలి. అవి క్రమం తప్పకుండా కొనసాగిస్తుంటే ప్రమాదాలను నివారించవచ్చు. రైల్వే శాఖకొస్తున్న నష్టాలను తగ్గించుకోవడానికి చాన్నాళ్లనుంచి సిబ్బందిని తగ్గించడం, మరీ తప్పనిసరైనప్పుడు కాంట్రాక్టు సిబ్బందిని తీసుకోవడం, అదే సమయంలో ఆధునికీకరణ ప్రక్రియ చురుగ్గా ముందుకు సాగకపోవడం వంటివి సమస్యలు తెస్తున్నాయని రైల్వే యూనియన్లు ఆరోపిస్తుంటాయి. సిబ్బందిపై పని భారం విపరీతంగా పెరిగిపోవడం వల్ల వారికి దేనిపైనా సమగ్రంగా దృష్టి సారించడం సాధ్యం కావడంలేదన్న ఆరోపణకూడా ఉంది. విస్తృతమైన దర్యాప్తు చేస్తే తప్ప ఇప్పుడు జరిగిన ప్రమాదంలో వీటి భాగమెంతో తెలియదు. ప్రమాదం జరిగినప్పుడల్లా పట్టాలను మెరుగుపర్చడానికి, వాటి యాజమాన్య నిర్వహణకు వినియోగిస్తున్న లేదా వినియోగించబోతున్న సాంకేతికత గురించి, బోగీల ప్రమాణాలు పెంచడానికి తీసుకుంటున్న చర్యలు వగైరాలను చెప్పడం రైల్వే శాఖకు పరిపాటి.

ఈసారి కూడా నలువైపుల నుంచీ వస్తున్న విమర్శల ధాటికి రైల్వే శాఖ స్పందించింది. గత మూడేళ్లలో ప్రమాదాలు చాలా భాగం తగ్గాయని చెబుతోంది. 2014–15లో 135 ప్రమాదాలు జరిగితే ఆ మరుసటి సంవత్సరం 107, ఈ ఏడాది ఇంతవరకూ 104 జరిగాయని గణాంకాలు ఏకరువు పెట్టింది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది మెరుగుదల 48.3 శాతం ఉన్నదని వివరించింది. యూపీఏ హయాంతో పోలిస్తే గత మూడేళ్లలో ఏ ఏ అంశాల్లో పురోగతి సాధించగలిగామో చెప్పింది. అలాగే భద్రతకు యూపీఏ ప్రభుత్వం ఏటా రూ. 33,972 కోట్లు వెచ్చిస్తే తాము రూ. 54,031 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించింది. అయితే ఇలాంటి గణాంకాలు స్వీయ సమీక్షకు పనికొస్తాయే తప్ప ప్రయాణికులను సంతృప్తిపరచలేవు. వారికి సంబంధించినంత వరకూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరడం ముఖ్యం. అందుకు చేస్తున్నదేమిటో రైల్వే శాఖ చెప్పగలగాలి. ముఖ్యంగా ఖాళీల భర్తీ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటో తెలియజేయాలి. పట్టాల నిర్వహణ, బోగీల పటిష్టత, ప్రమాదాల నివారణకు వివిధ స్థాయిల్లో అమల్లోకి తెచ్చిన వ్యవస్థలు వగైరాలపై వివరించాలి. వీటన్నిటినీ రైల్వే శాఖలోని విభాగాలే చూస్తూ అంతర్గత సమీక్షలతో సరిపెడితే కుదరదు. వివిధ రంగాల నిపుణులతో కూడిన సంఘం ఎప్పటికప్పుడు గమనిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో నివేదికలిచ్చే ఏర్పాటుండాలి. రైల్వే శాఖ చెబుతున్నదానికీ, క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవానికీ మధ్య ఉన్న వైరుధ్యాలు అందరికీ తెలియాలి. అలాచేస్తే రైల్వే శాఖ అనుసరిస్తున్న ప్రమాణాలపై సాధారణ ప్రజానీకంలో విశ్వసనీయత కలుగుతుంది. అందుకవసరమైన పారదర్శకత పాటించడం తక్షణావసరమని ఆ శాఖ గుర్తించాలి.



> ఏ రంగంలోనైనా నాణ్యత అనేది యాధృచ్ఛికంగా సంభవించేది కాదు. అది ఎల్లప్పుడు సామూహిక మేధో ప్రయత్నమే.
>
> – జాన్ రస్కిన్
> బ్రిటిష్ రచయిత, విమర్శకుడు

గ్రహం అనుగ్రహం


శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి శు.పాడ్యమి రా.10.54 వరకు, తదుపరి విదియ నక్షత్రం మఖ సా.4.14 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం రా.12.07 నుంచి 1.40 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.10 వరకు, తదుపరి రా.10.54 నుంచి 11.40 వరకు, అమృతఘడియలు ప.1.52 నుంచి 3.26 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.20
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	4.46	మగ్రీబ్	6.37
జొహర్	12.19	ఇషా	7.52
అసర్	4.46		

రహస్య సంధి ఫలితమే రగడ



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భూటాన్–చైనాల మధ్య డోక్లామ్‌తో ఏర్పడిన సంక్షోభంలో భూటాన్‌కు–భారత ప్రభుత్వానికి మధ్య కుదిరిన రహస్య ఒప్పందంవల్ల వర్తక, వాణిజ్య సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందా? గత మూడుమాసాలుగా భూటాన్–చైనాల మధ్య ఆ మేరకు, భారత్–చైనాల మధ్య తగాదాలు లేదా ఘర్షణలు పరిమితిని దాటి మరింతగా కుదరకపోవడానికి కారణం కూడా ప్రపంచ మార్కెట్‌లో చైనా స్థాపించుకున్న వర్తక సంబంధంలో దాని అగ్రస్థానమే అయి ఉంటుంది.

''ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 1962లో భారత్–చైనా సరిహద్దు యుద్ధంలో ఇండియాకు కలిగిన నష్టాల గురించి హెచ్చరించారు. అదే సమయంలో పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మైన్మార్‌లతో చైనా ఎలా సన్నిహిత సంబంధాలు పెంచుకుందో గమనించాలని గుర్తు చేశారు.''

– పత్రికల వార్తలు

''1. పరస్పరం ఇరుదేశాల సరిహద్దుల సమగ్రత, సార్వభౌమాధికారాల పట్ల గౌరవ భావం చూపాలి. 2. పరస్పరం దాడులను నివారించాలి. 3. దేశ ఆంతరంగిక వ్యవహారాలలో పరస్పరం జోక్యం చేసుకోరాదు. 4. సమానత్వాన్నీ, పరస్పర ప్రయోజనాన్ని గౌరవించుకోవాలి. 5. శాంతి సహకారాలతో పరస్పరం వర్ధిల్లాలి.''

(ఏప్రిల్ 29, 1954 తేదీన భారత్–చైనా పంచసూత్రాల ఆధారంగా బీజింగ్‌లో చేసుకున్న ఒప్పందం)

ఈ 'పంచసూత్ర'ఒడంబడిక పైన ఇండో–చైనా అధిపతులు టిబెట్ సమస్య పూర్వరంగంలో కుదుర్చుకోవడానికి కారణం– టిబెట్‌పైన చైనా సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గుర్తించక తప్పక పోవడమే. ఏ రెండు ఇరుగుపొరుగు దేశాల అధిపతులైనా తమ పార్టీ రాజకీయ ప్రతిపత్తిని సంరక్షించుకోవడానికో, తమ అధికార స్థానాలు నిలబెట్టుకునేందుకో దేశ సరిహద్దులనీ, ఉభయ దేశాల ప్రజల విశాల ప్రయోజనాలనీ పణంగా పెట్టడానికో తగాదాలను పెంచి యుద్ధాలకు దారి తీసేవిధంగా వ్యవహరించరాదు. కానీ ప్రస్తుతం జరుగుతున్నదేమిటి? 1962లో ఈ రెండు దేశాల మధ్య జరిగిన భీకర సరిహద్దు ఘర్షణలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చాయి. కానీ గత మూడు మాసాలుగా మరొక దేశం (భూటాన్) సరిహద్దు ప్రాతిపదికగా యుద్ధం జరగకపోయినా, అందుకు దారి తీయగల స్థాయిలో సైన్యాల మోహరింపు జరుగుతోంది. నిజానికి ఆనాడు టిబెట్ కారణంగానా, ఆ దేశ ఫ్యూడల్ వ్యవస్థ అవశేషంగా ఉన్న దలైలామా పారిపోయి భారత్‌కు వస్తే మన పాలకులు ఆశ్రయం ఇచ్చిన కారణంగా ఉభయ దేశాల నడుమ ఘర్షణలు తలెత్తాయి.

చారిత్రక పరిస్థితులను గమనించాలి

గత పరిణామాలుగానీ, తాజాగా సిక్కిం– భూటాన్ సరిహద్దులు ఆధారంగా జన సంచారంలేని డోక్లామ్ పీఠభూమిలో భారత్–చైనాల మధ్య కొత్తగా అంకురించిన ఘర్షణ వాతావరణం గానీ– ఏ పూర్వ రంగంలో, ఏ చారిత్రక పరిణామాల ఫలితంగా సంక్రమించాయో గ్రహించాలి. ఎందుకంటే, 1962 నాటి తగాదాలకు ఏ బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులు 19వ శతాబ్దంలో కారకులైనారో, నేటి డోక్లామ్ ఘర్షణ వాతావరణానికి కూడా వారే కారకులని మరచిపోరాదు. ఒకప్పుడు నేపాల్, సిక్కిం, భూటాన్ బ్రిటిష్ పాలనలో కొనసాగవలసి వచ్చింది. తరువాత భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకున్న దరిమిలా నేపాల్‌తో పాటు, సిక్కిం కూడా స్వతంత్ర ప్రతిపత్తిగల దేశంగా ఉన్నప్పటికీ భారత్–చైనాల మధ్య సరిహద్దు వివాదాల మధ్య ఇందిరాగాంధీ నేతృత్వంలో సిక్కింను భారత్‌లో ఒక రాష్ట్రంగా విలీనం చేయడం జరిగింది. ఈ పరిణామాన్ని 'దురాక్రమణ'గా ప్రకటించినవారు మరెవరో కాదు, తరువాత ప్రధాని పదవిని చేపట్టిన మొరార్జీ దేశాయే. భూటాన్ కూడా నేపాల్‌తో పాటు స్వతంత్ర దేశంగా ఉంటూ వచ్చింది. కానీ విదేశీ వ్యవహారాలు మాత్రం భారత ప్రభుత్వానికి దఖలు పరిచింది. ప్రస్తుతం సిక్కిం, భూటాన్, చైనాల మధ్య అధికారిక సరిహద్దులు లేక పైలాపచ్చీసుగా ఉన్న డోక్లామ్ పీఠభూమిలో రోడ్ల నిర్మాణాన్ని చైనా ఆరంభించింది. నిజానికి ఇది భూటాన్–చైనాల సమస్య. కానీ భూటాన్ తన వైదేశిక విధానాల నిర్ణయాల అధికారాన్ని మన దేశానికి అప్పగించడంతో డోక్లామ్ వివాదంలో భారత్ ఇరుక్కోవలసి వచ్చింది. అంటే 1914–15 నాటి సిమ్లా సమావేశంలో ఒక చైనా అధికారికి అధికారి హోదా కల్పించి దొంగచాటుగా టిబెట్‌ను చైనా నుంచి విడగొట్టడానికి బ్రిటిష్ వలస అధికారి మెక్‌మహన్ దొంగ సంధి పత్రం మీద సంతకం చేయించుకున్నాడు. అయితే అది దొంగ పత్రమేనని అంగీకరిస్తూనే 'నిజానికి చైనా ప్రభుత్వ అధికార ప్రతినిధులు టిబెట్‌ను చైనా నుంచి విభజించే పత్రం మీద సంతకాలు చేయడానికి నిరాకరించార'ని స్పష్టం చేయవలసి వచ్చింది. అలాగే ఇప్పుడు అలాంటి పరిస్థితే 'డోక్లామ్' తగాదా పూర్వరంగంలో మనకూ, చైనాకూ మధ్య దాపురించింది. ఇది మన పాలకులకు కక్కలేని, మింగలేని పరిస్థితి. కనుకనే ముందు డోక్లామ్‌లోకి మన సైనికుల్ని పంపి భూటాన్ తరపున వకాల్తా పుచ్చుకునేందుకు దూకాం. కానీ భూటాన్ ఈ సంక్షోభంలో ఎటూ పాలుపోక కాసేపు ఇండియా తరపునా, మరి కాసేపు చైనా తరపునా మాటలు మార్చి ఊగిసలాడుతోంది. ఈ ఊగిసలాటకు కారణం–సిక్కిం–భూటాన్–చైనాల మధ్య త్రికోణాకారంలో ఉన్న ఊసర క్షేత్రం డోక్లామ్.



భూటాన్ ఊగిసలాట

మనకు సంక్రమించిన 'పెత్తన'మల్లా భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వహణ బాధ్యతను అక్కడి రాచరిక ప్రభుత్వం అప్పగించటం. ఈ పెత్తనం భూటాన్ తన ఇష్టానుసారంగా దఖలు పరచడంవల్లనా, లేక ఇతరుల ఒత్తిళ్ల వల్ల దఖలైనదా తెలుసుకోవాలంటే రెండు రకాల సంధి పత్రాలను పరిశీలించాల్సిందే. ఎందుకంటే, 1949 నుంచీ భూటాన్–చైనాల మధ్య నలుగుతూ, ముదురుతూ వస్తున్న సంక్షోభానికి బీజం 1949లో భూటాన్ రాచరిక ప్రభుత్వానికీ స్వతంత్ర భారత ప్రభుత్వానికీ మధ్య జరిగిన 'రహస్య ఒప్పందం' (సీక్రెట్ ట్రీటీ)లో ఉంది. ఈ విషయాన్ని డోక్లామ్‌లో చైనా రోడ్ల నిర్మాణం చేపట్టిన సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, వ్యాఖ్యాత సయీద్ నక్వీ (4.8.17) ఇటీవలనే బయటపెట్టారు. నాటి భూటాన్ రాజు, నక్వీకి (1979 సెప్టెంబర్ 11) ఇచ్చిన ఇంటర్వ్యూలో అది ఉంది. రాజు జిమీ సింగ్యే వాంగ్ చుక్ ఇచ్చిన అరుదైన ఇంటర్వ్యూ అది. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇప్పటికీ మన మధ్య ఉన్నారు. ప్రస్తుత పాలకుడు ఆయన కొడుకే. ఇంతకూ వాంగ్ చుక్ 1979లో చైనాతో చర్చలు జరపవలసిన అవసరం ఉందని ఎందుకు భావించినట్టు? 1949 నాటి రహస్య ఒప్పందంలోని 2వ క్లాజు ప్రకారం 'భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వహణ విషయంలో భారత ప్రభుత్వ జోక్యం ఉంటుంది'. కానీ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా భూటాన్‌కు చైనాతో సంబంధాలు అనివార్యమని, కానీ 1949 నాటి భూటాన్ –భారత్ రహస్య ఒప్పందంలోని రెండవ క్లాజు చైనాతో సంబంధాలకు అవరోధం కల్గిస్తోందనీ రాజు ప్రకటించినట్టు సయీద్ నక్వీ ఆ ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేగాదు, రాజు ఆ ప్రకటనలో ఇలా స్పష్టం చేశాడు: ''దౌత్యపరమైన పరిభాషలో కాకుండా నేరుగా నా స్పష్టమైన సమాధానం ఏమంటే– 1949 నాటి భారత్–భూటాన్ ఒప్పందాన్ని ఆధునిక అవసరాల దృష్ట్యా విధిగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది''. అంటే, భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వహణలో ఇకమీదట భారత ప్రభుత్వ సలహా సంప్రదింపులకు భూటాన్ కట్టుబడి ఉండాల్సిన పనిలేదన్న భావాన్ని రాజు వ్యక్తం చేశాడని నక్వీ అభిప్రాయపడ్డారు. ఈ రీత్యా ఇంతవరకు భూటాన్–చైనాలమధ్య క్షేత్రస్థాయిలో నేల మీద గుర్తు పెట్టకుండా వదిలేసిన 'సరిహద్దును వెంటనే ప్రత్యక్ష సంప్రదింపుల ద్వారా'ఉభయ దేశాలూ సరిహద్దుల్ని గుర్తుపెట్టాల్సిన అవసరం ఉందని డోక్లామ్ పరిణామాలు నిరూపిస్తున్నాయి. 1949 నుంచీ భూటాన్–భారత్‌ల మధ్య 'రహస్య ఒడంబడిక' ఫలితంగా అనేక పరిణామాలు జరిగినందున ఈ తాజా సమీక్ష చాలా అవసరమని కూడా భూటాన్ భావిస్తోందని పలువురు వ్యాఖ్యాతల అభిప్రాయం. అయితే అదే సందర్భంలో భారత్ ప్రధాన ప్రయోజనాలకు హాని కలిగేలా భూటాన్ ప్రవర్తించదని నక్వీ భావన. మరో విచిత్రమేమంటే భూటాన్‌లో నివసిస్తున్న టిబెట్ పౌరులు అనేకమంది భారతదేశంలోని దలైలామా తెరచిన 'ధర్మశాల'దుకాణానికి పన్నులు కూడా చెల్లిస్తున్నారని వింటున్నాం.

మేకపోతు గాంభీర్యమే


అయితే ఇదే సమయంలో మరొక ప్రశ్న తలెత్తుతోంది: భూటాన్–చైనాల మధ్య డోక్లామ్‌తో ఏర్పడిన సంక్షోభంలో భూటాన్‌కు–భారత ప్రభుత్వానికి మధ్య కుదిరిన రహస్య ఒప్పందంవల్ల వర్తక, వాణిజ్య సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందా? గత మూడుమాసాలుగా భూటాన్–చైనాల మధ్య ఆ మేరకు, భారత్–చైనాల మధ్య తగాదాలు లేదా ఘర్షణలు పరిమితిని దాటి మరింతగా కుదరకపోవడానికి కారణం కూడా ప్రపంచ మార్కెట్‌లో చైనా స్థాపించుకున్న వర్తక సంబంధంలో దాని అగ్రస్థానమే అయి ఉంటుంది. బహుశా 'పంటి బిగువు' కోసం నేటి భారత్ బీజేపీ–ఆరెస్సెస్ పాలకులు 'డోక్లామ్' మోహరింపుల మధ్యనే చైనాతో వర్తక వాణిజ్య సంబంధాల కోసం ఉవ్విళ్లూరుతూనే మరొకవైపున చైనా పట్ల 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తున్నట్లు కన్పిస్తోంది. ఎందుకంటే 'నోట్ల రద్దు' అక్రమ ప్రయోగం కాస్తా సామాన్యుడిమీద 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'లా విరుచుకుపడినా, ఆ ప్రయోగాన్ని సమర్థించుకునే ప్రయత్నంలో మరోవైపు నుంచి భారతదేశంలోకి చైనా పెట్టుబడులను ధారాళంగా ఆహ్వానిస్తూ తివాచీలు పరుస్తూనే ఉన్నారు. ఈ విషయంలో ట్రంప్ అధికారానికి వచ్చిన మొదట్లో చైనాతో కొంత 'కంపు' చేసుకోవడానికి ప్రయత్నించినా, చైనాను బుజ్జగించడానికి 'చాయంగల విన్నపా'లన్నీ చేయవలసి వచ్చింది. అదంతా వ్యాపార రహస్యం. ఆ పాఠమే ఇండియాలో మోదీ కూడా అనుసరించి ప్రపంచవ్యాప్తంగా చొచ్చుకుపోతున్న చైనీస్ 'అలీబాబా' పెట్టుబడి సంస్థ సహకారంతో 'పేటీఎం' అనే భారత టెక్ కంపెనీ ద్వారా ధన లావాదేవీలను భారీగా నిర్వహింపజేస్తున్నారు. మరొకవైపున, జనరల్ మోటార్స్‌తో సంయుక్తంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న చైనీస్ కంపెనీ 'సాయిక్ మోటార్ కార్పొరేషన్ లిమిటెడ్' సరాసరి గుజరాత్‌లోని హాలోల్ వద్ద భారత మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమను కాస్తా స్వాధీనం చేసుకుంటోంది. అలాగే నాగపూర్ విమానాశ్రయం వద్ద ఉన్న ఇంటర్నేషనల్ కార్గో హబ్ కేంద్రంలో మెట్రో రోలింగ్ స్టాక్ తయారీ (మాన్యుఫాక్చరింగ్) పరిశ్రమను నెలకొల్పడానికి చైనా ప్రభుత్వం రైల్వే రోలింగ్ స్టాక్ కార్పొరేషన్‌ను భారత ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని పస్తుల్లోకి నెట్టి ఆహ్వానం చెప్పింది. ఈ కారణాల రీత్యా కూడా డోక్లామ్‌లో చైనాతో తులతూగలేని పరిస్థితి మనది!

abkprasad2006@yahoo.co.in

నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దం

తిరుపతిలో టీటీడీ ఈఓగా పనిచేసే రోజుల్లో ప్రసాద్ ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు ఎవరికీ చెప్పకుండా కాలినడకన తిరుమల కొండ ఎక్కేసేవారు. తనను కలుసుకోవడానికి వచ్చే అతి సామాన్యుడికి సైతం అసంతృప్తి కలగకుండా మాట్లాడి పంపించేవారు. ప్రధాని వద్ద పనిచేసే రోజుల్లో సొంత పనులకు వెళ్లాల్సి వస్తే, తనే కారు డ్రైవ్ చేసుకుని వెళ్లిపోయేవారు.

రిటైర్ అయిన ఒక ఐఏఎస్ అధికారి విశిష్టత గురించి కొన్ని మాసాలపాటు సీరియల్‌గా రాయాల్సిన వ్యక్తి ఒక్క పత్రి వేంకటరామకృష్ణ ప్రసాద్ మాత్రమే. పీవీఆర్‌కే ప్రసాద్‌గా బాగా గుర్తింపు పొందిన 1966 ఐఏఎస్ బ్యాచ్ అధికారి ఈ ఆగస్టు 21 తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయశాఖ కింద ఏర్పడిన హిందూధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్‌గా 2015లో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ ప్రసాద్ ట్రస్టు లక్ష్యాల కోసం విరామం లేకుండా పనిచేస్తూనే ఉన్నారు. 2015 డిసెంబర్‌లో, 2017 ఫిబ్రవరిలో సుమారు 60 మంది వివిధ మతాధిపతులు, పీఠాధిపతులతో ధార్మిక సదస్సులు నిర్వహించి, ధర్మాచార్యుల్ని ఏకతాటిపై నడిపించే బృహత్కార్యాన్ని సాగిస్తున్నారు.



నివాళి

1980–81లో ఆయన తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నప్పుడు తిరుమల ఆలయంలో మూల విరాట్ విగ్రహానికి అష్టబంధనం జరిగింది. అష్ట బంధనంలో వాడాల్సిన నవరత్నాల సెట్లన్నీ ముందే తెప్పించుకుని పెట్టుకున్నా, అష్ట బంధనం జరిగే కొన్ని గంటల ముందు ఒక సెట్ తక్కువైంది. సమయానికి చెన్నై నుంచి సతీసమేతంగా ఒక వ్యాపారవేత్త నవరత్నాల సెట్‌తో వచ్చి దాన్ని అష్ట బంధనంలో వాడమని కోరాడు. అంతే! వాణ్ణి (శ్రీనివాసుణ్ణి) నమ్ముకుంటే, అన్నీ వాడే ఇస్తాడు, చేస్తాడు అన్న నమ్మకం ప్రసాద్‌లో పాతుకుపోయింది.

ఇదే కాదు. టీటీడీలో కాలినడకన వెళ్లే భక్తులకోసం షెల్టర్లు నిర్మించినా, కొండ మీద యాత్రికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా, నిత్యాన్నదాన పథకం ప్రవేశపెట్టినా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ని సుసంపన్నం చేస్తూ నిర్మింపచేసినా, పాపనాశనం డ్యామ్‌ని అధిక ప్రయోజనం లభించేలా నిర్మింపజేసినా, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు తదితరాలను, తిరుమల ఆలయ సేవల్లో కొత్త సేవల్ని, సంస్కరణల్ని తీసుకువచ్చినా, తిరుమల కొండపై మాస్టర్ ప్లాన్ అమలుచేసినా... ఆ ఘనతంతా శ్రీనివాసుడిదే అనేవారు ప్రసాద్. 1985లో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా ప్రసాద్ అనేక ఉద్యోగాలకు భారీ ఎత్తున రిక్రూట్‌మెంట్ చేపట్టారు. అందులో భాగంగా పరీక్షలు, ఇంటర్వ్యూలను జరుపుతున్నప్పుడు ప్రసాద్‌ని బదిలీచేస్తున్నట్లు సమాచారం అందింది. ఉత్తర్వులు చేతికి వచ్చేదాకా నిరీక్షించకుండానే బాధ్యతలను ఆ శాఖ డైరెక్టర్‌కు అప్పగించి వెళ్లిపోయారు.

విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా ఉండే రోజుల్లో ఒకసారి కుటుంబంతో పాటు ఆయన ఊరికి వెళ్లి వచ్చారు. వాళ్లకోసం రావల్సిన పోర్టు కారు రైల్వేస్టేషన్‌కి రాలేదు. ''కారు ఎందుకు రాలేదు? పంపాల్సిన వాడు ఎందుకు పంపలేదు? ఎవడు దీనికి బాధ్యుడు..?'' ఇలాంటి మాటలు మాట్లాడకుండా, వెంటనే ఆటో ఎక్కేసి బంగళాకు వెళ్లి పోయారు. తిరుపతిలో టీటీడీ ఈఓగా పనిచేసే రోజుల్లో కూడా ఎప్పుడు బుద్ధి పుడితే అప్పుడు ఎవరికీ చెప్పకుండా కాలినడకన తిరుమల కొండ ఎక్కేసేవారు. తనను కలుసుకోవడానికి వచ్చే అతి సామాన్యుడికి సైతం అసంతృప్తి కలగకుండా మాట్లాడి పంపించేవారు. ఢిల్లీలో ప్రధానమంత్రి దగ్గర పనిచేసే రోజుల్లో ఏదైనా షాపింగ్ లేదా సినిమాలు వంటి సొంత పనులకు వెళ్లాల్సి వస్తే, సొంతంగా కారు డ్రైవ్ చేసుకుని వెళ్లిపోయేవారు.ఇలాంటి ఎన్నో సంఘటనలు ఆయన నిరాడంబర జీవితాన్ని సూచిస్తాయి.

1986–87లో ఎక్సైజ్ కమిషనర్‌గా ఉండగా ప్రసాద్ కుమార్తెకు చెన్నైలోని ఒక మెడికల్ కాలేజీలో మెరిట్ ప్రాతిపదికపై సీటు వచ్చింది. కాలేజి మంచిది. కాని ఆ కాలేజి యాజమాన్యం అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో సారా కాంట్రాక్టర్లుగా ఉన్న ఒడయార్స్ బంధువులది. ప్రసాద్, స్వయంగా ముఖ్యమంత్రి (ఎన్టీ రామారావు)ని కలసి విషయాన్ని లిఖితపూర్వకంగా ఆయన ముందుంచి, ''మీరు విచారణ చేసి, ఇందులో నేను ఎలాంటి అనైతికతకు పాల్పడ్డానని మీకు అనిపించినా నేను ఈ అడ్మిషన్ వదులుకుంటాను'' అన్నారు. ఆ విషయంలో ప్రభుత్వం ఆయన పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రకటించింది. ఆయన ఎక్సైజ్ శాఖలో ఉన్నప్పుడే, లిక్కర్ వ్యాపారం చేసే ఒక బడా వ్యాపారవేత్త తనకు లంచం ఇవ్వాలని ప్రయత్నిస్తే, తక్షణం అవినీతి నిరోధక శాఖకు ఫోన్ చేసి ఆ వ్యాపారవేత్తను పట్టించారు ప్రసాద్.

ప్రసాద్, విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా పనిచేస్తున్నప్పుడు కొత్తగా విజిలెన్స్ ఆఫీసర్‌గా వచ్చిన ధిల్లేశ్వరరావు అనే ఒక మాజీ ఎయిర్ ఫోర్స్ అధికారి పోర్టులో అవినీతి అధికారుల చిట్టాని ఆయన ముందుంచి ''ఈ చిట్టాలో ఉన్నవాళ్లంతా అవినీతిపరులే. ముందుగా ఎవర్ని ట్రాప్‌చేయమంటారు సర్'' అని అడిగారు.ఆ చిట్టా చూసి సంభ్రమంలో మునిగిన ప్రసాద్ చివర్లో ఉన్న తన ప్రైవేట్ సెక్రటరీని ముందు ట్రాప్ చేయమని అడిగారు. అంతే! ఆ ప్రైవేట్ సెక్రటరీ, ఉద్యోగం కోసం తిరుగుతున్న ఒక వ్యక్తి వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. నీతివంతమైన పాలన కోసం ప్రసాద్ తాపత్రయపడిన ఇలాంటి సంఘటనలు చాలా ఉన్నాయి.

ఎన్. జనార్ధన రెడ్డి ముఖ్యమంత్రిగా (1990–92) పనిచేస్తున్నప్పుడు 12 మెడికల్ కాలేజీలకి అనుమతిస్తున్నారంటూ కోర్టులో కేసు దాఖ లైంది. కోర్టు ప్రభుత్వాన్ని తప్పు పట్టింది. జనార్ధన రెడ్డి పదవి కోల్పోయారు. 1996లో ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తుండగా ప్రసాద్, ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌కు డిమాండు పెరగనున్న దృష్ట్యా ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభించాలని ప్రతిపాదించారు. జనార్ధన రెడ్డి అనుభవం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకు సంకోచించారు. కానీ హేతుబద్ధమైన, నిర్మాణాత్మకమైన విధానం ద్వారా ప్రతి రెవెన్యూ డివిజన్‌కి ఒక ఇంజనీరింగ్ కాలేజీని ఎలా ఏర్పాటు చేయవచ్చో ప్రణాళికను రూపొందించి ప్రసాద్ ముఖ్యమంత్రిని ఒప్పించారు. ఇవ్వాళ తెలుగు విద్యార్థులు ఇంజనీరింగ్ సీట్ల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లనక్కర లేకుండా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తృతంగా ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయడానికి కారణం ప్రసాద్ దూరదృష్టే.

విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా ఆయన బాధ్యత స్వీకరించిన తొలి మూడు సంవత్సరాలపాటు (మొదటిసారిగా) ఆ పోర్టును జాతీయస్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టారు. పోర్టు భవిష్యత్తు (ఖనిజాల నిల్వల) అవసరాల కోసం హార్బర్‌లోని ఉద్యోగుల కాలనీని నగరం బయటకు తరలించి, ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా, అన్ని యూనియన్లను ఒప్పించి, కొత్త కాలనీలు కట్టించారు.

1984–85లో సాంస్కృతికశాఖ కమిషనర్‌గా కూడా ప్రసాద్ వ్యవహరించారు. సాంస్కృతిక శాఖకి పునర్వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా జానపద కళలని ప్రోత్సహించారు. 'కళామంగళ' కార్యక్రమం ద్వారా హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రతి మంగళవారం ఉచితంగా ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని సమర్పించే ఏర్పాటు చేశారు. సురభి నాటకసంస్థలు జిల్లాల్లో సంచరిస్తూ నాటకాలు ప్రదర్శించేందుకు ప్రోత్సాహం అందించారు. ఆ ప్రయత్నాల్లో భాగంగానే ఓరుగల్లు దగ్గర శివరాత్రి నాడు ఆంధ్ర నాట్యాన్ని ప్రదర్శింపజేసి వెలుగులోకి తీసుకొచ్చారు. టీటీడీలో ఉండగా, డాక్టరు మేడసాని మోహన్ వంటి సాహితీవేత్తల్నీ, శోభారాజ్, బాలకృష్ణప్రసాద్ వంటి గాయకుల్ని ప్రోత్సహిస్తూ వెలుగులోకి తీసుకొచ్చారు.

సాహిత్యం, కళలు, కళాకారులు ఆయన మనసుకి ఎంతో ఇష్టమైన విషయం. హైదరాబాదులో టీటీడీపరంగా ఉగాది ఉత్సవాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే.

పాలనా సామర్థ్యం, దూరదృష్టి, ప్రణాళికారచనలో నైపుణ్యం, నీతి నియమాలు, నిరాడంబరత, సత్యసంధత, నమ్మిన లక్ష్యం కోసం నిలబడే ధైర్యం, నిబద్ధత, సంగీతం, సాహిత్యం, కళలపట్ల మక్కువ, విజయం పరాజయం రెండూ భగవంతుని అనుగ్రహమే అని నమ్మే భక్తి విశ్వాసాలు, ధర్మబద్ధమైన జీవితాన్ని రాబోయే తరాలకి అందించాలన్న తపనతో ధార్మిక ఉద్యమానికి రిటైర్‌మెంట్ అనంతర జీవితాన్ని అంకితం చేసుకున్న వ్యక్తిత్వం... ఇవన్నీ కలబోస్తే కనిపించే రూపం పీవీఆర్‌కే ప్రసాద్.

'నాహం కర్తా, హరిః కర్తా', 'తిరుమలలీలామృతం', 'తిరుమలచరితామృతం', 'అసలేం జరిగిందంటే...!' (Wheels Behind the Veil) అనే ఆయన రచనలు ప్రసాద్ సంపూర్ణ వ్యక్తిత్వానికి అద్దం పట్టేవే.

జి. వల్లీశ్వర్, సీనియర్ పాత్రికేయులు । మొబైల్ : 99493 51500

సైనికులకు అగౌరవం

సాక్షి దినపత్రిక – 19–08–2017– నాటి సంపాదక పేజీలో ప్రముఖ కాలమిస్టు ఆకార్ పటేల్ రాసిన 'సైనికులకు ఇవ్వాల్సింది బూటకపు గౌరవమేనా?' అనే వ్యాసంపై వాయుసేన విశ్రాంత ఉద్యోగిగా నా స్పందనను ఇక్కడ తెలియజేస్తున్నాను.

1. భారతీయ వాయుసేనలో చేరినప్పుడు నేను పంజాబ్‌లోని అదంపూర్‌లో పని చేయవలసివచ్చింది. నా కుటుంబంతోపాటు ఉండేందుకు అనుమతించారు. ఉన్నట్లుండి మమ్మల్ని పఠాన్ కోట్‌కి తరలి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. అది జమ్మూ, ఆక్రమిత కశ్మీర్, పంజాబ్ మూడు ప్రాంతాల కూడలి(ట్రై జంక్షన్).

2. 1965 సెప్టెంబర్ 29 అనుకుంటాను.. ఈ ట్రై జంక్షన్ ప్రాంతంపై సాయంత్రం 4 గంటల సమయంలో దాడి చేయాలని మా స్క్వాడ్రన్‌కి ఆదేశాలు వచ్చాయి. మా పైలట్లు విజయవంతంగా దాడి ముగించి అరగంటలో తిరిగి వచ్చారు. కానీ గంట లోపే పాకిస్తాన్ బలగాలు ప్రతీకార దాడికి దిగాయి. దీంతో వెనువెంటనే మా స్క్వాడ్రన్ విమానాశ్రయాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. మేము మొదట అంబాలా వైమానిక స్థావరానికి తర్వాత ఢిల్లీ సమీపంలోని హిండన్ విమానాశ్రయానికి తరలివెళ్లాము. ఆ సమయంలో ఇరుపక్షాల మధ్య స్వల్ప సంఘర్షణలు జరిగాయి.

3. ఆ సమయాన్ని మేము మా సంస్థాగత విధాన నిబంధనలు–పీఓఆర్–లోనూ తర్వాత డిశ్చార్జి పత్రంలో కూడా నివేదించాం. నేను హైదరాబాద్‌కు మారినప్పుడు నాకు అక్కడ శాశ్వత నివాస గృహం లేదు. దీంతో తెలంగాణ రాష్ట్రంలోని సైనిక్ వెల్ఫేర్ ఆఫీసులో పునరుద్ధరించిన నా డిశ్చార్జి పత్రాన్ని పొందాను. అయితే నా వివరాలన్నింటినీ పొందుపర్చినప్పటికీ, నా దరఖాస్తును వారు యథావిధిగా తమ ఫైల్‌లో అట్టిపెట్టుకున్నారు. 1965 నాటి యుద్ధంలో పాల్గొన్న సైనికులను సత్కరిస్తామని ప్రధాని మోదీ ప్రకటించినప్పుడు.. దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయాల ద్వారా అలాంటి సైనికుల వివరాలను సేకరించి, అలనాటి యుద్ధవీరులను సత్కరించాలని నేను మన్‌కీ బాత్‌కు ఉత్తరం రాశాను.

4. కొన్ని రోజుల తర్వాత జిల్లా కలెక్టర్ అలనాటి సైనిక సిబ్బందిని తమ చాంబర్‌లో సత్కరించారని వార్తల్లో చూసినప్పుడు హైదరాబాద్‌లోని సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ కార్యాలయానికి కాల్ చేశాను. తమ రికార్డులలో ఆ వివరాలన్నీ ఉన్నప్పటికీ, అర్హులైన వారు తమ వివరాలు పంపించాలని కోరుతూ స్థానిక తెలుగు దినపత్రికల్లో ప్రకటించామని వారు చెప్పారు. నా డిశ్చార్జి రికార్డుల్లో నా కచ్చితమైన జన్మదినం లేదని పెన్షన్ అధికారులు తెలుపడంతో నా జన్మదిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా నేను పొందాల్సి వచ్చింది. ఇప్పుడు నాకు 80 ఏళ్లు. శారీరక అంగవైకల్యంతో నా అద్దె ఇంటినుంచి బయటకు అడుగుపెట్టలేను. ఒక వేళ నన్ను పిలిచినా వెళ్లగలిగే స్థితిలో లేను.

5. సైనికుల జీవితంలోని అత్యంత శక్తిమంతమైన భాగాన్ని జాతి పూర్తిగా ఉపయోగించుకున్న తర్వాత మాజీ సైనికులపై చూపుతున్న అగౌరవం పట్ల విచారం వ్యక్తం చేయడానికే ఇక్కడ నేను వీటిని పేర్కొంటున్నాను. మాజీ సైనికోద్యోగుల దుస్థితిపై సాక్షి పత్రికలో మీరు కథనాన్ని ప్రచురించినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను.

జి. శ్రీరామమూర్తి, భారత వాయుసేన మాజీ ఉద్యోగి, అజామాబాద్, హైదరాబాద్





నంద్యాలలో అలా..
కాకినాడలో ఇలా..

నంద్యాలలో ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ నేతలను అక్కడ అడుగుపెట్టనివ్వని తెలుగుదేశం పార్టీ.. కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం ఆ పార్టీ వారితో కలిసే ప్రచారం చేస్తోంది. సోమవారం బీజేపీకి చెందిన మంత్రి మాణిక్యాలరావుతో కలసి ప్రచారం చేస్తున్న నేతలు

బీజేపీ, టీడీపీ మైత్రి కొనసాగుతుంది

మంత్రి కాలవ శ్రీనివాసులు



సాక్షిబృందం, నంద్యాల: కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం పార్టీ మధ్య మైత్రి కొనసాగుతుందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు స్పష్టంచేశారు. ఆయన సోమవారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్య సఖ్యత లేదన్నది అవాస్తవమన్నారు. ఇంతకు ముందు మాదిరే టీడీపీ, బీజేపీ మధ్య స్నేహబంధం ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. బీజేపీ, టీడీపీలకు కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి శత్రువని చెప్పారు. కాంగ్రెస్ నుంచి ఉద్భవించిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. రాష్ట్రాభివృద్ధికి మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కానీ, రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు కానీ టీడీపీపై ఎప్పుడూ దురుద్దేశంతో వ్యాఖ్యలు చేయలేదని చెప్పారు.

ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టు

- నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ దిగజారుడు
- ఓ ఛానెల్‌ను మేనేజ్ చేసి కథనాలు ప్రసారం చేయించిన నేతలు
- తెలుగుదేశం పార్టీ తోక పత్రికలోనూ అవే స్టోరీలు
- ప్రజలను తప్పుదారి పట్టించేందుకు విఫలయత్నం
- తమ అనుమానాలే నిజం అయ్యాయంటున్న వైఎస్సార్‌సీపీ వర్గాలు
- తనకు అబద్ధాల పత్రికలూ, ఛానెళ్ళు లేవన్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నంద్యాల ఉప ఎన్నికలప్పుడు ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాయించి, ప్రసారం చేయించేందుకు తనకు పత్రికలుగానీ, టీవీలుగానీ లేవు అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెప్పారు. ఇప్పుడు అదే నిజమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇలాంటి కథనాలను తెలుగుదేశం పార్టీ ఏదో ఒక పత్రికలో రాయించి, ఏదో ఒక ఛానెల్‌లో ప్రసారం చేయించి నంద్యాలలో ఓటర్లను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తుందన్న తమ అనుమానాలను నిజం చేస్తూ రెండు రోజుల క్రితం రిపబ్లిక్ టీవీలో ఒక అబద్ధపు కథనాన్ని తెలుగుదేశం పార్టీ వేయించగలిగిందని వైఎస్సార్‌సీపీ వర్గాలు సాక్షికి తెలిపాయి. వారి కథనం ప్రకారం...

''ఈ దుష్ప్రచారాలన్నీ చంద్రబాబునాయుడు మోసపూరిత వైఖరిలో భాగమే. ఆయన ఆదేశాలతో తెలుగుదేశం ఎంపీలు తలా తోకా లేకుండా ఓ కథనాన్ని అల్లి ఢిల్లీలోని రిపబ్లిక్ టీవీ ఛానెల్‌కు ఇచ్చారు. దాన్ని వారు ప్రసారం చేశారు. వెబ్‌సైట్‌లోనూ రాయించారు. సరిగ్గా నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం ఇంకొన్ని గంటల్లో ముగుస్తుందనగా ఒక పథకం ప్రకారం, మేనేజ్ చేసి ఆ ఛానెల్‌లో వేయించారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీకీ, వైఎస్ జగన్‌కు మధ్య చర్చలు విఫలం అయ్యాయన్నది ఆ ఛానెల్ కథనంలోని మొదటి అంశం. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఓటు బ్యాంకు లేని, కనీసం డిపాజిట్లు కూడా దక్కే పరిస్థితి లేని కాంగ్రెస్‌తో.. అదే రాష్ట్రంలో ప్రజాబలం దండిగా ఉన్న నాయకుడెవరైనా ఎందుకు మాట్లాడాలనుకుంటారు? వారితో ఎందుకు చర్చలు జరుపుతారు? చర్చలకే అవకాశం లేనప్పుడు ఇక విఫలం కావటమేమిటి? ఇలాంటి కథనాలు ఎవరూ నమ్మరు. బాబుకు బాకా ఊదే పత్రికలు, ఛానెళ్లలో ఇలాంటివి వేసినా, రాసినా నమ్మే పరిస్థితి లేదు. అందుకే టీడీపీ నేతలు ఢిల్లీకి చెందిన ఆ టీవీ ఛానెల్‌ను మేనేజ్ చేశారు. నంద్యాల ఉప ఎన్నిక నేపథ్యంలో ఏం స్టోరీ వేయాలో వారికి రాసిపెట్టారు. తాము వండిన కట్టుకథను ఆ ఢిల్లీ ఛానెల్‌తో చెప్పించారు..'' అని పార్టీ నేతలు వివరించారు.

నంద్యాలలో అలా.. కాకినాడలో ఇలా!

''తెలుగుదేశం పార్టీ కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతో కలసి సాగుతోంది. రెండుచోట్లా వారు మంత్రి పదవులు పంచుకుంటున్నారు. కానీ నంద్యాలకు మాత్రం బీజేపీవారెవరూ పార్టీ కండువాలు, జెండాలతో ప్రచారానికి రావటానికి వీల్లేదని షరతు పెట్టిన టీడీపీ లోపాయకారీ మద్దతు తీసుకుంటోంది. అదే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నిక విషయానికొచ్చేసరికి పొత్తు కొనసాగిస్తూ బీజేపీ, టీడీపీ రెండూ సీట్లు పంచుకున్నాయి. కలిసే ప్రచారంలో పాల్గొంటున్నాయి. ఇప్పుడే కాదు నిజానికి మూడున్నరేళ్ళుగా ఈ రెండు పార్టీలూ పడుగూ పేకల్లా కలసిపోయాయి. కానీ ఈ వాస్తవాన్ని పక్కనపెట్టి కట్టుకథ అల్లారు. నంద్యాల ఎన్నిక కాగానే కాకినాడలో చంద్రబాబుతో సహా అంతా బీజేపీతో కలిసే సాగుతారనేది వాస్తవం. కేవలం నంద్యాల ముస్లిం ఓటర్లను గందరగోళానికి గురి చేయటానికి, డైరెక్టుగా చంద్రబాబు నాయుడు తోక ఛానెల్‌లోనో, తోక పత్రికల్లోనో వార్త రాస్తే రాష్ట్ర ప్రజలు నమ్మరు కాబట్టి, ఢిల్లీ రిపబ్లిక్ టీవీ వారిని మేనేజ్ చేసి వార్త ప్రసారం చేయించారు. తర్వాత దాన్ని చంద్రబాబు తోక పత్రిక మొదటి పేజీలో ప్రచురించారు'' అని వైఎస్సార్‌సీపీ వర్గాలు స్పష్టం చేశాయి.

నంద్యాలలో ఓటమి భయంతోనే..

నంద్యాలలో ఓటమి భయంతోనే టీడీపీ ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా కథనం రాయించిందని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో వైఎస్సార్‌సీపీ పొత్తు పెట్టుకుంటుందనే రీతిలో కథనాన్ని వండారని, వాస్తవానికి 2019లో జాతీయ స్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ ఎవరికి మద్దతు ఇస్తుంది అన్న ప్రశ్నకు వైఎస్ జగన్ గతంలోనే స్పష్టంగా సమాధానం ఇచ్చిన సంగతి వారు గుర్తుచేశారు. ''ప్రత్యేక హోదా కోసం పోరాడాల్సిన ముఖ్యమంత్రి దాన్ని గాలికి వదిలేసిన పరిస్థితుల్లో.. ప్రత్యేక హోదాయే మా లక్ష్యం, అదే మా ఊపిరి, దానితోనే లక్షల ఉద్యోగాలు వస్తాయి కాబట్టి, అది ఎవరు ఇస్తే వారికే మా మద్దతు ఉంటుందని జగన్ గతంలోనే స్పష్టం చేశారు. అయినా, ఈ రోజుగడిస్తే చాలు అన్నట్టు జాతీయ మీడియాలో కట్టుకథలు రాయించే స్థాయికి టీడీపీ మరోసారి దిగజారింది. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు టీడీపీ కోసం రాసి, వేసే మీడియా వైఖరిని, ఈ తరహా దిగజారుడు కథనాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. అలాంటి కథనాలను తీవ్రంగా ఖండిస్తోంది..'' అని వారు స్పష్టం చేశారు.

ఆర్యవైశ్యులను కించపరిచిన... బాబుకు బుద్ధి చెప్పండి

ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి



నంద్యాల సాక్షి బృందం: ఆర్య వైశ్యులను కించపరిచిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడికి నంద్యాల ఉపఎన్నికలో ప్రజలు బుద్ధిచెప్పాలని ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలవాలన్న ఉద్దేశంతో.. రెండు రోజులుగా అనేక వర్గాల ప్రజలను పిలిపించి వారిని భయపెట్టి, ప్రలోభపెడుతున్నారని ఆరోపించారు. మూడున్నరేళ్లగా కానరాని అభివృద్ధి.. ఉపఎన్నిక నేపథ్యంలో కనిపించిందా అని ఆయన ప్రశ్నించారు. ఉద్యోగుల ఓట్లు రాబట్టుకునేందుకు ఆ సంఘం నాయకుడు అశోక్‌బాబును రంగంలోకి దించారన్నారు. తాను అధికారంలోకి వస్తే ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటుచేస్తానని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని కోలగట్ల గుర్తుచేశారు. ఆర్యవైశ్యులంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. నంద్యాలలో చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి ఈ నెల 23 వరకేనని, ఆ తర్వాత సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాల వైపు కన్నెత్తి కూడా చూడరని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో తిరిగి రాజన్న రాజ్యం రాబోతుందని ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, నెరవాటి సత్యనారాయణ ధీమా వ్యక్తంచేశారు.

మళ్లీ కాంగ్రెస్ - టీడీపీ కుట్రలు

భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శ

- జగన్ వ్యక్తిత్వంపై విషప్రచారం
- అవినీతి డబ్బు తీసుకుని అసత్య ప్రచారాలు..
- బీజేపీతో అంటకాగుతున్నట్లు దుష్ప్రచారం
- నిజానికి కాకినాడలో కలసి ఉంది టీడీపీయే
- నంద్యాలలో ముస్లిం ఓట్ల కోసమే నాటకాలు

సాక్షి ప్రతినిధి, నంద్యాల: 'కుట్రలు చేసేందుకు టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు మళ్లీ ఒక్కటవుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్ అభ్యర్థికి చంద్రబాబు రూ. 10 కోట్లు ఇచ్చారు' అని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. గతంలో తెలుగుదేశం పార్టీతో మిలాఖత్ అయి రాజకీయ కక్షతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని జైలుకు పంపించిన కాంగ్రెస్ ...ఇప్పుడు నంద్యాల ఎన్నికల్లో టీడీపీకి మేలు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. భూమన కరుణాకర్ రెడ్డి సోమవారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... టీడీపీ, కాంగ్రెస్ పార్టీల దొంగ నాటకాలను ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ వాళ్లు చంద్రబాబు అవినీతి సొమ్ము తీసుకుని వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

కుట్రలు మీరు చేసి జగన్‌పై విషప్రచారమా?

కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, అన్యాయాలు, అవినీతితో వ్యవస్థను భ్రష్టు పట్టించిన చంద్రబాబు నాయుడు వాటిని కప్పిపెట్టుకుని తాను చెప్పినట్లల్లా ఆడే చానళ్లు, పత్రికల సాయంతో జగన్‌మోహన్‌రెడ్డిపై విషప్రచారాలు సాగిస్తున్నాడని భూమన విమర్శించారు. చంద్రబాబు చేస్తున్న దుర్మార్గ, నీచ నికృష్ట పాలనపై దండయాత్ర సాగించి దానిని కచ్చితంగా ఖతం చేయాల్సిన అవసరం ఉందని జనం భావిస్తున్నారని, దానినే తన గొంతు ద్వారా జగన్ వినిపించారు తప్ప ఎవరిపైనా ఆయనకు వ్యక్తిగత ద్వేషం లేదని వివరించారు. 'ఎంతో హింస సాగించిన చంద్రబాబు శాంతిపావురమా? ఏనాడూ ఒక్క హింసాయుత సంఘటనలో పాల్గొనని, మాటలు మాట్లాడని జగన్ హంతకుడట. చంద్రబాబు ఏది చెబుతాడో దానికి వ్యతిరేకంగా చేస్తాడు. చంద్రబాబు, సోనియా ఇద్దరూ కలిసే కుట్రలు పన్ని జగన్‌పై సీబీఐని ఉసిగొల్పి 16 నెలలు జైలులో నిర్బంధించారు.' అని భూమన వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

జగన్ వ్యక్తిత్వం ముందు మీరెంత?

'ఎంత స్థాయిలో నిర్బంధం ఎదురైనా ఏనాడూ జగన్ వెనుకంజ వేయలేదు. అలజడి నా జీవితం, ఆందోళన నా ఊపిరి, తిరుగుబాటు నా వేదాంతం అంటూ ప్రజాక్షేత్రంలో ప్రజల జీవితాలతోమమేకమై పోరాడుతున్న యోధుడు, యుద్ధవీరుడు జగన్' అని భూమన వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వం ముందు చంద్రబాబు చిట్టెలుక అని భూమన వ్యాఖ్యానించారు. నీచాతినీచమైన చరిత్ర చంద్రబాబుది. ఎంతగా నిర్బంధించినా వెరవకుండా ప్రజల తరఫున నిలబడి పోరాడుతున్న వ్యక్తి జగన్ అన్నారు. ఈ ఎన్నికలలో మళ్లీ కాంగ్రెస్ చంద్రబాబు ఒక్కటై మా నాయకుడిపై దుమ్మెత్తిపోసే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

వారు అంటకాగుతూ మాపై దుష్ప్రచారం..

తాము బీజేపీలో కలుస్తున్నట్లుగా ఎల్లో మీడియాతో ప్రచారం చేయిస్తున్నారని, నంద్యాలలో బీజేపీ జెండా కనిపించకుండా ఆ పార్టీతో అంటకాగుతున్న చంద్రబాబు ఎన్నికల వేళ తమపై నిందలు వేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీయే కాకినాడలో బీజేపీని కౌగలించుకుని ఆ పార్టీతో సమన్వయం చేసుకుని ప్రచారం చేస్తోంది. నంద్యాలలో మాత్రం బీజేపీతో కలసి ప్రచారం చేస్తే ముస్లింలు ఓటేయరన్న భయంతో దూరం పాటిస్తూ నాటకాలాడుతున్నారని భూమన వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇచ్చిన అవినీతి సొమ్ము ఉపయోగించుకుని పాదయాత్రలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు మేము బీజేపీకి అమ్ముడుపోయామంటూ నిందలు వేస్తున్నారని భూమన విమర్శించారు. నంద్యాల ప్రజలు టీడీపీకి కచ్చితంగా గుణపాఠం చెబుతారని భూమన అన్నారు. పోలింగ్ ఏజెంట్‌లను బెదిరించి, రిగ్గింగ్ చేయాలని చంద్రబాబు కుట్ర చేస్తున్నారని, అయితే నంద్యాల ప్రజలు వాస్తవాలన్నీ గ్రహించారని, చంద్రబాబు పాపపు పాలనకు తప్పకుండా చరమగీతం పాడతారని భూమన పేర్కొన్నారు.

వారికి ఓటేస్తే డ్రెయినేజ్‌లో వేసినట్లే...

కాంగ్రెస్ పార్టీకి వేసే ఓటు డ్రైనేజ్‌లో వేసినట్లేనని భూమన వ్యాఖ్యానించారు. రైతులు, డ్వాక్రా మహిళలు, ముస్లింలు, కాపులు, దళితులు, విద్యార్థులు సహా అందరికీ చంద్రబాబు మోసం చేశారన్నారు. ఏ ఒక్క వరానికీ ఆయన మేలు చేయలేదని, దేశంలో కెల్లా లోకేశ్‌ను అత్యంత సంపన్నుడిని చేసేందుకు చంద్రబాబు బకాసురుడిలా అవినీతికి పాల్పడుతున్నారన్నారు.

ముస్లింలను మోసగించేందుకే నీచపు ఎత్తుగడ

- ఎన్డీఏలో వైఎస్సార్‌సీపీ చేరుతోందని టీడీపీ దుష్ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ భాగస్వామి కాబోతోందంటూ టీడీపీ వర్గాలు ప్రచారం చేస్తున్నవి కేవలం గాలి వార్తలని, అమాయక ముస్లింలను మోసగించడానికే ఇలాంటి నీచపు ఎత్తుగడలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రచారాన్ని తీవ్రంగా తిప్పి కొడుతూ బీజేపీతో జత కలిసింది వారు (టీడీపీ).. కేంద్రంలో భాగస్వాములైంది వారు (టీడీపీ) ఇదంతా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదే అయినా ఎదుటి వారిపై నిందలేయడం విడ్డూరమని విస్మయం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నంద్యాల ఉప ఎన్నికలో ముస్లిం ఓటర్లు టీడీపీకి వ్యతిరేకంగా ఓటేయబోతున్నారని గ్రహించి.. వారిని తప్పు దోవ పట్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. 'ఇపుడు బీజేపీకి సొంత బలం ఉంది.. వారికి మరొకరి మద్దతు అవసరమే లేదు. ఈ విషయమై మేం వారితో ఎప్పుడూ సంప్రదింపులు జరపనే లేదు. వారు (బీజేపీ) కూడా మమ్మల్నేమీ ఆహ్వానించలేదు. అసలు అలాంటి చర్చకు ఇప్పుడు తావెక్కడిది?' అని ధర్మాన ప్రశ్నించారు. వాస్తవానికి నరేంద్ర మోదీని ఒకప్పుడు విమర్శించింది చంద్రబాబేనని, గుజరాత్ ముఖ్యమంత్రి స్థానం నుంచి తొలగించాలని డిమాండ్ చేసిందీ ఆయనేనన్నారు. మళ్లీ అధికారం కోసం మోదీతో జత కలిసిందీ టీడీపీయేనని, ఇది ఆంధ్రప్రదేశ్ ముస్లింలకు బాగా తెలుసన్నారు. కేంద్రంలో టీడీపీ మంత్రులు, రాష్ట్రంలోని తన ప్రభుత్వంలో బీజేపీ మంత్రులతో సహచర్యం చేస్తున్న చంద్రబాబు నంద్యాల ఉప ఎన్నికలో బీజేపీ వారిని జెండాలు లేకుండా ప్రచారం చేయాలని అనడంలో ఆంతర్యం ఏమిటని ధర్మాన సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబుకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే జెండాలతోనే ప్రచారం చేసి ఉండాలన్నారు. తాము బీజేపీతో ఉంటూ ఆ సంబంధాలను వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం అత్యంత లజ్జాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కుటిల నీతిని గ్రహించలేనంత అమాయకులు రాష్ట్ర ప్రజలు కారనే విషయం ముఖ్యమంత్రి గ్రహిస్తే మంచిదని హితవు పలికారు.

నంద్యాలలో ఓటమి భయంతోనే
టీడీపీ దిగజారుడు రాజకీయాలు

- నాపై సీఎం చేసిన ఆరోపణలపై విచారణకు సిద్ధం
- భూమా కుటుంబం వస్తే అరాచకాలు, దౌర్జన్యాలు
- శిల్పా సహకార్‌కు అన్ని రకాల అనుమతులున్నాయి
- మా కష్టంతో సంపాదించిన డబ్బుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నాం
- శిల్పా మోహన్‌రెడ్డి స్పష్టీకరణ



మాట్లాడుతున్న శిల్పా మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు

నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ ఓడిపోతుందన్న భయంతో తనపై దిగజారుడు ఆరోపణలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి చెప్పారు. సోమవారం కర్నూలు జిల్లా నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శిల్పాతోపాటు ఆయన కుటుంబసభ్యులు విలేకరులతో మాట్లాడారు. శిల్పా సహకార్‌కు ఎలాంటి అనుమతులు లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం విడ్డూరమన్నారు. 2014 ఎన్నికలకు ముందు అర్ధరాత్రి 2 గంటలకు చంద్రబాబు పిలిపించుకుని ఆ సమయంలో శిల్పా సేవా కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారన్నారు. తాను టీడీపీలో ఉన్నప్పుడు ఆయన కుమారుడు శిల్పా సహకార్‌ను సందర్శించి మహిళలకు మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించిన విషయం మరిచిపోయారని గుర్తు చేశారు. ఆరోజు నేను టీడీపీలో ఉన్నా కాబట్టి శిల్పా సంస్థలపై ప్రశంసలు కురిపించారని, నేడు పార్టీ మారగానే చెడ్డవాళ్లమై పోయామన్నారు. మూడున్నరేళ్లుగా నంద్యాల ప్రజలు ఆందోళనలో ఉన్నారని, భూమా కుటుంబం వస్తే అరాచకాలు, దౌర్జన్యాలు జరుగుతాయన్నారు. ఒక ముస్లిం వ్యక్తిని శిరువెళ్లలో రాడ్లతో కొట్టి ఈడ్చుకుంటూ వెళ్లినవారెవరో, వైశ్యుల ఆస్తులు లాక్కున్నదెవరో ప్రజలకు తెలుసన్నారు. నాడు భూమా ఫ్యాక్షనిస్టు, రౌడీ, గూండా అన్న టీడీపీ నాయకులు ఇప్పుడు ఆ కుటుంబం గొప్పదంటూ ప్రచారం చేస్తున్నారన్నారు.

ఎప్పుడూ తప్పులు చేయలేదు.. చేయబోం

'మా జీవితంలో మేమెప్పుడూ తప్పులు చేయలేదు.. చేయం. మా కష్టంతో సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని ప్రజా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నాం. ఏనాడూ కమీషన్లు తీసుకోవడం, పంచాయితీల్లో తలదూర్చడం చేయలేదు. శిల్పా సహకార్ ద్వారా 11 వేల మందికి వడ్డీలేని రుణాల నుంచి అర్ధ రూపాయి వడ్డీ వరకు రుణాలు ఇచ్చాం. ఇప్పటి వరకు ఏ మహిళనూ రుణం కట్టమని గట్టిగా అడిగింది లేదు. ఈ బ్యాంకు నష్టాల్లో నడుస్తున్నా సంకల్పబలంతో పేదలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ముందుకు నడిపిస్తున్నాం' అని శిల్పా వెల్లడించారు. బ్యాంకు ద్వారా మహిళల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలతో సొంతకాళ్లపై నిలబడేలా చేస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఇవన్నీ ఆగిపోవాలనే దురుద్దేశంతో సీఎం చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేస్తూ స్థాయిని దిగజార్చుకున్నారన్నారు. ఈ బ్యాంకు మూసేయాలంటూ రెండు నెలలుగా అధికారులు ఒత్తిడి చేస్తూ విచారణ పేరుతో ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నంద్యాల ప్రజలకు సొంత ఖర్చులతో ఉచితంగా మినరల్ వాటర్ ఇస్తున్నామన్నారు. ఏ ఒక్కరి నుంచి రూపాయి కూడా తీసుకోలేదన్నారు. ఉప ఎన్నికలో ప్రజలు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయని చెబుతున్న మాటలను నమ్మవద్దని ఓటర్లకు సూచించారు. ప్రజలకు తాము అండగా ఉంటామని స్పష్టీకరించారు. ఉప ఎన్నిక ఉంది కాబట్టి మంత్రులంతా నంద్యాలలో ఉన్నారన్నారు. ఎన్నిక తర్వాత ఏ ఒక్కరూ కన్పించరని చెప్పారు. ప్రశాంత వాతావరణం కల్పించే నాయకులను నంద్యాల ప్రజలు గెలిపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిల్పా మోహన్‌రెడ్డి కుమారుడు శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, కుమార్తె శిల్ప, కోడలు నాగిణిరెడ్డి పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ అన్నా!



శిల్పాకు శుభాభినందనలు చెబుతున్న వైఎస్ జగన్


శిల్పాకు జగన్ శుభాకాంక్షలు

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'ఆల్ ది బెస్ట్ అన్నా...!' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం నంద్యాలలో ఉప ఎన్నికల పోరు ప్రచార ముగింపు సభ పూర్తయిన తరువాత మోహన్‌రెడ్డిని గట్టిగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పారు. వీరిద్దరూ 13 రోజులుగా ప్రచార రథంపై అలుపూ సొలుపూ లేకుండా తిరిగారు. ఎస్పీజీ మైదానంలోనూ, గాంధీ చౌక్‌లోనూ భారీ బహిరంగ సభలు నిర్వహించారు. ఎండనకా వాననకా తిరిగిన నేతలిద్దరూ ప్రచారం చివరి రోజున ప్రచార రథంపైనే ఆలింగనం చేసుకున్నపుడు చూసిన వేలాదిమంది కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు.

నంద్యాల్లో ముగిసిన ప్రచారం

- రేపు పోలింగ్.. ఏర్పాట్లు దాదాపు పూర్తి
- సర్వశక్తులూ ఒడ్డిన అధికార పార్టీ
- నోట్ల కట్టలు.. మద్యం ప్రవాహం
- జగన్ సుడిగాలి ప్రచారంతో వైఎస్సార్‌సీపీలో ఊపు


నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి



కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నిక ప్రచార పర్వం సోమవారంతో ముగిసింది. అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారం నిర్వహించాయి. బుధవారం పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి తరఫున మంత్రులు, పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేలు నంద్యాల్లో తిష్ట వేశారు. ఒక్కో వార్డుకు ఒక్కో ఎమ్మెల్యేను ఇన్‌చార్జ్‌గా నియమించి ఆర్భాటంగా ప్రచారం సాగించారు. స్థానికంగా సరిపడా కార్యకర్తలు కరువై పొరుగు జిల్లాల నుంచి సైతం రప్పించారు. మద్యం వరద పారించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం చివరలో రెండు రోజులు నంద్యాల్లో పర్యటించి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 13 రోజుల పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తొలుత రోడ్‌షో ద్వారా ప్రచారం మొదలు పెట్టినా.. జనాభిమానం వెల్లువెత్తడంతో అది కాస్తా పాదయాత్రగా మారింది. 2014 ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదని నిలదీశారు. మొత్తం 15 మంది బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ బరిలో ఉన్నప్పటికీ కేవలం ఉనికి కోసమే అన్న విమర్శలు వచ్చాయి.

ఏర్పాట్లు దాదాపు పూర్తి

నంద్యాల ఉప ఎన్నికకు సంబంధించి ఈ నెల 23వ తేదీ బుధవారం పోలింగ్ జరగనుంది. మొత్తం 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 141 సమస్యాత్మకంగా, 74 అత్యంత సమస్యాత్మకంగా గుర్తించారు. 2500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. 6 కంపెనీల పారా మిలటరీ బలగాలను రప్పించారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలవుతుంది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలో ఉన్న వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆ ప్రాంతాల్లో ఓటింగ్ సరళిని వీడియో చిత్రీకరణ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్లకు సరిపడా ఈవీఎంల ను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఇబ్బందులేవైనా తలెత్తితే అదనంగా కూడా ఈవీఎంలను సిద్ధం చేశారు. ఈ నెల 28న ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితం వెల్లడి కానుంది.



2వేలు.. 3వేలు.. 5వేలు

▶ మొదటి పేజీ తరువాయి

ఓటర్లు మొగ్గు చూపుతుండటంతో అధికార పార్టీ ఆందోళనకు గురవుతోంది. అయితే చివరి ప్రయత్నంగా ఓటర్లను కొనుగోలు చేసేందుకు వెచ్చించే మొత్తాన్ని అమాంతం పెంచేసింది. ఇందులో భాగంగా టీడీపీ నేతలు ఒక్కోచోట ఒక్కో రేటు కట్టి పంచడం ప్రారంభించారు. ఒక చోట ఓటుకు రూ.2 వేలు, మరో చోట రూ.3, రూ.5 వేలు ఇచ్చారు. కొన్ని చోట్లయితే ఏకంగా రూ.10 వేల వరకూ పంచుతున్నారు. మంత్రులు కొందరు జిల్లాలోనే ఉండి ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. పక్క జిల్లాకు చెందిన ఎమ్మెల్యే ఒకరు గోస్పాడు మండలంలోని ఒక గ్రామంలో బస చేసినట్లు సమాచారం. జిల్లాను వదిలి వెళ్లిపోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినప్పటికీ బేఖాతరు చేస్తూ ఉల్లంఘనలకు పాల్పడేందుకే సిద్ధమయ్యారు. ప్రధానంగా ఓటింగ్‌పై భయం ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఓటమి తప్పదని తెలిసే ఏకంగా ఎన్నికల సంఘంపైనే విమర్శలకు దిగడంతో పాటు పక్కనే ఉండి అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి తమకు అనుకూలంగా పని చేయించుకునేందుకు ప్రణాళిక వేసుకున్నట్టు సమాచారం.


ఒక్కో ఓటుకు ఒక్కో రేటు..

ఉదయం పూట ఒక రేటు, రాత్రి సమయాల్లో మాట్లాడితే మరో రేటు అనే మొబైల్ కంపెనీల ఆఫర్ల తరహాలో అధికార పార్టీ కూడా ఓటర్లకు ఆఫర్లు ప్రకటిస్తోంది. కొన్ని వార్డుల్లో రూ.2, 3, 5 వేలు పంచుతున్న తెలుగుదేశం నేతలు మరికొన్ని చోట్ల ఓటర్ల మనస్తత్వాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. ఉడుమాల్పురం లాంటి గ్రామాల్లో ఏకంగా రూ.10 వేల వరకూ ఓటుకు పంచుతుండటం గమనార్హం. ఇక్కడితో ఆగకుండా కొన్ని ప్రాంతాల్లో మహిళలకు చీరలు, ముక్కెరలను కూడా పంపిణీ చేస్తున్నారు. అయితే, అధికార పార్టీ బరితెగించి డబ్బులు పంపిణీ చేస్తున్నప్పటికీ పోలీసులు మాత్రం కన్నెత్తి చూడకపోగా, ఎవరూ అడ్డుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్న తీరు విమర్శల పాలవుతోంది. తెలుగుదేశం బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ఓటుకు రూ.10 వేల మేరకు పంచుతున్న తీరు విస్తుగొలుపుతోంది. అంటే.. టీడీపీకి అనుకూలంగా ఉండటమే తాము చేసుకున్న పాపమా అని పలువురు ఆ పార్టీ కార్యకర్తలు.. స్థానిక నేతలను నిలదీస్తున్నారు. మీరే తింటున్నారంటూ శాపనార్థాలు పెడుతున్నారు. దీనిని గమనించిన స్థానిక నేతలు వారి వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఒక వార్డులో ఓటుకు రూ.2 వేలు ఇవ్వగా, పక్కనే ఉన్న మరో వార్డులో రూ.3 వేలు, రూ.5 వేలు ఇచ్చారని తెలియడంతో రూ.2 వేలు తీసుకున్న ఓటర్లు ఆ పార్టీ నేతలపై మండిపడ్డారు. 15వ వార్డులో ఏకంగా ఆ పార్టీ స్థానిక నేత ఇంటి ముందు కొద్ది మంది మహిళలు ఆందోళనకు కూడా దిగారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో ఏకంగా రూ.10 వేలు ఇచ్చారని తెలియడంతో ఇతరులు రగిలిపోతున్నారు. తమ ఓటుకైనా.. ఇంకొకరి ఓటుకైనా విలువ ఒకటేనని, అలాంటపుడు ఎందుకు వ్యత్యాసం చూపుతున్నారని నిలదీస్తుండటంతో ఎలా సర్ది చెప్పాలో తెలియక టీడీపీ నేతలు తల పట్టుకుంటున్నారు.

- చాపిరేవుల, అయ్యలూరు, చాబోలు, పెద్దకొట్టాలలో ఓటుకు రూ.3 వేలు, మహిళలకు చీరలు, ముక్కు పుడకలు పంపిణీ చేశారు. పొన్నాపురంలో ఓటుకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేసిన అనంతరం రెండు సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లకు మాత్రం అదనంగా గుంపగుత్తగా రూ.5 లక్షలు ఇచ్చారు.
- యాళ్లూరు, దీబగుంట్ల గ్రామాల్లో వర్గ వైషమ్యాలు లేపేందుకు భారీగా ప్రలోభాలకు గురిచేశారు.
- నంద్యాల మున్సిపాలిటీలోని వార్డులకు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు మెజార్టీ చూపించుకోవాలనే లక్ష్యంతో ఎవరికి తోచిన విధంగా వారు డబ్బులు పంపిణీ చేశారు. ఈ క్రమంలో కొన్ని వార్డుల్లో ఓటుకు రూ.5 వేలు ఇచ్చారు. ఆ మొత్తం తీసుకున్న వారు ఆ విషయాన్ని పక్క వార్డుల్లోని బంధువులు, సన్నిహితులకు తెలిపారు. దీంతో ఒక్కో ఏరియాలో ఒకలాగా పంచుతారా అంటూ పలు చోట్ల ఓటర్లు వాదనకు దిగారు.
- ఒకటవ వార్డు మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామని ప్రకటించిన టీడీపీ పెద్దలు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో వారు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయమై 22వ వార్డులో టీడీపీ నేతల ఇళ్ల వద్దకు వెళ్లి కొందరు ఓటర్లు నిలదీశారు.
- తాము టీడీపీ సానుభూతిపరులుగా ముద్ర ఉన్నప్పటికీ తమకు డబ్బులు ఎందుకు తక్కువగా ఇచ్చారని పలు ప్రాంతాల నుంచి ఆ పార్టీ నేతలపై ఒత్తిడి పెరిగింది. మంగళవారం మిగతా మొత్తాన్ని ఇవ్వకపోతే తమ సత్తా చూపుతామని హెచ్చరిస్తున్నారు.

అక్కినేని ఫ్యాన్స్ శిల్పాకు మద్దతు

నంద్యాలలో గెలిపించాలని పిలుపు


రామరాజు

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి ఆల్ ఇండియా అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ అసోషియేషన్ సంపూర్ణ మద్దతు తెలిపింది. సంఘం ఏపీ అధ్యక్షుడు ఏవీ రామరాజు సోమవారం సాక్షితో మాట్లాడారు. శిల్పా మోహన్‌రెడ్డి సౌమ్యుడని తమ సర్వేలో తేలిందని చెప్పారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా నంద్యాల ప్రజలు పేర్కొంటున్నారని తెలిపారు. అక్కినేని నాగార్జున, దివంగత అక్కినేని నాగేశ్వరావు అభిమానులందరూ నంద్యాల ఉప ఎన్నికలో తప్పక శిల్పా మోహన్‌రెడ్డికి ఓటు వేసి వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఆదినారాయణరెడ్డిపై హెచ్‌ఆర్‌సీలో కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి ఆదినారాయణరెడ్డిపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ)లో కేసు నమోదైంది. ఆదినారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని గుంటూరుకు చెందిన మేడా క్రిష్ణ సోమవారం హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. మానవ హక్కులను హరించే విధంగా మంత్రి ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్ స్పందిస్తూ.. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర నివేదికను అక్టోబర్ 31వ తేదీలోగా అందజేయాలని వైఎస్సార్‌జిల్లా ఎస్పీకి నోటీసులు జారీ చేసింది.

సహకరించకపోతే లూప్‌లైన్ తప్పదు!

అధికారులకు టీడీపీ బెదిరింపులు

ఈసీకి ఫిర్యాదు చేయనున్న వైఎస్సార్ సీపీ

సాక్షి ప్రతినిధి, కర్నూలు: నంద్యాల ఉప ఎన్నికలో ఓటమి భయంతో అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోంది. తమ పార్టీ గెలుపు కోసం కృషి చేయకపోతే ఆ తర్వాత వేటు తప్పదని అధికారులను హెచ్చరిస్తోంది. ఎన్నికల సంఘం (ఈసీ) పరిధిలో కేవలం ఈ నెల 28వ తేదీ వరకే ఉంటారన్న విషయాన్ని గుర్తించుకోవాలని బెదిరింపులకు దిగుతోంది. ఈ మేరకు ముఖ్యనేతతో పాటు మంత్రులు జిల్లాలోని కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారులను హెచ్చరిస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నికలో తప్పనిసరిగా గెలవాలని, లేనిపక్షంలో ప్రభుత్వానికే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ ఎన్నికల్లో గెలవకపోతే ప్రస్తుతం ఉన్న అధికారులకు బదిలీ తప్పదని, లూప్‌లైన్‌లో పోస్టింగ్ వేస్తామని కూడా బెదిరిస్తున్నట్టు సమాచారం. అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రచారానికి విరుద్ధంగా పరిస్థితి ఉండటం, చంద్రబాబు సభల కంటే జగన్ సభలకు భారీగా జనం హాజరు కావడం.. ప్రత్యేకించి ముస్లిం వాడల్లో జగన్‌కు ఆదరణ వెల్లువెత్తడంతో అధికార పార్టీ నేతల్లో భయం మొదలైంది. ప్రస్తుతం ప్రచార పర్వం ముగియడంతో అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా పని చేయాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. ఆయా శాఖల ఉన్నతాధికారులతో పాటు స్వయంగా మంత్రులు కూడా రంగంలోకి దిగారు. ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే.. ఎన్నికల సంఘం నుంచి తాఖీదులు వస్తే ఉద్యోగ జీవితంలో ఇబ్బంది ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. రాజకీయ నాయకులు శాశ్వతంగా అధికారంలో ఉండరని, నిక్కచ్చిగా విధులు నిర్వర్తించాలని అధికారులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం. ఇదే అంశంపై ఈసీకి ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా ఫిర్యాదు చేయనున్నట్టు తెలిసింది.

నంద్యాల సర్వే నిషేధంపై జోక్యానికి నో

- కౌంటర్లు దాఖలుకు హైకోర్టు ఆదేశం
- అధికార పార్టీ బెదిరింపులకు పాల్పడుతోందన్న ఎన్నికల సంఘం న్యాయవాది
- చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చునని సూచించిన ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక పూర్తయ్యేంత వరకు ఓటర్ల ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన సర్వే ప్రచురణ, ప్రసారాలపై నిషేధం విధిస్తూ రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల విషయంలో జోక్యానికి ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల ప్రజాభిప్రాయ సేకరణ సర్వే ప్రచురణ, ప్రసారాలపై నిషేధం విధిస్తూ రిటర్నింగ్ అధికారి ఈ నెల 15న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ స్వచ్ఛంద సంస్థ 'స్పార్క్' రాష్ట్ర కార్యదర్శి నున్నా రాంబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ వాదనలు వినిపిస్తూ... రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులు ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాస్తవానికి ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనల్లో ఎన్నిక ప్రారంభం కావడానికి 48 గంటల ముందు నుంచి మాత్రమే సర్వే ప్రచురణ, ప్రసారాలపై నిషేధం ఉందని ఆయన కోర్టుకు నివేదించారు.

అధికార పార్టీ బెదిరింపులకు పాల్పడుతోంది...

తరువాత కేంద్ర ఎన్నికల సంఘం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రతీ ఇంటి వద్దకు వెళ్లి మీరు అధికార పార్టీకి ఓటు వేయకుంటే సంక్షేమ పథకాల కింద ఇచ్చే ప్రయోజనాలను వర్తింప చేయబోమని బెదిరిస్తున్నట్లు తమకు చాలా ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. ఎవరికి ఓట్లు వేశారో కూడా తమకు కొత్త ఓటర్ స్లిప్ ద్వారా తెలిసిపోతుందని, దాన్నిబట్టి రేషన్ కార్డులు, పెన్షన్, పొదుపు సంఘాలకు ఇచ్చే రుణాలు వంటి వాటిని ఇవ్వబోమని కూడా అధికార పార్టీ వాళ్లు చెబుతున్నట్లు తమకు తెలిసిందన్నారు. అంతేకాక కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ సేవలను కూడా అధికార పార్టీ వాడుకుంటోందని, అనేక రకాలుగా బెదిరింపులకు పాల్పడుతోందని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ... ఇవన్నీ ఎన్నికల అక్రమాల కిందకు వస్తాయని, వాటిపై మీకు చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అధికారం ఉందని, కాబట్టి చర్యలు తీసుకోవచ్చునని పేర్కొంది. తిరిగి న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం తమకు పర్యవేక్షణ అధికారాలున్నాయని తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ... 'ఎన్నికల ముందు ఎటువంటి సర్వే చేయకుండా నిషేధం విధించినట్లు కనిపిస్తోంది. సర్వే మీదనే నిషేధం విధించినప్పుడు, సర్వే ఫలితాల ప్రచురణ, ప్రసారాలకు అవకాశమే లేదు కదా? 48 గంటలకు మరో మూడు గంటల వ్యవధే ఉన్నందువల్ల ఇప్పుడు రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులపై స్టే విధించడం వల్ల వచ్చే ప్రయోజనం ఏముంది? అందుకే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయమని ఆదేశాలిస్తాం' అని ధర్మాసనం పేర్కొంది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఉత్తర్వుల అమలును నిలిపేయాలని కనకమేడల కోరారు. అయితే ధర్మాసనం అందుకు తిరస్కరిస్తూ, ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శిని ఆదేశించింది.

యువజన సంక్షేమ శాఖలో కోడ్ ఉల్లంఘన

నిబంధనలకు విరుద్ధంగా యూత్ ఎక్సేంజ్ నిర్వహణ

కాకినాడకు 50 మంది సభ్యుల బృందం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు జిల్లా యువజన సంక్షేమ శాఖ ఎన్నికల కోడ్ ఉల్లంఘించింది. నిబంధనలకు విరుద్ధంగా 50 మంది యువతీయువకులను యూత్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్ కింద కాకినాడకు పంపించింది. ఇది ఎన్నికల్ కోడ్‌కు విరుద్ధమని తెలిసినా అధికారులు బృందాన్ని పంపించడం వివాదాస్పదమైంది. యూత్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్‌లో భాగంగా యువతీయువకులను సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, ఆర్థిక, సామాజిక పరిస్థితులను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాలకు పంపిస్తోంది. ఈ మేరకు కర్నూలు జిల్లా యువజన సంక్షేమ శాఖ గతంలో పలు బృందాలను పంపించింది. అయితే నంద్యాల నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా జిల్లాలో కోడ్ అమలులో ఉంది. అయినా ఈనెల 17వ తేదీన కర్నూలు నుంచి కాకినాడకు 50 మంది సభ్యులతో కూడిన బృందాన్ని ఆ శాఖ గుట్టుచప్పుడు కాకుండా పంపించింది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాతే జిల్లాలో ఈ కార్యక్రమం కింద యువతీయువకులను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ సభ్యుల బృందం ఈనెల 17న వెళ్లి 19వ తేదీ వరకు కాకినాడలో పర్యటించి వచ్చింది. ఈ విషయమై ఆ శాఖ మేనేజర్ రాజేందర్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల అనుమతితోనే యువతీయువకుల బృందాన్ని కాకినాడకు పంపించామని తెలిపారు. ఇదిలా ఉండగా.. ఆ శాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిందని డివిజన్ స్థాయి యువజన సాంస్కృతిక పోటీలు వాయిదా వేయడం గమనార్హం.

డబ్బుకు అడ్డుకట్ట వేయండి: రామకృష్ణ



సాక్షి, అమరావతి: ఉప ఎన్నిక నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గంలో ఏరులై పారుతున్న మద్య, ధన ప్రవాహాలకు అడ్డుకట్ట వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సర్వేలు, ఓపీనీయన్ పోల్స్ వంటి వాటిని నిషేధించడం వల్ల జరిగేది ఏమీ లేదని, ఓటర్లను ప్రలోభపెడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నంద్యాలలో తిష్టవేయడాన్ని రామకృష్ణ తీవ్రంగా తప్పుబట్టారు. ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్లకు విచ్చలవిడిగా నగదు పంపిణీ జరుగుతుంటే ఎన్నికల కమిషన్ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

భన్వర్‌లాల్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ ఫిర్యాదు చేసింది. పార్టీ ఎంపీలు రామ్మోహన్ నాయుడు, నిమ్మల కిష్టప్ప, మాల్యాద్రి శ్రీరామ్ సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషనర్ అచల్‌కుమార్ జ్యోతితో సమావేశమై.. నంద్యాల ఉపఎన్నికలో భన్వర్‌లాల్ పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తున్న భన్వర్‌లాల్.. తాము చేసే ఫిర్యాదులను అసలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ డీఎస్పీపై ప్రతిపక్ష పార్టీ ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్.. ఆయన్ను బదిలీ చేసిందని పేర్కొన్నారు. సర్వేలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు.

కోడ్ అపహాస్యం!

▶ మొదటి పేజీ తరువాయి

రాత్రి పొద్దుపోయేదాకా ఉండి విందు చేశారు. ఇక మంత్రి అఖిలప్రియ సాయంత్రం 6 గంటల వరకూ ప్రచారాన్ని నిర్వహించారు. అయినప్పటికీ అక్కడ ఉన్న పోలీసులు పట్టించుకోలేదు. అదేవిధంగా పక్క జిల్లాకు చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యే ఒకరు గోస్పాడు మండలంలోని ఓ గ్రామంలో ఉండిపోయినట్లు తెలుస్తోంది. అదేవిధంగా సర్వే కోసం కోస్తా జిల్లాల నుంచి వచ్చిన పలువురు అధికార పార్టీ నేతలు.. స్థానికుల ఇళ్లల్లో తలదాచుకున్నట్టు సమాచారం. ఒకవైపు ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్న అధికారపక్షం.. మరోవైపు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడులు చేయిస్తోంది. ఇప్పటికే సుమారు 20 మంది ఇళ్లల్లో సోదాలు నిర్వహించిన పోలీసు యంత్రాంగం.. సోమవారం కూడా వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడులు కొనసాగించింది. ప్రతిపక్ష ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో కూడా సోదాలు చేశారు. మరోవైపు ప్రచారం మొదలైనప్పటి నుంచి మంత్రులు, టీడీపీ నేతలు స్థానికంగా ఓ హోటల్‌లో మకాం వేసి, అక్కడి నుంచే అన్ని ఆర్థిక వ్యవహారాలు నడిపారని ఆరోపణలు వస్తున్నప్పటికీ పోలీసులు మాత్రం కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇక టీడీపీ నేతలు మహిళా ఓటర్లకు కొన్ని చోట్ల ముక్కుపుడకలు, మరికొన్ని చోట్ల చీరలు పంపిణీ చేస్తున్నారని తెలుస్తోంది.

దాడులతో భయోత్పాతం

ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో అధికారపార్టీ దాడులకు తెగబడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. వైఎస్సార్ నగర్‌లో రేషన్ సరుకులు తీసుకునేందుకు వెళ్లిన ఒక అవ్వ వైఎస్సార్ సీపీకి ఓటు వేస్తాననడంతో అధికారపార్టీకి చెందిన డీలరు, నేతలు ఆదివారం ఆమెపై దాడి చేశారు. సోమవారం అధికారపార్టీ నేతలు అయ్యలూరులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు పరమేశ్వరరెడ్డి ఇంట్లోకి వెళ్లి దారుణంగా చితకబాదారు. తాము ఓడిపోతామన్న భయంతోనే అధికారపార్టీ ఈ విధంగా దాడులకు దిగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి ఇంట్లో జరిపిన సోదాల్లో ఏమీ లభించలేదు. ప్రతిపక్ష నేతల ఇళ్లల్లో ఏమీ లభించకపోయినప్పటికీ దాడులు మాత్రం కొనసాగిస్తూ భయోత్పాతం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా ఎన్నికల్లో ఓటింగ్ జరగకుండా చూడాలనేది అధికారపార్టీ ఎత్తుగడగా ఉంది. అధికారపార్టీ దాడులకు తాము భయపడే ప్రసక్తే లేదని వైస్సార్‌సీపీ నేతలు తేల్చిచెబుతున్నారు.

పోలింగ్ ఏజెంట్ల న్యాయ పోరాటం

- పోలీసులు మా ఇళ్లకొచ్చి మమ్మల్ని బెదిరిస్తున్నారు
- తప్పు చేయకపోయినా నిర్బంధిస్తామంటున్నారు
- జోక్యం చేసుకోండి.. హైకోర్టులో పిటిషన్

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా అధికార పార్టీ అండతో స్థానిక పోలీసుల బెదిరింపులు, కక్ష సాధింపు చర్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి పోలింగ్ ఏజెంట్లు న్యాయ పోరాటం ప్రారంభించారు. తమపై తప్పుడు కేసులు నమోదు చేయకుండా, చట్ట విరుద్ధంగా అరెస్టులు చేయకుండా, ఎటువంటి వేధింపులకు గురి చేయకుండా నంద్యాల పోలీసులను ఆదేశించాలని కోరుతూ పోలింగ్ ఏజెంట్లు ఎం.విజయశేఖర్‌రెడ్డి మరో 44 మంది సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎస్పీ, డీఎస్పీ, ఇతర పోలీసులను ప్రతివాదులుగా చేర్చారు. పోలింగ్ ఏజెంట్లుగా తాము తమ దరఖాస్తులను అందచేసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగి తమను నిర్బంధిస్తామంటూ బెదిరింపులకు దిగారని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. తాము ఎటువంటి తప్పు చేయకపోయినా, తమపై ఎటువంటి కేసు లేకపోయినా పోలీసులు ఇళ్లకు సైతం వచ్చి బెదిరిస్తున్నారని తెలిపారు. రిటర్నింగ్ అధికారి తమను పోలింగ్ ఏజెంట్లుగా గుర్తించడానికి ముందే పోలీసులు అధికార పార్టీ ఏజెంట్లుగా వ్యవహరిస్తూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి పోలింగ్ ఏజెంట్లు లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. పోలీసుల చర్యలు తమ హక్కులను హరించడమేనన్నారు. అందువల్లే విధి లేని పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరపనుంది.

అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేస్తోంది...

నంద్యాల ఉప ఎన్నికలో అధికార పార్టీ తప్పుడు హామీలు, అమలు చేయలేని హామీలు ఇస్తూ ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తోందని, అందువల్ల నంద్యాల ఉప ఎన్నికను నిష్పాక్షికంగా జరిపేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నంద్యాలకు చెందిన తగరం కిరణ్‌బాబు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో భారత ఎన్నికల ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్, డీజీపీ, జిల్లా కలెక్టర్, ఎస్పీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో సహా కేబినెట్ మంత్రులందరూ నంద్యాలలోనే ఉండి ఓటర్లను అనేక రకాలుగా ప్రలోభ పెడుతున్నారని తెలిపారు. అనేకమంది మంత్రులు యథేచ్ఛగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అధికార యంత్రాంగాన్ని మొత్తం తమ చెప్పు చేతల్లో ఉంచుకుని, తమకు ఓటు వేయకపోతే సంక్షేమ పథకాల విషయంలో పునరాలోచన చేయాల్సి ఉంటుందంటూ బెదిరిస్తున్నారని వివరించారు. కావాల్సినవి చేస్తామంటూ అంగన్‌వాడీ వర్కర్లను పలు రకాలుగా ప్రలోభ పెడుతున్నారని తెలిపారు. అధికార పార్టీ వ్యవహారశైలి, ప్రలోభాల వల్ల ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగే అవకాశం లేదని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు.

టీడీపీని అడ్రస్ లేకుండా చేయండి

ఓటర్లకు ఆక్వా పార్కు బాధితుల విజ్ఞప్తి

తుందుర్రులో భారీ ర్యాలీ



నంద్యాలలో టీడీపీని ఓడించాలని ర్యాలీ నిర్వహిస్తున్న తుందుర్రు ఆక్వా పార్కు వ్యతిరేక పోరాట కమిటీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు, భీమవరం టౌన్ : ఓటు వేసే వారిని కాటు వేసే నైజం సీఎం చంద్రబాబునాయుడిదని పశ్చిమగోదావరి జిల్లా తుందుర్రు ఆక్వాపార్కు బాధితులు ఆరోపించారు. నంద్యాల ఉపఎన్నికలో టీడీపీని అడ్రస్ లేకుండా చేయాలని వారు నంద్యాల ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా తుందుర్రు, జొన్నలగరువు, కె బేతపూడి ప్రజలు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ డౌన్‌డౌన్, చంద్రబాబు డౌన్.. డౌన్ అంటూ నినదించారు. ర్యాలీని పోలీసులు లాఠీలతో అడ్డుకునే ప్రయత్నం చేయగా మహిళలు, పోరాట కమిటీ నాయకులు లెక్కచేయకుండా ముందుకు సాగారు. తొలుత తుందుర్రులో ప్రారంభమైన ర్యాలీ జొన్నలగరువు మీదుగా కంసాల బేతపూడిలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకుంది. చంద్రబాబుకు మంచి బుద్ధిని కల్పించాలని ఆకాంక్షిస్తూ ఎన్టీఆర్ విగ్రహానికి మహిళలు పాలాభిషేకం చేశారు. నంద్యాల ప్రజలు ఓటుతో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని వారు కోరారు.

నంద్యాలలో టీడీపీని అడ్రస్ లేకుండా చేయాలి

అనంతరం సీపీఎం నేతలు జేఎన్వీ గోపాలన్, కవురు పెద్దిరాజులు మాట్లాడుతూ, పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు అదేరీతిలో రాష్ట్ర ప్రజలకూ నెరవేర్చలేని హామీలిచ్చి, ప్రాజెక్టుల పేరుతో నిధుల్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. పోరాట కమిటీ నేతలు ఆరేటి వాసు, జవ్వాది సత్యనారాయణ, ముచ్చెర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలను ఆకట్టుకునేందుకు ఒక మాట.. అధికారమొచ్చాక మరో మాట చంద్రబాబు నైజమని విమర్శించారు. మూడేళ్లుగా ఇక్కడ ఫుడ్‌పార్కు వద్దని తాము పోరాటం చేస్తుండగా... సీఎం చంద్రబాబు మమ్మల్ని ఆహ్వానించి మీకు అన్యాయం చేయబోనని భరోసా ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ తుందుర్రులో ఫ్యాక్టరీ కట్టించడం దారుణమన్నారు. మంత్రులు సైతం ఇలాగే వ్యవహరించారని.. అడ్డు చెప్పిన తమపై అక్రమంగా కేసులు బనాయించారని మండిపడ్డారు. ఏడాదికి మూడు పంటలు పండే ఈ గ్రామాలను గోదావరి మెగా ఆక్వా ఫుడ్‌పార్కు నిర్మించి ఏడారి చేయడమేనా పాలన అంటే అని చంద్రబాబును ప్రశ్నించారు. ప్రజలు తలచుకుంటే టీడీపీ అడ్రస్ గల్లంతేనని పోరాట కమిటీ మహిళా నాయకులు ఎంపీటీసీ జవ్వాది వెంకటరమణ, ఆరేటి సత్యవతిలు హెచ్చరించారు. నంద్యాలలో పరిస్థితి చూస్తుంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఈ ర్యాలీలో పోరాట కమిటీ నేతలు కొయ్యే సంపత్, బెల్లపు సత్తిబాబు, సముద్రాల సత్యవాణి, చీడే నాగమణి, వీరవెంకటలక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఓటర్లను భయపెట్టేలా అధికార పార్టీ కుట్రలు

ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు


ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న శివకుమార్

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు తెలుగుదేశం పార్టీ కుయుక్తులు పన్నుతోందని ఎన్నికల సంఘానికి వైఎస్సార్ సీపీ ఫిర్యాదు చేసింది. దీన్ని అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్‌సీపీ తెలంగాణశాఖ ప్రధాన కార్యదర్శి శివకుమార్ సోమవారం ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకుండా చేయడమే అధికార పార్టీ ఎత్తుగడని చెప్పారు. అసాంఘికశక్తులను టీడీపీ రంగంలోకి దించిందని, కొన్నిచోట్ల పోలింగ్ ఏజెంట్లుగా నియమించిందని చెప్పారు. టీడీపీ తరఫున సినిమాతారలు చేసిన ఎన్నికల ప్రచారాన్ని ఆ పార్టీ అభ్యర్థి సొంతఖర్చుగానే పరిగణించాలని కోరామన్నారు. మంత్రి అఖిలప్రియ పొద్దుపోయే వరకూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడం నిబంధనల ఉల్లంఘనే అవుతుందన్నారు. టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసినట్టు ఫోటోలు, వీడియోలు స్పష్టం చేస్తున్నా, అవి పాంప్లెట్లు అని అధికారులకు వివరణ ఇవ్వడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన స్వయం సహాయ సంఘాల రిసోర్స్‌పర్సన్స్‌ను విధుల నుంచి తొలగించాలని ఈసీకి సీడీ ఆధారాలతో సమర్పించినట్టు తెలిపారు.

సకాలంలో వైద్యం అందక గిరిజన బాలుడి మృతి

- డయేరియాతో బాధపడుతూ మృత్యువాత
- విశాఖ జిల్లా లకేయిపుట్టు గ్రామంలో ఘటన

పెదబయలు (అరకు): విశాఖ జిల్లాలో డయేరియా బారిన పడి ఓ గిరిజన బాలుడు మృతి చెందాడు. జిల్లాలోని పెదబయలు మండలం లకేయిపుట్టు గ్రామానికి చెందిన పాంగి రవి (8) అనే బాలుడు డయేరియాతో బాధపడుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి నుంచి రవికి చాలా సార్లు వాంతులు, విరోచనాలు అయ్యాయని అతని తల్లిదండ్రులు తెలిపారు. దీంతో బాగా నీరసించిపోయి సోమవారం ఉదయం మృతి చెందాడని చెప్పారు. 108 వాహనానికి ఫోన్ చేసినా స్పందించలేదని, సకాలంలో వైద్యం అంది ఉంటే రవి మృతి చెందేవాడు కాదని బంధువులు తెలిపారు. కాగా, రవి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు.

కారెం శివాజీ నియామకంపై మరో పిటిషన్!

సర్కార్‌కు నోటీసులు.. కౌంటర్ దాఖలుకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా కారెం శివాజీని నియమించడాన్ని సవాలు చేస్తూ ఉమ్మడి హైకోర్టులో మరోసారి పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యంపై స్పందించిన హైకోర్టు, కారెం శివాజీ నియామకంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఎనిమిది వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శివాజీ నియామకం చట్ట నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని, అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని ఆయన నియామకాన్ని రద్దు చేయాలని కోరుతూ విశాఖపట్నం జిల్లాకు చెందిన కె.రాజారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ చల్లా కోదండరామ్ విచారణ జరిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులుగా ఉన్న సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, కారెం శివాజీకి నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ విచారణను 8 వారాలకు వాయిదా వేశారు.

అమెరికా విశ్వవిద్యాలయాలు సురక్షితం

జాత్యహంకార దాడులు పెరిగాయనడంలో నిజం లేదు

- అమెరికాలో అభ్యసించే భారతీయుల సంఖ్య తగ్గలేదు
- వీసాల జారీ, విద్యా విధానంలో మార్పుల్లేవు
- విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురికావొద్దు
- 'సాక్షి'తో అమెరికన్ కాన్సులేట్ వైస్ కౌన్సెల్ జొనాథన్ అక్లీ


జొనాథన్ అక్లీ

సాక్షి, హైదరాబాద్: అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడూ సురక్షితమేనని, జాత్యాహంకార దాడులు ఎక్కువవుతున్నాయన్న వార్తల్లో నిజం తక్కువేనని అంటున్నారు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ వైస్ కౌన్సెల్ జొనథన్ అక్లీ. అమెరికన్ విశ్వవిద్యాలయాల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్న నేపథ్యంలో యూనివర్సిటీల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి.. అక్లీతో 'సాక్షి' ప్రత్యేకంగా ముచ్చటించింది. ఆ వివరాలు..

ప్ర: అమెరికాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది కదా.. విద్యా విధానానికి సంబంధించి, వీసా జారీలకు సంబంధించి ఏమైనా మార్పులు జరిగాయా?

జవాబు: అలాంటివేవీ లేవు. విద్యకు సంబంధించి గత ప్రభుత్వ విధానాలే కొనసాగుతున్నాయి. అమెరికన్ పౌరుల రక్షణ.. చట్టబద్ధంగా ఈ దేశంలో చదువుకునేందుకు వచ్చిన వారు, పర్యటించేందుకు వచ్చిన వారిని భద్రంగా చూసుకోవడమన్నది అన్ని ప్రభుత్వాలూ అనుసరిస్తున్న విధానం. దీనిలో ఎలాంటి మార్పూ లేదు.

ప్ర: ఒకట్రెండేళ్ల క్రితం కొంతమంది తెలుగు విద్యార్థులను వెనక్కి పంపారు. కొన్ని వర్సిటీలు చేసిన పొరబాట్ల వల్ల విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారా?

జ: అమెరికాలో దాదాపు ఆరు వేల కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో అమెరికా ఉన్నత విద్యా సంస్థ గుర్తించినవి 4,500 మాత్రమే. వేటికి గుర్తింపు ఉంది? వేటికి లేదన్న వివరాలు www.chea.org వెబ్‌సైట్‌లో ఉన్నాయి.

ప్ర: ఇటీవలి కాలంలో అమెరికాలో జాత్యాహంకార దాడులు పెరిగినట్లు వార్తలొస్తున్నాయి. విద్యార్థులు అక్కడ సురక్షితంగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: వేర్వేరు దేశాల నుంచి వచ్చే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వం, వర్సిటీలు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. అయినా అక్కడక్కడా కొన్ని దురదృష్టకరమైన సంఘటనలు చోటు చేసుకున్న మాట నిజమే. కొంతమంది వ్యక్తులు చట్టాలను ఉల్లంఘించడం వల్ల ఇలా జరుగుతూంటుంది. వీరిని అదుపు చేసేందుకు తగిన చట్టాలున్నాయి. జాత్యాహంకార దాడుల్లాంటివి జరిగినప్పుడల్లా మా న్యాయ వ్యవస్థ ద్వారా దోషులకు శిక్ష పడేలా చేయగలుగుతున్నాం. కొన్ని విశ్వవిద్యాలయాలు ఇలాంటి సంఘటనలకు ఎలా స్పందించాలన్న విషయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాయి కూడా. వర్సిటీలను ఎంపిక చేసుకునేటప్పుడు విద్యార్థులు రక్షణకు సంబంధించిన ఏర్పాట్లనూ ఒకసారి పరిశీలించడం మేలు.

ప్ర: భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది..?

జ: ఇది నిజం కాదు. గత మూడేళ్ల గణాంకాలు తీసుకుంటే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలు మూడేళ్లలో 22 శాతం పెరిగాయి. హైదరాబాద్ నుంచి ఈ రకమైన వీసాల జారీ 48 శాతం వరకూ పెరిగింది. విద్యార్థి వీసాల విషయానికొస్తే.. 2014తో పోలిస్తే 2016 నాటికి 122 శాతం పెరిగింది. 2016లో దేశం మొత్తమ్మీద జారీ చేసిన విద్యార్థి వీసాల సంఖ్య దాదాపు 48 వేల వరకూ ఉంది. హెచ్–1బీ వీసాల విషయంలోనూ పెరుగుదలే కనిపిస్తోంది. 2014లో మొత్తం 60 వేల వీసాలు జారీ కాగా.. గత ఏడాది ఇవి 80 వేల కంటే ఎక్కువగా ఉన్నాయి.

''అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 1.66 లక్షల వరకూ ఉంది. అమెరికాలోని ఉన్నత విద్యావకాశాలను భారతీయ విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు ఎడ్యుకేషన్ యూఎస్ఏ అన్ని చర్యలు తీసుకుంటోంది. అమెరికాలోని ప్రతి ఆరుగురు విద్యార్థుల్లో ఒకరు భారతీయులై ఉండటం సంతోషకరం. అమెరికాలో విద్వేష దాడులను అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఉన్నతాధికారులూ ఖండించారు. ఉన్నత విద్య కోసం ఇక్కడకు రావాలనుకునే వారు భయాందోళనలకూ గురికావాల్సిన అవసరం లేదు''
– కేథరీన్ హడ్డా, యూఎస్ కాన్సులేట్ జనరల్, హైదరాబాద్.

''అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించాలనుకునేవారు హైదరాబాద్‌లోని కాన్సులేట్‌ను సంప్రదిస్తే.. మేము ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తాం. అక్రిడిటేడ్ కళాశాలల వివరాలు మొదలుకుని ఏ కాలేజీలో ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయో తెలియజేస్తాం విద్యార్థులు చేయాల్సిందల్లా కాన్సులేట్‌కు ఫోన్ చేసి ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవడం మాత్రమే''
– పియా బహదూర్, రీజనల్ ఆఫీసర్, యునైటెడ్ స్టేట్స్–ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్

నెలాఖరున 'జలసిరికి హారతి'

జలవనరుల శాఖ సమీక్షలో సీఎం

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో నదులు, వాగులు, సాగునీటి ప్రాజెక్టులు మొదలు పంట కుంటల వరకూ అన్ని జలవనరులకు ప్రణమిల్లేలా 'జలసిరికి హారతి' కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నెలాఖరులో ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. జలసిరికి హారతి జరిగినన్ని రోజులు.. ఆయా ప్రాంతాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకట్టుకోవాలన్నారు. సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో కలసి పోలవరం సహా 28 ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పోలవరం పనులపై వర్చువల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించిన సీఎం కాంక్రీట్ పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్పిల్ ఛానల్ కాంక్రీట్ పనులు 6.5 శాతమే పూర్తి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్దేశించుకున్న మేరకు 28 ప్రాజెక్టులను ఈ ఏడాది చివరికి పూర్తి చేయాలని ఆదేశించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో రెండు పంపులు సిద్ధం చేస్తున్నామని అధికారులు చెప్పారు. పోగొండ రిజర్వాయర్ అక్టోబర్ 22కి సిద్ధమవుతుందని.. ఎర్రకాలువ ఆధునికీకరణ పూర్తి కావొచ్చిందని.. అడవిపల్లి రిజర్వాయర్‌లో 0.6 టీఎంసీల వరకూ ఈ ఏడాది నీటిని నిల్వ చేస్తామని వివరించారు. శారదానదిపై ఆనకట్ట నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో అక్కడి నుంచే 'జలసిరికి హారతి' కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. సెప్టెంబరులో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఇస్రో శాస్త్రవేత్తలు సీఎం చంద్రబాబుకు వివరించారు.


పోలవరంపై సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో ఒప్పందం..

వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో న్యూఢిల్లీకి చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సంవత్సరం ఐదు కోట్లతో రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించనున్నట్లు కార్పొరేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఏపీలో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి చర్చించారు. గత ఏడాది రూ.178 కోట్లతో రాష్ట్రంలోని 8,300 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మించామన్నారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది తమ సంస్థ లక్ష్యమని, ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌సీ)తో కలిసి పనిచేయబోతున్నామని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రవి తెలిపారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై ముఖ్యమంత్రి సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు.

మందకొడిగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణం

రాష్ట్రంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం మందకొడిగా సాగుతోందని, వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. సోమవారం తన నివాసం నుంచి నీరుప్రగతి, వ్యవసాయంపై అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వర్షాభావం, రిజర్వాయర్లలోకి నీరు రాకపోవడం క్లిష్ట సమస్యగా మారాయన్నారు. ప్రతి మండలంలో ప్రతి నెలా వంద ఇళ్ల నిర్మాణం పూర్తికావాలని సూచించారు.

సీఎంను కలిసిన హాస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఈడీ

అమెరికాకు చెందిన హాస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్ డార్విన్ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. వెలగపూడి సచివాలయంలో చంద్రబాబును కలిసి ఉన్నత విద్యకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

'హీరాఖండ్'పై చర్యలు ఇక ఇంతేనా!

- హీరాఖండ్ పట్టాలు తప్పిన ఘటనలో 40 మంది మృత్యువాత
- తూతూమంత్రంగా విచారణ
- పీవే ఇన్‌స్పెక్టర్ బదిలీతో సరి
- విద్రోహ చర్యగా తేల్చేసిన రైల్వే అధికారులు


పట్టాలు తప్పిన హీరాఖండ్(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: రైల్వేలో చిన్నపాటి ప్రమాదం జరిగినా సంబంధిత బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుంటారు. ప్రమాద తీవ్రతను బట్టి పనిష్మెంట్ ఇస్తారు. అలాంటిది 40 మంది దుర్మరణం పాలైన ఘోర రైలు ప్రమాదంలో అధికారులపై ఎలాంటి చర్యలు లేకుండా కాపాడుతూ వస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే, వాల్తేరు డివిజన్‌లో ఆంధ్ర–ఒడిశా సరిహద్దులోని కూనేరు వద్ద ఈ ఏడాది జనవరి 21 రాత్రి హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో 40 మంది ప్రయాణికులు అశువులు బాశారు. వాల్తేరు డివిజన్ ఏర్పడ్డాక ఇదే అతి పెద్ద ప్రమాదం. ఇంతటి ఘోర ప్రమాదానికి కారణమైన వారిపై ఇప్పటిదాకా ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. హీరాఖండ్ రైలు ప్రమాదం జరిగిన వెంటనే ప్రాథమిక విచారణ జరగకుండానే రైల్వే అధికారులు విద్రోహ చర్యగా ప్రకటించారు. ఇలా ప్రకటించడం ద్వారా ప్రమాదాన్ని మావోయిస్టుల పైకి నెట్టివేయాలని ప్రయత్నించారు. ఘటన జరిగిన కూనేరు ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టుల కదలికలు ఉండడంతో రైల్వే అధికారులు ఈ ఎత్తుగడ వేశారు. కానీ ఒడిశా డీజీపీ మాత్రం ఈ ప్రమాదానికి మావోయిస్టులు కారణం కాదని అప్పట్లోనే తేల్చిచెప్పారు. ప్రమాదంపై నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), రైల్వే సేఫ్టీ కమిషన్, రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. నెలల తరబడి విచారణ జరిపారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు ఈ ప్రమాదానికి కారణం మావోయిస్టులేనని తేల్చేసి విచారణను ముగించేశారు. ప్రమాద స్థలం కూనేరు కేబిన్‌కు సమీపంలోనే ఉంది. అక్కడ రైల్వే సిబ్బంది నిత్యం పట్టాలను పర్యవేక్షిస్తుంటారు. అలాంటి ఆ ప్రదేశంలో మావోయిస్టులు కదలికలుండే అవకాశం లేదని, కేవలం రైల్వే సిబ్బంది నిర్లక్ష్యం వల్లే హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైందని అప్పట్లో నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఇన్‌స్పెక్టర్ బదిలీ.. ఇంజినీర్‌కు పదోన్నతి..

ఇంతటి ఘోర రైలు ప్రమాదంలో రైల్వే అధికారులు తూతూమంత్రంగానే చర్యలు తీసుకున్నారు. ఆ సెక్షన్‌లో పనిచేస్తున్న పర్మనెంట్ వే (పీవే) ఇన్‌స్పెక్టర్ తిరుమలరావును లక్ష్మీపూర్‌కు బదిలీచేసి చేతులు దులిపేసుకున్నారు. విచిత్రమేంటంటే సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈఎన్)పై చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఆయనను పదోన్నతిపై కాసులు కురిపించే కన్‌స్ట్రక్షన్ విభాగానికి బదిలీచేశారు. అంతేకాదు.. వాల్తేరు డివిజన్‌లోని ఇతర ఉన్నతాధికారుల జోలికి రైల్వే బోర్డు అధికారులు వెళ్లలేదు.

అక్కడలా.. ఇక్కడిలా!

ఈ నెల 19న ఉత్తర రైల్వే పరిధిలోని ఉత్తరప్రదేశ్ ముజఫర్‌నగర్ వద్ద ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటనలో 23 మంది ప్రయాణికులు మృతిచెందగా మరో వంద మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ రెండ్రోజుల కిందట రైల్వే బోర్డు ఉన్నతస్థాయి అధికారులపై చర్యలు తీసుకుంది. వీరిలో రైల్వే బోర్డు సభ్యుడు, ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం)లను సెలవుపై పంపేసింది. సీనియర్ డివిజనల్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్, జూనియర్ ఇంజినీర్లను సస్పెండ్ చేసింది. అదే రైల్వే శాఖ అంతకంటే ఎక్కువ మంది చనిపోయిన హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ దుర్ఘటనకు ఎవరినీ బాధ్యులను చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. అప్పట్లో కేంద్రమంత్రిగా ఉన్న బీజేపీ నేతకు సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సమీప బంధువు కావడంతో ఆయనను కాపాడడంలో భాగంగా కేంద్రమంత్రి ఒత్తిడి చేసినట్టు అప్పట్లోనే ప్రచారం జరిగింది. ఇప్పటికీ హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఘటనకు ఎవరినీ బాధ్యులను చేయకపోవడం ఆ ప్రచారానికి ఊతమిచ్చినట్టయింది. ఇలా రైల్వే బోర్డు వైఖరి ఒక జోన్‌లో ఒకలా, మరో జోన్‌లో మరోలా ఉండటం విమర్శలకు తావిస్తోంది.

నీటి విడుదల కోసం న్యాయపోరాటం

- కృష్ణా నీటిని మహారాష్ట్ర, కర్ణాటక అడ్డుకుంటున్నాయి
- సుప్రీం కోర్టుకు వెళతాం: మంత్రి దేవినేని

సాక్షి, అమరావతి: ఎగువ రాష్ట్రాల నుంచి ఒక చుక్క నీరు కూడా కిందకు రావడం లేదని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రకటించారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు దిగువకు రావాల్సిన కృష్ణా జలాలను అడ్డుకుంటున్నాయని, దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిపారు. స్పెషల్ లీవ్ పిటిషన్ లేదా ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలుపై న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. గత మూడు నెలల్లో 257 టీఎంసీల నీరు కృష్ణా నదిలోకి వచ్చినా ఒక్క టీఎంసీ కూడా కిందకు రాలేదన్నారు. నీటి కోసం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సాధారణ సగటు వర్షపాతం 351 మి.మీ.కి గాను 331 మి.మీ మాత్రమే కురిసిందన్నారు. ఇప్పటివరకు గోదావరి, వంశధార, నాగావళి నుంచి 500 టీఎంసీల నీరు సముద్రంలోకి కలిసిందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా 2018 నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి గ్రావిటి ద్వారా నీళ్లు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా 100 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తెచ్చినట్లు తెలిపారు.

నలుగురు ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: నలుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. పులివెందుల ఏఎస్పీగా ఉన్న కేకేఎన్ అన్బురాజన్‌ను చిత్తూరు ఓఎస్డీగా నియమించారు. గ్రేహౌండ్స్ అస్సాల్ట్ కమాండర్ బి.కృష్ణారావును పులివెందుల ఏఎస్పీగా బదిలీ చేశారు. పార్వతీపురం ఏఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌ను నర్సీపట్నం ఓఎస్డీగా బదిలీ చేశారు. గ్రేహౌండ్స్ అస్సాల్ట్ కమాండర్ అమిత్ బర్దర్‌ను పార్వతీపురం ఏఎస్పీగా నియమించారు. బదిలీ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ పేర్కొన్నారు.

ఐదు ప్రాంతాల్లో బౌద్ధ వలయం అభివృద్ధి

'స్వదేశ్ దర్శన్' కింద రూ.60 కోట్లు మంజూరు చేసిన కేంద్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో బౌద్ధ వలయం (బుద్ధిస్ట్ సర్క్యూట్)ను అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు. స్వదేశ్ దర్శన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.60 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సోమవారం కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతి వేదికగా పర్యాటక సౌకర్య కేంద్ర నిర్మాణం, పార్కింగ్ వసతి, ల్యాండ్ స్కేపింగ్, ధ్యానబుద్ధ వనం ఏర్పాటు, సౌండ్ అండ్ లైటింగ్ షో, విద్యుదీకరణ వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్వదేశ్ దర్శన్ నిధులలో అమరావతి, తొట్లకొండ, బావికొండ బౌద్ధ క్షేత్రాల అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. శాలిహుండం, బొజ్జన కొండ – లింగల కొండ, అనుపు బౌద్ధ క్షేత్రాలను పర్యాటకులకు అనువుగా అభివృద్ధి చేయనున్నట్లు ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు.

నాలుగో రోజుకు చేరిన మురుగన్ దీక్ష



వేలూరు (తమిళనాడు): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ చేపట్టిన దీక్ష నాలుగో రోజూ కొనసాగింది. 26 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్న మురుగన్ జీవ సమాధి అయ్యేందుకు నిర్ణయించుకుని ఈనెల 18వ తేదీ నుంచి జైలులో ఆహారం తీసుకోకుండా నీరు మాత్రమే తాగుతూ దీక్ష చేస్తున్నాడు. సోమవారం అతని ఆరోగ్యం క్షీణించేలా ఉండడంతో జైలులోనే వైద్యాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి వైద్య పరీక్షలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మురుగన్ దీక్ష చేపట్టడంతో మూడు నెలలపాటు అతని భార్య, కుటుంబసభ్యులు మురుగన్‌ను చూసేందుకు లేకుండా నిషేధం విధించారు.

నేడే 'కృష్ణా' పంచాయితీ

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టుల లెక్క తేల్చేందుకు యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సిద్ధమైంది. అనుమతి లేని ప్రాజెక్టులపై తెలుగు రాష్ట్రాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకుని అపెక్స్ కౌన్సిల్ నిర్వహించాలని ప్రతిపాదించిన నేపథ్యంలో కేంద్రం రంగంలోకి దిగింది. కేంద్రం ఆదేశాలతో చైర్మన్ ఎస్కే శ్రీవాత్సవ నేతృత్వంలో కృష్ణా బోర్డు మంగళవారం విజయవాడలో సమావేశం కానుంది. అనుమతి లేని ప్రాజెక్టులు, 2017–18లో నదీ జలాల పంపకం, బోర్డు వర్కింగ్ మ్యాన్యువల్ ఖరారు, టెలీమీటర్ల ఏర్పాటు లాంటి ఎనిమిది ప్రధాన అంశాలు అజెండాలో ఉన్నాయి. కృష్ణా నదిపై తెలంగాణ సర్కార్ పాలమూరు–రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి(సామర్థ్యం పెంపు), తుమ్మిళ్ల ఎత్తిపోతల, మిషన్ భగీరథలను అనుమతి లేకుండా చేపట్టిందని, అపెక్స్ కౌన్సిల్ నిర్వహించి దీనిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత నెల 1వతేదీన కేంద్రానికి లేఖ రాసింది. ఈ నేపథ్యంలోమంగళవారం జరిగే సమావేశంలో డీపీఆర్‌లపై ప్రధానంగా చర్చించనున్నారు.

2017–18 కేటాయింపులపై చర్చ

కృష్ణా జలాల్లో 512 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్‌కు, 299 టీఎంసీలు తెలంగాణకు కేటాయిస్తూ కేంద్రం చేసిన తాత్కాలిక సర్దుబాటుపై ఇరు రాష్ట్రాలూ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో 2017–18 నీటి కేటాయింపులపై సమావేశంలో చర్చించాలని బోర్డు నిర్ణయించింది. చిన్న నీటిపారుదల కింద చెరువులు, కుంటల్లో తెలంగాణ సర్కార్ 89.15 టీఎంసీలకుపైగా నీటిని వినియోగించుకుంటున్నా లెక్కలు చూపడం లేదని ఏపీ పేర్కొంది. మరోవైపు లోగోను ఖరారు చేయడంతోపాటు వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది.

వర్కింగ్ మ్యాన్యువల్‌పై దృష్టి

మూడేళ్లుగా వర్కింగ్ మ్యాన్యువల్ ఖరారు కాకపోవడంతో బోర్డుకు అధికారాలు లేకుండా పోయాయి. బోర్డుకు అధికారాలు కల్పించని పక్షంలో ఎవరి పరిధిలోని ప్రాజెక్టులను ఆ రాష్ట్రమే నిర్వహించుకునేలా ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ సర్కార్ కోరింది. ఈ నేపథ్యంలో వర్కింగ్ మ్యాన్యువల్ ఖరారుపై సమావేశంలో ప్రధానంగా చర్చించాలని బోర్డు చైర్మన్ ఎస్కే శ్రీవాత్సవ నిర్ణయించారు. బోర్డుకు సిబ్బంది, బడ్జెట్‌పై కూడా చర్చించి ఆమోదించనున్నారు.

నేడు మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ'

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

- టీడీపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ నంద్యాల మున్సిపల్ కార్మికులకు విజ్ఞప్తి

సాక్షి, అమరావతి

మున్సిపాలిటీల్లో పనిచేస్తోన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వం జారీ చేసిన జీవో 279ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు నేడు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు ఉమా మహేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు ఎ.రంగనాయకులు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, పర్మినెంట్ కార్మికులకు హెల్త్ కార్డులు, జీపీఎఫ్ అకౌంట్లు ఓపెన్ చెయ్యాలని, మున్సిపల్ స్కూళ్లల్లో పనిచేసే స్వీపర్లను ఫుల్‌టైం వర్కర్లుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 19 నెలలుగా సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ 13 రోజులుగా విజయవాడలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించినా ప్రభుత్వం చలించలేదని మండిపడ్డారు.

మంగళవారం ఉదయం విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి పదిన్నర గంటలకు మహాప్రదర్శన ప్రారంభమవుతుందని, అనంతరం ధర్నాచౌక్‌లో సభ నిర్వహిస్తామని వారు వెల్లడించారు. మున్సిపల్ కార్మికుల పొట్టగొట్టే కార్యక్రమాలు చేస్తోన్న టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నంద్యాల మున్సిపల్ కార్మికులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఓటు వేయాలని పిలుపునిచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

సెల్ఫీ దిగాల్సిందే..

అభిమానంతో జగన్ ఎదుట గుమిగూడిన విద్యార్థులు

- ఓపికగా అందరితో ఫొటోలు దిగిన జననేత
- వైఎస్సార్‌సీపీలో చేరిన పలువురు ప్రముఖులు
- జనసంద్రంగా మారిన గాంధీ చౌక్
- చివరి రోజు ప్రచారం సూపర్ హిట్


జననేతతో సెల్ఫీ దిగుతున్న యువతులు

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: 'జగనన్నా... మాతో సెల్ఫీ దిగాల్సిందే.. లేదంటే ముందుకు పోనివ్వం' అంటూ వందలాది మంది కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు నంద్యాలలోని శ్రీనివాసనగర్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌కి ఎదురొచ్చి గుమిగూడారు. ప్రచారంలో పాల్గొనాల్సి ఉంది కనుక సమయం లేదని జగన్ చెప్పినా... 'మొన్న కూడా మీరు ఇక్కడి నుంచే వెళ్లారు.. ఆ రోజు సెల్ఫీ దిగడానికి వీలు పడలేదు.. ఇపుడు మాకు సెల్ఫీలు కావాలి' అంటూ ముందుకు వచ్చారు. ప్రచారానికి చివరి రోజున ప్రారంభంలోనే ఈ అనుభవం ఎదురవ్వడంతో కొంత ఇబ్బంది కలిగినా, విద్యార్థులను నిరుత్సాహ పరచకుండా వాహనం నుంచి కిందకు దిగిన జగన్.. సుమారు గంటసేపు వారందరితో సెల్ఫీలు దిగారు. ప్రచారంలో దారి పొడవునా ఇలాంటి దృశ్యాలే. నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా ముస్లింలు, వైశ్యులు, బలహీన వర్గాలు అధికంగా ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, చాంద్‌బాడ, మున్సిపల్ హైస్కూల్, ఫాతిమా స్కూలు, బైర్మల్ వీధి, దర్గా, పండ్ల, కూరగాయల మార్కెట్ మీదుగా సోమవారం 13వ రోజు జగన్ ప్రచారం సాగించారు. గాంధీ చౌక్‌లో కిక్కిరిసిన జనం మధ్య మాట్లాడిన జగన్.. సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగించారు. సభ జరుగుతున్నపుడు నలుమూలల నుంచి చౌక్ వైపు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీగా రావడంతో కనుచూపు మేర జనసంద్రంగా కనిపించడం హైలైట్‌గా నిలిచింది.

'హరూన్' అధినేత ముస్తాఖ్ చేరిక

హరూన్ ఆటోమొబైల్స్ అధినేత ముస్తాఖ్.. జగన్‌ను తన ఇంటికి ఆహ్వానించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. టీడీపీ నేత ఎన్ఎండి ఫరూఖ్‌కు స్వయానా మేనల్లుడు అయిన ముస్తాఖ్.. వైఎస్సార్‌సీపీలో చేరడంతో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలిందని భావిస్తున్నారు. ముస్తాఖ్ కుటుంబ సభ్యులందరూ జగన్‌తో సెల్ఫీలు దిగారు. అందరితో జగన్ ఆప్యాయంగా మాట్లాడారు. వారు జగన్‌కు సంప్రదాయక టోపీని ధరింప జేశారు. జగన్.. ముస్తాక్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.


వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ ఎమ్మెల్సీ ఫరుఖ్ మేనల్లుడు ముస్తాఖ్

అవ్వా.. నేనే వస్తున్నా..

జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో జగన్ పర్యటిస్తున్నపుడు మరీ ఇరుకైన సందు ఒకటి వచ్చింది. ఆ సందులో దూరంగా ఓ పది మంది వృద్ధ మహిళలు ఆ రద్దీలో ముందుకు రాలేక దూరం నుంచే చేతులూపారు. మరి కొందరు మహిళలు ఈ విషయాన్ని జగన్ దృష్టికి తెస్తూ... 'అన్నా.. దూరంగా ఉన్న ఆ వృద్ధులు ఇక్కడకు రాలేరు. మీరు పైకెత్తి చేయి ఊపితే చాలు ఆనందిస్తారు' అన్నారు. జగన్ వెంటనే 'అవ్వా... నేనే వస్తున్నా..' అంటూ వాహనం నుంచి కిందకు దిగి సుమారు వంద మీటర్లు ఆ ఇరుకైన సందులో నడుచుకుంటూ వారి వద్దకు వెళ్లారు. తనను నిండు మనసుతో ఆశీర్వదించాలని వినమ్రంగా శిరస్సు వంచారు. 'మా ఆశీర్వాదం నీకే నాయనా...' అంటూ వారు సొంత మనవడిగా భావించి దీవెనలిచ్చారు. ఒక చోట మరీ ఇరుకైన ఇంట్లో ఉన్న ఓ వృద్ధురాలి వద్దకు జగన్ వెళ్లారు. 'నా పరిస్థితి చూడండి నాయనా.. నాకు పింఛన్ రావడం లేదు' అని ఆ వృద్ధురాలు గోడు వెల్లబోసుకుంది. జగన్ వెంటనే తన సహాయకులను పిలిచి ఆమెకు ప్రభుత్వం నుంచి పింఛను వచ్చేలా కృషి చేయాలని సూచించారు. తమ ప్రభుత్వం వచ్చాక మిమ్మల్ని తప్పకుండా ఆదుకుంటానవ్వా.. అని హామీ ఇచ్చి ముందుకు కదిలారు. ఓ దర్గా వద్ద ఆకు పచ్చని సంప్రదాయక పాగాను మత పెద్దలు జగన్ తలకు చుట్టారు.

పార్టీలో చేరిన విద్యా సంస్థల అధినేత


రామకృష్ణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్

రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి సోమవారం జగన్ ప్రచారానికి వచ్చినపుడు.. ఆయన్ను కళాశాలలోకి సాదరంగా ఆహ్వానించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప ఎన్నికలో శిల్పా మోహన్‌రెడ్డి గెలుపు కోసం గట్టిగా కృషి చేస్తామని ఆయన జగన్‌కు హామీ ఇచ్చారు. శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దీవెనలు ఉండాలని ఆయన ఆకాంక్షిస్తూ శివలింగాలతో కూడిన కండువాను జగన్‌కు కప్పారు. ఈ తరుణంలో రామకృష్ణారెడ్డి చేరిక కీలక పరిణామంగా భావిస్తున్నారు. గతంలో భూమా నాగిరెడ్డి అనుచరుడిగా ఉన్న ఆయన వైఎస్సార్‌సీపీలో చేరడం శిల్పాకు మేలు చేస్తుందని భావిస్తున్నారు.

జగన్ పిలుపు.. నంద్యాల్లో మలుపు!




సోమవారం నంద్యాలలోని సాహెబ్ దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అనంతరం ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ముస్లిం వాడల్లో వెల్లువెత్తిన అభిమానం

- ముగిసిన నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం
- ముందు నుంచే చంద్రబాబు ఎత్తుగడలు
- సర్కారు నిర్వాకాలను కడిగిపారేసిన ప్రతిపక్ష నేత
- ఒక్క హామీ నెరవేర్చలేదని నిలదీత
- అభివృద్ధి ముసుగులో సీఎం ప్రచారం
- నిందారోపణలను ప్రచారం చేయడంలో మంత్రులు నిమగ్నం

నంద్యాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికలో ఉవ్వెత్తున ఎగసిన ప్రచార హోరు సోమవారంతో పరిసమాప్తం అయింది. బుధవారం 23వ తేదీన పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తికావచ్చాయి. అధికార దర్పం, అర్థ బలాలతో రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు.. ప్రజా బలమే ఆలంబనగా బరిలోకి దిగిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మధ్యనే ప్రచార పోరు సాగింది. తమ స్థానాన్ని తామే తిరిగి నిలబెట్టుకోవాలని జగన్ పట్టు వదలని రీతిలో పోరాటం చేస్తే... తాను ప్రోత్సహించిన అక్రమ ఫిరాయింపులకు ఆమోద ముద్ర వేయించుకునేందుకు నంద్యాల ఎన్నికను వాడుకోవాలని ముఖ్యమంత్రి ప్రయత్నించారు. ఈ ఉప ఎన్నికలో వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డిలు సాంకేతికంగా ప్రత్యర్థులైనప్పటికీ సీఎం, ప్రతిపక్ష నేతకు మధ్యనే ఇది ప్రత్యక్ష పోరుగా పరిణమించింది. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయని ఆదిలోనే గ్రహించి ఎన్నికల షెడ్యూలు వెలువడటానికి రెండు నెలల ముందు నుంచే సీఎం తన ఎత్తుగడలను ప్రారంభించారు. ప్రలోభాల పర్వానికి ఓ వైపు ఆయన పదును పెడుతూనే మరో వైపు అభివృద్ధి అనే నినాదాన్ని తెరమీదకు తెచ్చి హడావుడి చేశారు. ఇక జగన్ రెండు వారాల పాటు సాగించిన తన ప్రచారంతో ఎన్నికలను తీవ్రంగా ప్రభావితం చేశారు. ఈ నెల 3వ తేదీన భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించడం ద్వారా జగన్ వేడిని రాజేశారు. రెండో విడతగా 9వ తేదీన నంద్యాలలో అడుగు పెట్టి.. ఏక బిగిన ప్రచార పర్వం ముగిసే వరకూ 13 రోజుల పాటు ఇక్కడే మకాం వేసి పల్లె పట్టుల్లోనూ, పట్టణంలోనూ కలియదిరిగి పరిస్థితులను వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా మార్చుకోగలిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాను నంద్యాల్లో స్వయంగా పర్యటించడంతో పాటు రాజధాని నుంచి రోజుకు రెండు సార్లు నంద్యాల ఉప ఎన్నికపై సమీక్ష చేస్తూ మంత్రులు, ముఖ్య నేతలను రంగంలోకి దించి ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు.

అభివృద్ధిలో డొల్లతనాన్ని వివరించిన జగన్

ఎన్నిక ముంగిట్లో నంద్యాల అభివృద్ధికి వందలాది కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి.. షెడ్యూలు వెలువడక ముందే గబ గబా ప్రారంభోత్సవాలు చేసేశారు. రోడ్ల విస్తరణ పేరుతో భవనాల కూల్చివేతలకు శ్రీకారం చుట్టారు. తమతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మించేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. ఉప ఎన్నిక అనగానే అధికార పక్షానికి నంద్యాల అభివృద్ధి గుర్తుకు వచ్చిందని.. అది కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పోటీ చేసినందు వల్లనే ఇలా అభివృద్ధి ఎజెండాను తెరమీదకు తెచ్చారని జగన్ తిప్పి కొట్టారు. అభివృద్ధిలోని డొల్లతనాన్ని ఎండగడుతూ నంద్యాల ఓటర్లకు స్పష్టంగా వివరించారు. తమకు ఓటేస్తే అభివృద్ధి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అన్ని పనులూ జరిపిస్తామని నంద్యాల ఓటర్లకు భరోసా ఇవ్వగలిగారు.

అక్కున చేర్చుకున్న ముస్లిం వర్గాలు

ముస్లిం వర్గాల్లో ప్రతిపక్షం అంటే వ్యతిరేకత ఉందని టీడీపీ రక రకాలుగా దుష్ప్రచారం చేసింది. నిన్నటి వరకూ తమ పార్టీలోనే ఉండిన శిల్పా మోహన్‌రెడ్డి బయటకు వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ టికెట్ తీసుకుని బలమైన ప్రత్యర్థిగా పరిణమించగానే ముఖ్యమంత్రే సాక్షాత్తూ ఆయనకు వ్యతిరేకంగా మాట్లాడారు. తాను స్వయంగా పాల్గొన్న ముస్లింల సభలో ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బ తీసేలా వక్తలతో మాట్లాడించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇచ్చిన చంద్రబాబుకు 2017 ఉప ఎన్నిక వచ్చేనాటికి చెడ్డవారయ్యారా! అనే చర్చ నంద్యాలలో చోటు చేసుకుంది. టీడీపీలో కొత్తగా ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులు పొందిన ముస్లిం నేతలు, ఇతరత్రా లబ్ధి పొందిన నేతలు సైతం శిల్పాపై బురద జల్లారు. కానీ జగన్ ముస్లిం వాడల్లో తిరిగినపుడు వెల్లువెత్తిన జనాభిమానం చూశాక ఈ దుష్ప్రచారం అంతా కొట్టుకుపోయింది. జగన్ ఇతర ప్రాంతాల్లో పర్యటించినపుడు ఏ రీతిలో జనాదరణ వ్యక్తం అయిందో అంతకు రెట్టింపు ప్రజాభిమానం ముస్లిం వాడల్లో లభించింది. ముస్లిం వాడల్లో ఒక వీధి నుంచి మరొక వీధిలోకి వెళ్లడానికి గంటల సమయం పట్టింది. ప్రతి ఇంటిలోకి జగన్‌ను ఆహ్వానించడానికి ముస్లిం మహిళలు పోటీ పడ్డారు. సెల్ఫీ తీసుకోవడానికి పోటీపడి ముందుకు వచ్చారు. చివరి రోజున ముస్లింలు అధికంగా ఉండే గాంధీ చౌక్ వద్ద జరిగిన తుది బహిరంగ సభకు పోటెత్తిన జనాన్ని చూసిన వారికి ముస్లింలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పై ఏ స్థాయిలో ఆదరణ ఉందో ఇట్టే స్పష్టం అవుతుంది.

బాబు హామీలు.. జగన్ విశ్వసనీయత

2014 ఎన్నికలపుడు రైతు, డ్వాక్రా రుణ మాఫీ వంటి హామీలిచ్చిన చంద్రబాబు.. వాటి అమలు గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. అభివృద్ధితో బ్రహ్మాండం బద్ధలు కొడతామని చెప్పుకున్నారు. జగన్ మాత్రం తన ప్రసంగాల్లో చంద్రబాబు విశ్వసనీయతను ఎండగట్టడంతో పాటుగా రైతు, డ్వాక్రా మహిళల రుణాల రద్దులో జరిగిన మోసాన్ని ప్రధానంగా ప్రచారం చేశారు. రుణాలు మాఫీ అయ్యాయా... ఉద్యోగాలు వచ్చాయా... అంటూ జగన్ సూటిగా ప్రజలనే ప్రశ్నించి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. తాము అధికారంలోకి వస్తే ఏ విధంగా (నవరత్న) పథకాలు అమలు చేస్తామో ప్రకటించారు. రాష్ట్రంలో ఆర్య వైశ్యులకో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని చెప్పి వారిని ఆకట్టుకున్నారు. నంద్యాల ముస్లిం ప్రతినిధి ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ప్రకటించారు. రాజకీయాల్లో అత్యధికంగా సీట్లు ఇచ్చింది వైఎస్సార్ కాంగ్రెస్సేనని బల్ల గుద్ది చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నుంచి తనకు విశ్వసనీయత సంక్రమించిందని, ఆయన అడుగు జాడల్లోనే నడుస్తానని చెప్పి జనాన్ని ఆకట్టుకున్నారు. ఇంత వరకూ ఏ ప్రతిపక్ష నేతా చేయని రీతిలో జగన్ నంద్యాల ఉప ఎన్నికను పట్టుదలగా తీసుకుని పని చేశారు. 13 రోజుల పాటు రోజుకు 10 నుంచి 11 గంటల సేపు జనం మధ్యనే గడిపారు. పేరుకు రోడ్‌షో అయినా చివరికి వచ్చేటప్పటికి జనాభిమానం ముందు అది పాదయాత్రగా మారింది. ఏ నేతకూ లేని విధంగా జగన్‌కు ఆదరణ లభించింది. ఇక ప్రజా తీర్పు వెలువడాల్సి ఉంది.

బోనస్ వరిస్తేనే..!



- 17 ఏళ్లలో నాలుగుసార్లు మాత్రమే రైతులకు బోనస్
- గిట్టుబాటు ధర లభించక ఆందోళనలో రైతన్నలు
- రైతులకు ఉపయోగంలేని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- తిరిగి బోనస్ ఇస్తేనే రైతుకు ప్రయోజనం

రాష్ట్రంలో గత ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు విస్తీర్ణ లక్ష్యం, సాగు చేసిన వివరాలిలా ఉన్నాయి... రాష్ట్రం మొత్తం లక్ష్యం: 16,03,472 హెక్టార్లు | సాగు 14,70,381 హెక్టార్లు

జిల్లా	శ్రీకాకుళం	విజయనగరం	విశాఖపట్నం	తూ.గో	ప.గో.	కృష్ణా	గుంటూరు	ప్రకాశం	నెల్లూరు	కర్నూలు	అనంతపురం	వైఎస్సార్	చిత్తూరు
లక్ష్యం (హెక్టార్లలో)	2,04,661	1,19,069	1,01,628	2,29,617	2,38,524	2,45,279	2,30,553	32,185	46,378	79,018	26,116	36,788	13,656
సాగు (హెక్టార్లలో)	2,01,779	1,21,750	1,02,836	2,19,349	2,28,796	2,13,465	1,59,247	14,155	72,937	67,985	16,471	31,424	20,187

సాక్షి, అమరావతి

ఏటికి ఎదురీదుతున్న అన్నదాతను ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర ఏటా వెక్కిరిస్తోంది. వరి సాగుకయ్యే ఖర్చుకి, రాబడికి ఏమాత్రం పొంతన ఉండకపోవడంతో నష్టాలను చవిచూస్తున్నాడు. వీటి నుంచి రైతులను గట్టెక్కించేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర ఇస్తామంటూ ప్రభుత్వం ఊదరగొట్టడం మినహా వాటి వల్ల రైతులకు ఒక్క పైసా ఉపయోగం ఉండడంలేదు. పేరుకు మాత్రం రాష్ట్రవ్యాప్తంగా ఏటా 1054లకు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నా అక్కడా రైతులకు మద్దతు ధర ఇవ్వడంలేదు. కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతం ఎక్కువ ఉందని, రాళ్లు, మట్టిపెళ్లలు ఉన్నాయంటూ కొర్రీలు పెడుతూ ధరలో కోత విధిస్తూ రైతులను నిరాశపరుస్తున్నారు. ప్రస్తుతం క్వింటాల్ ధాన్యం ఏ–గ్రేడ్ రకానికి రూ.1510, సాధారణ రకానికి రూ.1470లుగా మద్దతు ధర ప్రకటించినా ప్రభుత్వ ఆధ్వర్యంలోని వెలుగు గ్రూపులు, పీఏసీఎస్, ఐటీడీఏ, డీసీఎంఎస్, మహిళా స్వయం సహాయక గ్రూపుల ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లోనూ ఆ మేరకు రైతన్నలకు ధర దక్కడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు మోసపోకుండా ధాన్యం శుభ్రంచేసే యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు, బరువు తూచే పరికరాలు, కాలిపర్స్, టార్పాలిన్లు, తూర్పారబట్టే యంత్రాలు, పాలిథీన్ సంచులు మొదలైన వాటిని అందుబాటులో ఉంచాలి. కానీ, సగం కేంద్రాల్లో కూడా అవి కనిపించే పరిస్థితి లేదు.

వైఎస్ అలా...

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో గతంలో ఎన్నడూ లేని విధంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వరుసగా నాలుగేళ్లపాటు మద్దతు ధరకు అదనంగా రూ.400 నుండి రూ.1000 దాకా బోనస్ ఇచ్చి రైతాంగాన్ని ఆదుకున్నారు. ఆ తర్వాత వచ్చిన పాలకులు బోనస్ ఊసే ఎత్తడంలేదు. వైఎస్ ఇచ్చిన మాదిరిగానే ఇప్పటి ప్రభుత్వం కూడా ధాన్యానికి అదనంగా బోనస్ ఇస్తే కొంత వరకు న్యాయం జరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

చంద్రబాబు ఇలా...

2014 ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ఊరూ వాడా తిరిగి రైతుకు లాభసాటి ధరలు కల్పించేందుకు వీలుగా స్వామినాథన్ సిఫార్సులు అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రైతులు ఒక క్వింటా ధాన్యం పండించేందుకు రూ.2291లు ఖర్చు అవుతోంది. ఈ లెక్కన స్వామినాథన్ చేసిన సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి వ్యయానికి అదనంగా 50శాతం రైతుకు చెల్లించాలి. అంటే.. క్వింటాల్‌కు రూ.3436 మేర రైతుకు ధర అందాల్సి ఉంది. కానీ.. ప్రస్తుతం మొదటి రకం ధాన్యానికి రూ.1510, సాధారణ రకానికి రూ.1470లుగా మద్దతు ధర మాత్రమే నిర్ణయించారు. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో వరి సాగుపై విముఖత చూపుతున్నారు. ఈ తేడా ఉభయ గోదావరి జిల్లాల తోపాటు కృష్ణా, గుంటూరు, ప్రకాశంలలో ఎక్కువగా కనిపిస్తోంది.

ధాన్యానికి మద్దతు ధరతోపాటు బోనస్ ఉండాలి



ప్రస్తుతం ఇస్తున్న మద్దతు ధరతో రైతుకు ఏ మాత్రం గిట్టుబాటు లభించడంలేదు. పెట్టుబడి వ్యయానికి తగినట్లుగా మద్దతు ధరలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొన్ని జిల్లాల్లో వరి తప్ప వేరే పంట సాగు చేసుకునే పరిస్థితిలేదు. అలాంటి జిల్లాల్లోని రైతులకు కోలుకోలేని దెబ్బపడుతోంది. గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. వైఎస్ హయాంలో ధాన్యానికి మద్దతు ధరతోపాటు బోనస్ ఉండేది. అందువల్ల రైతులకు కొంత ఊరట లభించేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. బోనస్ ఇచ్చే విషయమై ప్రభుత్వం ఆలోచించాలి.

– నారాయణ, చిన్న దేవలాపురం, బండి ఆత్మకూరు మండలం, కర్నూలు జిల్లా

2000-01 నుంచి 2016-17 వరకు ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర, బోనస్

సంవత్సరం	క్వింటాల్ కనీస మద్దతు ధర		బోనస్
	గ్రేడ్-ఏ	సాధారణ	
2000-01	540	510	0
2001-02	560	530	0
2002-03	530	530	0
2003-04	580	550	0
2004-05	590	560	0
2005-06	600	570	0
2006-07	610	580	400
2007-08	675	645	1000
2008-09	880	850	500
2009-10	980	950	500
2010-11	1030	1000	0
2011-12	1110	1080	0
2012-13	1280	1250	0
2013-14	1345	1310	0
2014-15	1400	1360	0
2015-16	1450	1410	0
2016-17	1510	1470	0



తిరుపతిలో పేదల ఇళ్లు బలవంతంగా తొలగించే కుట్ర

- స్కావెంజర్స్ కాలనీ వాసులను ఖాళీ చేయించడం దారుణం
- సినీ నటుడు, ఎంపీ కె.చిరంజీవి



సాక్షి, అమరావతి: తిరుపతి నగరంలోని 18వ వార్డులో ఉన్న స్కావెంజర్స్ కాలనీలో 70 ఏళ్లుగా కాపురం ఉంటున్న 160 కుటుంబాలను బలవంతంగా ఖాళీ చేయించి 2.34 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని సినీ నటుడు, ఎంపీ కె.చిరంజీవి అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాలనీలో పలు అభివృద్ధి పనులు చేయించానని, మానవీయ కోణంతో అక్కడి బాధితులకు న్యాయం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తరతరాలుగా నివాసం ఉంటున్న పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలను, యానాది కులస్తులను అక్కడి నుంచి తరిమి వేయడానికి ప్రభుత్వం వారికి వేరే చోట పునరావాసం కల్పిస్తామంటూ మభ్యపెడుతోందన్నారు. తిరుపతి నగరం నడిబొడ్డున స్కావెంజర్స్ కాలనీ ఉండటం ఈ ప్రభుత్వం సహించలేకపోతోందన్నారు. ప్రజలందరినీ సమానంగా చూడాలని రాజ్యాంగం చెబుతున్నా అందుకు విరుద్ధంగా.. ప్రభుత్వం బల ప్రయోగంతో.. బలహీనులైన పారిశుద్ధ్య కార్మిక కుటుంబాలను, యానాది కుటుంబాలను తరలించాలని చూడటం సహించరానిదన్నారు. స్కావెంజర్స్ కాలనీని రోల్ మోడల్ కాలనీగా అభివృద్ధి పర్చాలని, వారి కుటుంబాల్లో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించి తగిన భరోసా కల్పించాలని చిరంజీవి డిమాండ్ చేశారు.

విడిపోయినా మనం తెలుగువారమే

- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఇద్దరు సీఎంలు రాష్ట్రాలను ముందుకు తీసుకెళ్లాలి
- తెలంగాణ రాష్ట్రం తరఫున ఉపరాష్ట్రపతికి ఘనంగా పౌర సన్మానం

సాక్షి, హైదరాబాద్: తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా ప్రపంచం దృష్టిలో మనమంతా తెలుగువారమే అని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చెప్పారు. సోమవారం రాజ్‌భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం, ప్రజల తరఫున సీఎం కె.చంద్రశేఖర్‌రావు.. ఉపరాష్ట్రపతి వెంకయ్యకు ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల సీఎంలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో సమస్యలను అర్థం చేసుకుని రాష్ట్రాలను ముందుకు తీసుకెళ్లాలని అభిలషించారు. ఒక కుటుంబంలో, అన్నదమ్ముల మధ్య అభిప్రాయ భేదాలున్నట్లే 2 రాష్ట్రాల మధ్యా ఉంటాయని, అయినా ఇద్దరు సీఎంలు కలసిమెలసి పనిచేస్తూ రెండు రాష్ట్రాలను బలోపేతం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఆకలి, అవినీతిలేని సమాజం కావాలి

స్వరాజ్యం వస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని స్వాతంత్య్ర పోరాటం చేశారని, స్వరాజ్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా సమస్యలన్నీ పరిష్కారమయ్యాయా.. అన్న విషయంపై రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులందరూ ఆత్మావలోకనం చేసుకోవాలని సూచించారు.



సోమవారం రాజ్‌భవన్‌లో వెంకయ్యనాయుడుకు సీఎం కేసీఆర్ పౌర సన్మానం. చిత్రంలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ, గవర్నర్ నర్సింహన్

ఎవడయ్యా వాడు.. తెలుగువాడు

మన కట్టుబొట్టూ, ఆటా పాటా, మన భాష, మన ధ్యాస, మన గోసలను కాపాడుకోవాల్సిన అవసరముందని ఆయన చెప్పారు. తెలుగు భాషలో సౌందర్యముందని, తెలుగువాడికి ప్రత్యేకత ఉందన్నారు. తెలుగువాడిపై సినారె రాసిన 'పంచెకట్టులో ప్రపంచంలోనే మొనగాడు.. కండువా లేనిదే గడపదాటని వాడు.. పంచభక్ష్యాలు కంచాన వడ్డించినా గోంగూర పచ్చడికై చూసేవాడు.. ఎవడయ్యా ఎవడు వాడు.. ఇంకెవడయ్యా తెలుగువాడు.' పంక్తులను గుర్తుచేసుకున్నారు.

ఎవరినీ కలవలేకపోతున్నా: తెలిసిన వారిని అభిమానంతో, ఆదరణతో పలకరించకపోతే జీవితానికి అర్థమేముంది అని వెంకయ్య ప్రశ్నించారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికయ్యాక ప్రోటోకాల్, భద్రత సమస్యల వల్ల తనను కలవడానికి వచ్చిన వారిని కలవలేకపోతున్నానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన తనకు ఈ కొత్త బాధ్యతలు ఇబ్బందికరంగా మారాయని, త్వరలో పరిష్కారం కనుక్కుంటానని చెప్పారు. అసెంబ్లీలు, లోక్‌సభ, రాజ్యసభ జరుగుతున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తంచేశారు.

రాజ్యసభను సజావుగా నడుపుతారు

వెంకయ్య గొప్ప వక్త అని, రాజ్యసభను సజావుగా నిర్వహించడంలో సఫలమవుతారని గవర్నర్ నరసింహన్ అన్నారు. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి ఎంతో సేవ చేసిన వెంకయ్య.. ఉప రాష్ట్రపతిగా కూడా ఎంతో మేలు చేస్తారనడంలో ఎలాంటి అనుమానాలు లేవన్నారు.

మనందరికీ గర్వకారణం: కేసీఆర్

ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చాకే దేశంలో తెలుగువారంటూ ఉన్నారని ప్రపంచానికి తెలిసిందని, తెలుగు భాష ఉందన్న గౌరవం లభించిందని, మళ్లీ అలాంటి గౌరవం తెలుగు బిడ్డ వెంకయ్య ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో లభించిందని కేసీఆర్ కొనియడారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీఎం కేసీఆర్.. వెంకయ్యకు పట్టు వస్త్రాలు, మెమెంటోను బహూకరించి సత్కరించారు.

26న అమరావతికి ఉపరాష్ట్రపతి రాక

- వెంకయ్యకు ఘనంగా పౌర సన్మానం చేసేందుకు ఏర్పాట్లు
- రెండు రోజులు రాష్ట్రంలో పర్యటన

సాక్షి, అమరావతి: ఉపరాష్ట్రపతి హోదాలో వెంకయ్యనాయుడు ఈ నెల 26వతేదీన తొలిసారిగా రాష్ట్రానికి రానున్నారు. 26, 27వ తేదీల్లో ఉపరాష్ట్రపతి రాష్ట్రంలో పర్యటించనున్నారని, ప్రోటోకాల్ ప్రకారం స్వాగత కార్యక్రమాలు, వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం తెలిపారు. ఈనెల 26న అమరావతిలో వెంకయ్యకు ప్రభుత్వం ఘనంగా పౌరసన్మానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని, ఇందుకోసం సచివాలయంలో మూడు హెలిపాడ్లను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ కూడా పాల్గొననున్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం తెనాలిలో పుస్తకావిష్కరణకు వెంకయ్య హాజరవుతారు. 27వ తేదీన విజయవాడ సమీపంలోని ఆత్కూరులో నిర్వహించే మెగా మెడికల్ క్యాంపులో ఉప రాష్ట్రపతి పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. సచివాలయం సమీపంలో చేస్తున్న ఏర్పాట్లను ఉన్నతాధికారులతో కలసి కలెక్టర్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కమిషనర్ జె.నివాస్, విజయవాడ ఆర్డీవో హరీష్, డీసీపీ బ్రహ్మానంద రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సాక్షి భవిత 9
స్వర్ధయా వర్ధతే విద్య
మంగళవారం 22-8-2017

ఐఐఎంలు.. పరిచయం అక్కర్లేని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లు. కానీ.. అవి ఇచ్చే సర్టిఫికెట్లకు మాత్రం అంతర్జాతీయ గుర్తింపు విషయంలో ఒక్కో దేశంలో ఒక్కో నిర్ణయం. ఇన్‌స్టిట్యూట్స్‌లో పరిపాలనపరంగానూ పలు అడ్డంకులు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించుకోవాలన్నా ఎన్నో నిబంధనలు. ఇలాంటి పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా ఐఐఎంలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తూ తెచ్చిన ఐఐఎం బిల్లు-2017కు ఇటీవల లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుతో ఇన్‌స్టిట్యూట్‌లకు, విద్యార్థులకు కలగనున్న ప్రయోజనాలపై విశ్లేషణ..

ఐఐఎం విద్యార్థులకు..
ఎంబీఏ 'పట్టా'!

❒ ఐఐఎం బిల్లు-2017తో స్వయం ప్రతిపత్తి



ఇక ఎంబీఏ, పీహెచ్‌డీ పట్టాలు

ఇప్పటివరకు ఐఐఎంలు తాము అందిస్తున్న కోర్సులను పీజీ డిప్లొమా లేదా, ఎగ్జిక్యూటివ్ డిప్లొమా పేరుతో సర్టిఫికెట్లను జారీ చేస్తున్నాయి. వీటికి మార్కెట్‌పరంగా, ఉన్నత విద్య కోర్సుల్లో చేరడం విషయంలోనూ పలు దేశాల్లో మాస్టర్ స్థాయి గుర్తింపు లభించడం లేదు. పీహెచ్‌డీకి సమానమైనదని పేర్కొనే ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం)ను సైతం పలు విదేశీ వర్సిటీలు పీహెచ్‌డీగా పరిగణించేందుకు సంకోచిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో.. ఐఐఎం బిల్లు-2017 అమలు ద్వారా ఐఐఎంలకు డిప్లొమాలకు బదులు డిగ్రీలు మంజూరు చేసే అవకాశం లభిస్తుంది. ఐఐఎంలు పీజీడీఎం, ఫెలో ప్రోగ్రామ్స్‌కు బదులు ఎంబీఏ, పీహెచ్‌డీలు ప్రదానం చేసే వీలు కలుగుతుంది.

డైరెక్టర్ నియామకం

తాజా బిల్లు ద్వారా కొత్త డైరెక్టర్‌ను నియమించుకోవడంలో ఐఐఎంలులోని బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు స్వీయ అధికారాలు కల్పిస్తారు. ఇప్పటివరకు ఈ విషయంలో హెచ్‌ఆర్‌డీ శాఖ ఆమోదం తీసుకోవాల్సి వచ్చేది. దీనివల్ల ఏళ్ల తరబడి డైరెక్టర్లు లేకుండానే ఇన్‌స్టిట్యూట్స్ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. స్వయంప్రతిపత్తి కల్పించడం వల్ల ఒక డైరెక్టర్ పదవీ కాలం పూర్తవగానే కొత్త డైరెక్టర్‌ను నియమించుకునే వీలు కలుగుతుంది.

ఫ్యాకల్టీ కొరతకూ పరిష్కారం

ఐఐఎం-బిల్లు 2017లో ఫ్యాకల్టీ నియామకాల్లోనూ ఇన్‌స్టిట్యూట్‌లకు స్వయంప్రతిపత్తి ప్రతిపాదించారు. దీనివల్ల ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా ఐఐఎంలలో ఫ్యాకల్టీ కొరత సమస్యకు పరిష్కారం దొరకనుంది. విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీని ఆహ్వానించే విషయంలోనూ ఐఐఎంలకు స్వేచ్ఛ లభించనుంది.

కోఆర్డినేషన్ ఫోరమ్

బిల్లు ప్రకారం అన్ని ఐఐఎంలకు కలిపి ఒక కోఆర్డినేషన్ ఫోరమ్ ఏర్పాటు కానుంది. దీనికి అన్ని ఇన్‌స్టిట్యూట్‌ల బీఓజీ చైర్ పర్సన్స్ ప్రాతినిధ్యం వహిస్తారు. వారిలోంచి ఒకరిని కోఆర్డినేషన్ ఫోరమ్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేస్తారు. చైర్ పర్సన్ రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారు. తద్వారా ప్రస్తుతం పలు అంశాలపరంగా ఒక్కో ఐఐఎంలో ఒక్కో తీరుగా అమలవుతున్న విధానాలకు తెరపడి.. కామన్ పాలసీ రూపొందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ప్రవేశ ప్రక్రియల్లో ఈ ఉమ్మడి విధానం వల్ల విద్యార్థులకు వ్యయప్రయాసల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఇతర ప్రాంతాల్లో... విదేశాల్లో సైతం

ప్రస్తుత నిబంధనల ప్రకారం ఐఐఎంలు.. అవి నెలకొన్న ప్రాంతంలోనే అకడమిక్ తరగతులను నిర్వహించే వీలుంది. ఐఐఎం-బిల్లు 2017 ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఇతర ప్రాంతాల్లోనూ లెర్నింగ్ సెంటర్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో విదేశాల్లో సైతం స్టడీ సెంటర్లను నెలకొల్పవచ్చు. ఈ సెంటర్లతో గ్లోబల్ ర్యాంకింగ్స్ పరంగా కీలక పారామీటర్‌గా ఉన్న ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ రేషియో విషయంలో ముందంజలో ఉండొచ్చు. సెంటర్ ఏర్పాటు చేసిన విదేశీ యూనివర్సిటీతో ఒప్పందం ద్వారా కొలాబరేటివ్ రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహించే అవకాశం కూడా లభిస్తుంది. ఇది కూడా గ్లోబల్ ర్యాంకింగ్స్ పరంగా పోటీ పడేందుకు, ముందు నిలిచేందుకు ఆస్కారం కల్పిస్తుంది.

రీసెర్చ్‌కు ప్రాధాన్యం

బిల్లులో మరో ప్రధానాంశం.. ఐఐఎంలు స్వయంగా రీసెర్చ్ యాక్టివిటీస్ దిశగా స్వతంత్రంగా వ్యవహరించడం. రీసెర్చ్‌కు అవసరమైన నిధుల సమీకరణ, ఎక్స్ఛేంజ్ ఒప్పందాలు, స్పాన్సర్డ్ రీసెర్చ్ కార్యకలాపాలు వంటివాటి విషయంలో సదరు ఐఐఎం గవర్నింగ్ కౌన్సిల్‌కే పూర్తి నిర్ణయాధికారాలు ఉంటాయి. ఈ ప్రతిపాదన విద్యార్థులకు రీసెర్చ్ యాక్టివిటీస్ పరంగా విద్యార్థులకు మేలు చేస్తుందని భావిస్తున్నారు.

వైవిధ్యానికి ప్రాధాన్యం

బిల్లులో మరో కీలకాంశం వైవిధ్యం (డైవర్సిటీ)కు ప్రాధాన్యం ఇవ్వడం. రిజర్వేషన్లు, జండర్ డైవర్సిటీ ద్వారా అన్ని వర్గాలకు ఐఐఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టే వీలు కల్పిస్తోంది బిల్లు.
ఐఐఎంలు దేశవ్యాప్తంగా విస్తరించినా కొందరికే అవకాశం లభిస్తోంది. ఇలాకాకుండా ఫ్యాకల్టీ నియామకాల్లోనూ డైవర్సిటీని పాటించనున్నారు. దాంతోపాటు ఐఐఎంలలో ప్రవేశానికి నిర్వహించే క్యాట్ స్వరూపం అన్ని అకడమిక్ నేపథ్యాలవారికి అనుకూలంగా ఉండేలా చూడాలనేది కొత్త బిల్లులోని మరో ముఖ్యాంశం. ఫలితంగా ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ నేపథ్యం ఉన్నవారికే క్యాట్ అనుకూలం, మిగతా వారికి అవకాశాలు స్వల్పం అనే అభిప్రాయాలకు స్వస్తి పలికే చర్యలు చేపట్టే వీలు కలుగుతుంది.

ముఖ్యాంశాలు

- మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేసే అధికారం
- ఫ్యాకల్టీ, డైరెక్టర్ల నియామకంలో స్వేచ్ఛ
- కొలాబరేటివ్ రీసెర్చ్ విషయంలో స్వతంత్రత
- డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సెంటర్స్ ఏర్పాటు
- అడ్మిషన్ ప్రక్రియలో లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్‌కు ఆస్కారం ఇచ్చేలా చర్యలు
- ఐఐఎం కోఆర్డినేషన్ ఫోరం ఏర్పాటు - ఫలితంగా అన్ని ఐఐఎంలలో ఒకే తరహా విధానాలు అమలయ్యే అవకాశం

ప్రైవేటు బి-స్కూల్స్‌కు స్వయంప్రతిపత్తి!

దేశంలో ప్రముఖ ప్రయివేట్ బి-స్కూల్స్‌కు కూడా స్వయంప్రతిపత్తి హోదా ఇచ్చే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విషయంపై అధ్యయనానికి ఇప్పటికే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఒక కమిటీని నియమించింది. ఐఐఎంలకు దీటుగా రాణిస్తూ ప్రపంచ స్థాయిలో పేరుపొందిన ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు.. ప్రభుత్వ నియంత్రణ సంస్థల కారణంగా కార్యకలాపాలు, అకడమిక్స్ నిర్వహణలో ఇబ్బందులకు గురి కాకూడదనే ప్రైవేటు బి-స్కూల్స్‌కు అటానమస్ హోదా ఇచ్చే దిశగా హెచ్‌ఆర్‌డీ యోచిస్తున్నట్లు సమాచారం.



అటానమస్ హోదాతో ప్రయోజనం

ఐఐఎంలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించడం వల్ల అటు విద్యార్థులు, ఇటు ఇన్‌స్టిట్యూట్‌లకు ప్రయోజనం కలుగుతుంది. విద్యార్థులకు గ్లోబల్ ఎక్స్‌పోజర్ లభిస్తుంది. ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ నిర్వహణ, కొలాబరేటివ్ రీసెర్చ్ పరంగా స్వతంత్రంగా వ్యవహరించే వీలు కలుగుతుంది.

– **ప్రొఫెసర్.దినేశ్ కుమార్**, ఐఐఎం-బెంగళూరు

ఎంబీఏ స్పెషల్

దేశంలోని పేరొందిన బిజినెస్ స్కూళ్లలో ఒకటి..
మిగతా ప్రముఖ కాలేజీలకు పూర్తి భిన్నం..
అత్యున్నత ప్రమాణాలతో ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు..
నేటి వ్యాపార అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ టెక్నిక్స్..

ఇవీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) విశిష్టతలు...! అంతర్జాతీయ వాణిజ్య సమస్యలు అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను కనుగొనడం.. ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజీలో నిపుణులను అందించడమే ధ్యేయంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైంది ఐఐఎఫ్‌టీ. 2018 -2020 విద్యా సంవత్సరానికి ఐఐఎఫ్‌టీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో వివరాలు..

ఐఐఎఫ్‌టీ ఫ్యాక్ట్స్

- **74** ఈ ఏడాది ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో ప్రి ప్లేస్‌మెంట్స్ ఆఫర్లు
- **03** రూ.కోటిపైగా వార్షిక వేతన ప్యాకేజీకి ఎంపికైనవారు
- **06** రూ.75 లక్షలపైగా ప్యాకేజీ అందుకున్నవారు.
- **రూ.18.41 లక్షలు** సగటు దేశీయ వార్షిక ప్యాకేజీ
- **రూ.26 లక్షలు** అత్యధిక దేశీయ ప్యాకేజీ
- **20** వచ్చిన ఇంటర్నేషనల్ రోల్స్ ఆఫర్లు
- **94** ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించిన కంపెనీలు

ఐఐఎఫ్‌టీ 2017

- **కోర్సు:** ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్)
- **సీట్లు:** ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో ఇంటర్నేషనల్ బిజినెస్ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఢిల్లీ క్యాంపస్‌లో 220, కోల్‌కతా క్యాంపస్‌లో 140 సీట్లున్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ. ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2018 అక్టోబర్ 8 నాటికి డిగ్రీ ఉత్తీర్ణతను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వయోపరిమితి లేదు.
- **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ అండ్ రైటింగ్ స్కిల్ అసెస్‌మెంట్ ద్వారా.
- **పరీక్ష విధానం:** రెండు గంటల వ్యవధిలో నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్, వొకాబులరీ, గ్రామర్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, లాజికల్ రీజనింగ్, డేటా క్వాంటిటేటివ్ అనాలసిస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. మొత్తమ్మీద ఈ విభాగాలను 4 సెక్షన్లుగా చెప్పుకోవచ్చు. అవి..

విభాగం	ప్రశ్నలు	అంశం
సెక్షన్ 1	20	క్వాంటిటేటివ్ ఎబిలిటీ
సెక్షన్ 2	పార్ట్ 1: 22 పార్ట్ 2: 20	లాజికల్ రీజనింగ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్
సెక్షన్ 3	పార్ట్ 1: 16 పార్ట్ 2: 20	రీడింగ్ కాంప్రహెన్షన్ వెర్బల్ ఎబిలిటీ
సెక్షన్ 4	25	జనరల్ అవేర్‌నెస్

(మొత్తం 123 ప్రశ్నలు. 100 మార్కులు. ఏటా ప్రశ్నల సంఖ్యలో మార్పులు కనిపిస్తుంటాయి. రుణాత్మక మార్కులు ఉంటాయి.)

ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్

రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులకు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ముంబైల్లో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

కోర్సు వివరాలు

ప్రధానంగా అంతర్జాతీయ వ్యాపారం, అనుబంధ అంశాలపై ఫోకస్ చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య, వ్యాపార విభాగాల్లో దేశీయ అవసరాలకు అనుగుణంగా ఫారిన్ ట్రేడ్‌కు సంబంధించి సమగ్ర అవగాహన కల్పిస్తారు.

డీమ్డ్ యూనివర్సిటీ

1963లో ఏర్పాటైన ఐఐఎఫ్‌టీ అప్‌డేట్ అవుతూ



అంతర్జాతీయ గుర్తింపు పొందింది. నాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపుతో పాటు 2002లో డీమ్డ్ యూనివర్సిటీ హోదా పొందింది. ఇంటర్నేషనల్ ట్రేడ్‌కు సంబంధించి కార్పొరేట్ విభాగాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు వ్యక్తిగత స్థాయిలోనూ శిక్షణ, పరిశోధన అవకాశాలను కల్పిస్తోంది. బోధన, పరిశోధనలతో పాటు విదేశీ విశ్వవిద్యాలయాలతో సంయుక్తంగా అభ్యర్థులకు పూర్తిస్థాయి బిజినెస్ నాలెడ్జ్ అందిస్తోంది. అంతర్జాతీయ విద్యా సంస్థలతో అవగాహన ఒప్పందాలు కలిగి ఉంది. తాజాగా ఎంహెచ్‌ఆర్‌డీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ర్యాంకింగ్స్‌లో మేనేజ్‌మెంట్ కేటగిరీలో 30వ ర్యాంకులో నిలిచింది.

ప్లేస్‌మెంట్స్

ఇన్‌స్టిట్యూట్‌లోని ప్లేస్‌మెంట్ సెల్.. కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిస్తోంది.
పేరొందిన అన్ని కార్పొరేట్, ఆర్థిక, సర్వీస్ సెక్టార్ సంస్థలు ప్లేస్‌మెంట్స్ కోసం ఐఐఎఫ్‌టీకి వస్తున్నాయి. వీటిలో గోల్డ్‌మన్ శాక్స్, అమెజాన్, యాక్సిస్ బ్యాంక్, సిటీ బ్యాంకు, కాగ్నిజెంట్ బిజినెస్ కన్సల్టింగ్, తదితర ఎన్నో ప్రముఖ కంపెనీలు ఉన్నాయి.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్ 15
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,550 (ఎస్సీ, ఎస్టీ, **పీడబ్ల్యూడీ అభ్యర్థులకు:** రూ.775)
- **ప్రవేశ పరీక్ష:** 2017 డిసెంబర్ 3
- **వెబ్‌సైట్:** http://tedu.iift.ac.in/iift

క్యాట్ స్థాయిలో ప్రిపరేషన్

ఐఐఎఫ్‌టీ ఎంట్రన్స్‌లో ఒక్కో విభాగానికి వేర్వేరుగా మార్కులు ఉంటాయి. లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీల్లో ఒక్కో విభాగానికి 0.75 మార్కుల చొప్పున, జనరల్ అవేర్‌నెస్‌లోని ప్రశ్నలకు అర మార్కు, మిగతా సెక్షన్లల్లోని ప్రశ్నలకు ఒక మార్కు కేటాయించారు. ప్రతి ప్రశ్నకు నాలుగు ఐచ్ఛికాలు ఇస్తారు. కేటాయించిన మార్కుల్లో మూడో వంతు రుణాత్మక మార్కులు.

- ప్రశ్నల క్లిష్టత దాదాపు క్యాట్ స్థాయిలో ఉంటుంది.
- క్యాట్ సిలబస్‌లో లేని జనరల్ అవేర్‌నెస్ విభాగం ఇందులో ఉంటుంది. ఈ సెక్షన్‌లో స్టాటిక్ జీకే బిట్స్, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ప్రిపరేషన్‌లో భాగంగా న్యూస్ పేపర్లు చదవడం, నోట్స్ ప్రిపరేషన్ తప్పనిసరి. ఏదైనా కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ సేకరించుకుని చదివితే అన్ని టాపిక్స్‌కు ఒకేచోట ప్రిపరేషన్ లభిస్తుంది. జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్‌లకు సంబంధించి సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ/ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు జామెట్రీ, ఆల్జీబ్రా, నెంబర్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలపై కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్, వాటి ఆధారంగా సమస్యల సాధనను ప్రాక్టీస్ చేయాలి. టైమ్, స్పీడ్, డిస్టెన్స్, ప్రొగ్రెషన్, సెట్స్, ప్రాఫిట్ అండ్ లాస్, లాగ్స్ విభాగాల నుంచి ప్రశ్నలు ఎక్కువగా అడుగుతున్నట్టు గత ప్రశ్నపత్రాలను చూస్తే అర్థమవుతుంది. వీటికోసం ఏదైనా ప్రామాణిక పుస్తకం ఎంచుకొని ప్రిపరేషన్ సాగించాలి. బేసిక్స్ తర్వాత సాధ్యమైనన్ని ప్రాక్టీస్ బిట్స్, సెక్షన్ వైజ్ మాక్ టెస్టులు రాయడం లాభిస్తుంది.
- అభ్యర్థుల విశ్లేషణ, గణన (కంప్యూటేషన్) నైపుణ్యాలను పరీక్షించే డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. హై లెవల్ క్వాంటిటేటివ్ బుక్ ఎంపిక అవసరం.
- లాజికల్ రీజనింగ్‌లో రాణించేందుకు స్టేట్‌మెంట్స్, పజిల్స్ సాధన ఉపకరిస్తుంది. వెన్ డయాగ్రమ్స్, డిడక్షన్, సిలాయిజమ్; అల్ఫాబెటిక్ సిరీస్, రాంగ్ నంబర్ సిరీస్, మిస్సింగ్ నంబర్‌పై పట్టు సాధించాలి.
- వెర్బల్ ఎబిలిటీ కోసం విశ్లేషణాత్మక అభ్యసన నైపుణ్యం అవసరం. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌తో పాటు వొకాబులరీ నేర్చుకోవాలి. దీంతోపాటు పద వినియోగం, వాక్య నిర్మాణ శైలిపై ప్రాక్టీస్ చేయాలి. ఈ విభాగం నుంచి సెంటెన్స్ కంప్లీషన్, వొకాబులరీ బేస్, సెంటెన్స్ రీఅరేంజ్‌మెంట్ విభాగాలు అత్యంత కీలకం. వీటి నుంచే ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి.
- ఎక్కువ మార్కులు సాధించే కీలక సెక్షన్ రీడింగ్ కాంప్రెహెన్షన్. ఇందులోభాగంగా ఎకానమీ, బిజినెస్ – ఎకానమీ, ఉమెన్స్ రోల్ ఇన్ ఎకానమీ, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్స్ టాపిక్స్ మీద ప్యాసేజీలు ఉంటున్నాయి. దీనికోసం ఒక అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదవడం, అందులోని ముఖ్య సమాచారాన్ని గ్రహించి, సారాంశాన్ని రూపొందించుకునే నైపుణ్యం ఉండాలి. ఇంగ్లిష్ దిన పత్రికల్లోని వ్యాసాలు, ఎడిటోరియల్స్ చదవడం ఉపకరిస్తుంది. వొకాబులరీని పెంచుకుంటే వెర్బల్ ఎబిలిటీ సెక్షన్‌కు కూడా సన్నద్ధత లభిస్తుంది. ఇంగ్లిష్ బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించడంతో పాటు, రోజూ కొత్త పదాలు నేర్చుకోవడం వాటిని వినియోగించే తీరుపై ప్రాక్టీస్ చేయాలి.

బులెటిన్ బోర్డ్

జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ ప్రవేశాలు



తెలంగాణలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో 2017-18కు గాను జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ తెలంగాణకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రకటన వెలువరించింది. మొత్తం సీట్లలో 85శాతం తెలంగాణకు(లోకల్ కేటగిరీ), 15శాతం ఆంధ్రప్రదేశ్‌కు(నాన్ లోకల్) కేటాయించారు.
కోర్సుల పేరు: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం)
వ్యవధి: మూడేళ్లు.
అర్హతలు: 40 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్ సబ్జెక్టులతో ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయోపరిమితి: 2017 జూలై 1 నాటికి 17-35 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.200.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకొని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు తదితర అవసరమైన వాటిని జతచేసి కవరులో ఉంచి జిల్లాస్థాయి సూపరింటెండెంట్ (హాస్పిటల్) చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
ఎంపిక విధానం: విద్యార్హతల మెరిట్ ఆధారంగా.
రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: ఆగస్ట్ 24, 2017
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్ట్ 28, 2017
దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ: సెప్టెంబర్ 4, 2017
వెబ్‌సైట్: www.dme.telangana.gov.in

ఏయూలో దూరవిద్య ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. వివిధ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
కోర్సులు:
1. ఆర్నెల్ల సర్టిఫికెట్ కోర్సులు
2. డిప్లొమా కోర్సులు
3. గ్రాడ్యుయేట్ కోర్సులు(మూడేళ్ల వ్యవధి)
4. పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సులు(రెండేళ్ల వ్యవధి)
5. ఏడాది పీజీ డిప్లొమా కోర్సులు
6. బీఈడీ/ఎంఏ అడిషనల్ మెథడాలజీ ఎడ్యుకేషన్

అర్హతలు: సంబంధిత కోర్సులను అనుసరించి ఇంటర్మీడియెట్/డిగ్రీ/పీజీ/బీఈడీ/ఎంఏ ఎడ్యుకేషన్.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: నవంబర్ 1, 2017
రూ.200 ఆలస్య రుసుముతో దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: నవంబర్ 30, 2017
దరఖాస్తులు పంపాల్సిన చిరునామా: డైరెక్టర్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం.
పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.andhrauniversity.edu.in

సాక్షి బిజినెస్

మంగళవారం 22-8-2017

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
266 ▼	83 ▼
31,259	9,754

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11:30కి)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	6,203	▽ 14
డోజోన్స్	21,677	△ 2
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,319	▽ 5
డాక్స్	12,066	▽ 99
షాంఘై	3,287	△ 19
నికాయ్	19,393	▽ 77

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.27	64.95
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	81.14	83.95
€	యూరో	ఎస్‌బీఐ	74.03	76.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.68	59.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.83	51.80
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.27	47.85
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.79	11.03

మార్కెట్లోకి యమహా ఫేజర్ 25



ధర రూ. 1.28 లక్షలు

ముంబై: ఆటోమొబైల్ సంస్థ యమహా తాజాగా 250 సీసీ సామర్థ్యంతో ఫేజర్ 25 మోటార్‌సైకిల్‌ను భారత మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ. 1.28 లక్షలు (ముంబై ఎక్స్‌షోరూం రేటు). వచ్చే నెలలో ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. ఎఫ్‌జెడ్ 25 తర్వాత ఈ ఏడాది యమహా ఆవిష్కరించిన బైక్‌లలో ఇది రెండోది. గతేడాది 7.50 లక్షల ద్విచక్ర వాహనాలు విక్రయించిన ఇండియా యమహా మోటార్.. ఈ ఏడాది 15 శాతం వృద్ధితో తొమ్మిది లక్షల మోటార్ సైకిల్స్, స్కూటర్స్‌ను విక్రయించాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాయ్ కురియన్ చెప్పారు. డీలర్‌షిప్ నెట్‌వర్క్‌ను మరో 100 అవుట్‌లెట్లు పెంచుకుని మొత్తం 700 అవుట్‌లెట్స్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

మెర్సిడెస్ ఏఎంజీ జీటీ-ఆర్ @ 2.23 కోట్లు



సోమవారం న్యూఢిల్లీలో ఆటోమొబైల్ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ కొత్తగా వేగవంతమైన ఏఎంజీ జీటీ-ఆర్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ. 2.23 కోట్ల (ఎక్స్-షోరూం) నుంచి ఉంటుంది. అలాగే ఏఎంజీ జీటీ రోడ్‌స్టర్‌ను కూడా ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 2.19 కోట్ల నుంచి ఉంటుంది. ఏఎంజీ జీటీ ఆర్ కేవలం 3.6 సెకన్లలో గంటకు 100 కి.మీ. వేగాన్ని అందుకోగలదు. గరిష్ట వేగం గంటకు 318 కి.మీ.

టాటా టియాగో ఆటోమేటెడ్ వెర్షన్

ధర రూ. 4.79 లక్షలు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ తాజాగా ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీ (ఏఎంటీ)తో టియాగో కారును ప్రవేశపెట్టింది. టియాగో ఎక్స్‌టీఏ వేరియంట్ ధర రూ. 4.79 లక్షలుగా ఉంటుందని సంస్థ పేర్కొంది. భారీ ట్రాఫిక్‌లోనూ, పార్కింగ్ సమయంలోనూ ఏఎంటీ టెక్నాలజీ గల కారు నడపడానికి అనువుగా ఉంటుందని టాటా మోటార్స్ హెడ్ (మార్కెటింగ్ ప్యాసింజర్ వెహికల్ వ్యాపార విభాగం) వివేక్ శ్రీవత్స తెలిపారు. ప్రస్తుతం తమ హ్యాచ్‌బ్యాక్ కార్ల విభాగంలో టియాగో అమ్మకాల వాటా దాదాపు 83 శాతం దాకా ఉంటుందని వివరించారు. దాదాపు 1 లక్ష పైగా బుకింగ్స్ రాగా.. 65,000 కార్లను ఇప్పటిదాకా కస్టమర్లకు అందించామని పేర్కొన్నారు. తమ ప్యాసింజర్ వెహికల్ వ్యాపార విభాగం మళ్లీ కోలుకోవడానికి టియాగో తోడ్పడిందని వివేక్ వివరించారు.

రాస్‌నెఫ్ట్ చేతికి ఎస్సార్ ఆయిల్...

13 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకున్న రష్యా కంపెనీ

- విక్రయ లావాదేవీ పూర్తి
- దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ డీల్
- దేశీయ బ్యాంకులకు ఊరట



విలేకరుల సమావేశంలో ప్రశాంత్ రుయా(మధ్య) తదితరులు

ముంబై: రుణభారంతో సతమతం అవుతున్న ఎస్సార్ గ్రూపు తన పరిధిలోని ఎస్సార్ ఆయిల్‌ను రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్‌కు విక్రయించింది. ఎస్సార్ ఆయిల్, దాని పరిధిలోని పోర్టు, విద్యుత్తు, రిటైల్ ఆస్తులను రాస్‌నెఫ్ట్‌తోపాటు ఇతర ఇన్వెస్టర్ల కన్సార్టియం 12.9 బిలియన్ డాలర్లు (రూ.82,500 కోట్లు) చెల్లించి సొంతం చేసుకున్నాయి. దేశంలోకి వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదే. వాస్తవానికి ఈ డీల్ గతేడాది అక్టోబర్ 15న గోవా బ్రిక్స్ సదస్సు సందర్భంగా సాకారం కాగా అదిప్పుడు పూర్తయింది. రాస్‌నెఫ్ట్ రష్యా ప్రభుత్వ సంస్థ. ప్రపంచంలోనే ఒకానొక అతిపెద్ద చమురు, సహజవాయువు సంస్థగా ఉంది. ఎస్సార్ ఆయిల్‌కు చెందిన గుజరాత్‌లోని 20 మిలియన్ టన్నుల వాదినార్ రిఫైనరీ, 58 మిలియన్ టన్నుల క్యాప్టివ్ పోర్ట్, 1,010 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్, 3,500 పెట్రోల్ బంక్‌లు రాస్‌నెఫ్ట్, దాని కూటమికి చెందుతాయి. మొత్తం మీద ఈ ఆస్తుల్లో రాస్‌నెఫ్ట్ ఒక్కటే 49.13 శాతం వాటా కలిగి ఉంటుంది. మిగిలిన 49 శాతం వాటా నెదర్లాండ్స్‌కు చెందిన ట్రాఫిగురా గ్రూపు, రష్యన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ యునైటెడ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ (యూసీపీ) దక్కించుకున్నాయి. ఎస్సార్ ఆయిల్‌లో డీల్‌కు ముందు ఎస్సార్ ఎనర్జీ హోల్డింగ్స్‌కు 98.26 శాతం, బిడ్కో మారిషస్‌కు మిగిలిన వాటా ఉంది. తాజా డీల్‌తో రుయాలు పూర్తిగా కంపెనీ నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం కంపెనీలో రాస్‌నెఫ్ట్, ట్రాఫిగురా-యూసీపీ కన్సార్టియం కాకుండా మైనారిటీ వాటాదారుల చేతిలో ఇంకా 1.75 శాతం వాటా ఉంటుంది. ఎస్సార్ ఆయిల్ డీలిస్టింగ్‌కు ముందు తమ షేర్లను విక్రయించని వారు వీరు. వీరి దగ్గరున్న వాటాలకు సెబీ బైబ్యాక్ నిబంధనల మేరకు చెల్లింపులు చేయనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇక, ఎస్సార్ ఆయిల్‌ను విక్రయించిన తర్వాత కూడా చమురు రంగంలో రుయాల ప్రస్థానం కొనసాగనుంది. బ్రిటిష్ ఆస్తులు, ఓ ఆయిల్ రిఫైనరీ, కోల్‌బెడ్ మీథేన్ బ్లాక్‌లు వారి పరిధిలోనే ఉంటాయి.

బ్యాంకులకు దక్కేది రూ.4,000 కోట్లే

ఎస్సార్ ఆయిల్‌కు చెందిన 5 బిలియన్ డాలర్ల (రూ.35,000 కోట్లు) విలువైన రుణభారాన్ని సైతం ఒప్పందంలో భాగంగా రాస్‌నెఫ్ట్‌తోపాటు కొత్త యజమానులు స్వీకరించారు. రుణాలిచ్చిన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు ఇతర రుణదాతలు తమ సమ్మతి తెలిపారు. దీంతో ఈ సంస్థలకు ప్రస్తుతానికి రూ.4,000 కోట్ల మేరే ఎస్సార్ గ్రూపు నుంచి చెల్లింపులు జరగనున్నాయి. రుణదాతలు కొత్త యజమానిగా రాస్‌నెఫ్ట్‌ను అంగీకరించడంతో మిగిలిన రుణానికి రష్యా కంపెనీ బాధ్యత వహిస్తుంది.

ఎస్సార్ స్టీల్ రుణాలు ఎగవేతే!

ఎస్సార్ గ్రూపు పరిధిలోని ఎస్సార్ స్టీల్ రూ.44,000 కోట్ల మేర బ్యాంకుల రుణాలను ఎగవేయగా, ఈ కేసు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ ముందుకు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే, ఎస్సార్ గ్రూపు భారీ స్థాయిలో రుణాలను తిరిగి చెల్లించే కార్యక్రమం చేపట్టినప్పటికీ... ఎస్సార్ స్టీల్ రుణాలను మాత్రం తిరిగి చెల్లించడం లేదు. ఇదే విషయాన్ని రుయాను ప్రస్తావించగా, 'ఎస్సార్ ఆయిల్, ఎస్సార్ స్టీల్ రెండు వేర్వేరు సంస్థలు, వేర్వేరు వ్యాపారాల్లో ఉన్నయి. ఒక కంపెనీ ఖాతా నుంచి మరో కంపెనీ ఖాతాలోకి నిధుల మళ్లింపునకు చట్టం ఒప్పుకోదు' అని స్పష్టం చేశారు.

రుణదాతలకు తక్షణం రూ. 4,000 కోట్లు చెల్లిస్తాం: ప్రశాంత్ రుయా

ఎస్సార్ గ్రూపు మొత్తం రుణ భారం రూ.1.35 లక్షల కోట్లు కాగా, ఎస్సార్ విక్రయం నేపథ్యంలో రూ.70,400 కోట్ల మేర రుణ భారం తమ గ్రూప్ నుంచి తగ్గుతుందని ఎస్సార్ గ్రూపు డైరెక్టర్ ప్రశాంత్ రుయా తెలిపారు. రుయాల మొత్తం రుణంలో ఇది 60 శాతం. ''ఈ డీల్‌కు మూడు ప్రత్యేకతలు ఉన్నాయి. దేశంలోకి వచ్చిన అతిపెద్ద ఎఫ్‌డీఐ. దేశ చరిత్రలో భారీ స్థాయిలో రుణాలను తీర్చివేస్తున్న డీల్. మూడోది రష్యా నుంచి ఓ దేశానికి భారీ స్థాయిలో నిధులు వెళుతున్న సందర్భం కూడా ఇదే'' అని ప్రశాంత్ రుయా పేర్కొన్నారు. విక్రయ ఒప్పందం పూర్తయినట్టు సోమవారం ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కంపెనీ బ్యాలన్స్ షీట్లలో గణనీయమైన రుణాలను తీర్చివేయనున్నట్టు చెప్పారు. రాస్‌నెఫ్ట్ డీల్ తర్వాత భారత్‌లోని రుణదాతలకు రూ. 4000 కోట్ల మేర నేరుగా చెల్లించనున్నట్టు ఆయన తెలిపారు. అందులో ఎల్‌ఐసీకి రూ. 800 కోట్లవరకూ చెల్లిస్తామని అన్నారు. మిగిలిన మొత్తాన్ని ఏ బ్యాంకుకు లేదా బీమా కంపెనీకి ఎంతెంత చెల్లించేదీ వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. రూ.1.2 లక్షల కోట్ల మూలధన విస్తరణ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత విస్తృతమైన తమ పోర్ట్‌ఫోలియో వృద్ధి అవకాశాలను ఇకపై చూడనున్నట్టు ప్రకటించారు. ''ఈ డీల్ తర్వాత కూడా ఎస్సార్ గ్రూపు ఆస్తుల విలువ 17 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. 15 బిలియన్ డాలర్ల ఆదాయం, 2 బిలియన్ డాలర్ల ఎబిటా కూడా ఉండనుంది. చమురు రంగంలో మాకున్న ఏకైక 9 మిలియన్ టన్నుల రిఫైనరీ ద్వారా పెట్టుబడులు కొనసాగుతాయి'' అని ప్రశాంత్ రుయా పేర్కొన్నారు. ఈ చరిత్రాత్మక లావాదేవీతో ఎస్సార్ గ్రూపు వృద్ధికి నూతన ద్వారాలు తెరుచుకున్నాయని సంస్థ వ్యవస్థాపకుడు శశిరుయా కూడా ప్రకటించారు.

రాస్‌నెఫ్ట్‌కు స్వాగతం: ధర్మేంద్ర ప్రధాన్



ఈ ఒప్పందాన్ని పూర్తి చేసిన ఎస్సార్ గ్రూపును పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. భారత అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న రాస్‌నెఫ్ట్, ట్రాఫిగురా యూసీపీ కన్సార్టియానికి స్వాగతం పలుకుతున్నట్టు ప్రకటించారు.

సగం రుణభారం తీరిపోతుంది: కొచర్



ఎస్సార్ గ్రూపు రుణాలను తిరిగి తీర్చివేసే కార్యక్రమంతో ఆ గ్రూపునకు ఇచ్చిన రుణాలు సగం మేర తగ్గిపోనున్నట్టు ఐసీఐసీఐ బ్యాంకు చీఫ్ చందాకొచర్ తెలిపారు.

ఎస్సార్ ఆయిల్ అభివృద్ధికి కృషి: సెచిన్



కొత్త భాగస్వాములతో కలసి ఎస్సార్ ఆయిల్ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని, ఆస్తుల అభివృద్ధికి తగిన వ్యూహాన్ని అమల్లో పెడతామని రాస్‌నెఫ్ట్ అధినేత ఇగార్ సెచిన్ పేర్కొన్నారు. కాగా, మీడియా సమావేశంలో ఆయన పాల్గొనలేదు.

కారు రుణాలపై ఎస్‌బీఐ ప్రాసెసింగ్ ఫీజు మాఫీ

పసిడి, వ్యక్తిగత రుణాలపై కూడా సగం




న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ పరిమిత కాలానికి కారు, బంగారం, వ్యక్తిగత రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు నుంచి పూర్తిగా మినహాయింపు కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే గృహ రుణాల టేకోవర్‌పై ఈ తరహా ఆఫర్ ఇస్తున్నట్లు వివరించింది. తాజాగా ఈ ఏడాది డిసెంబర్ 31 దాకా కారు లోన్స్‌పై 100% ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేసినట్లు పేర్కొంది. అలాగే అక్టోబర్ 31 దాకా బంగారం రుణాలపై 50 శాతం మేర మినహాయింపు కల్పిస్తున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఇక, సెప్టెంబర్ 30 దాకా వ్యక్తిగత రుణాలకు సంబంధించి ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ స్కీముపై 50% మేర ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేసినట్లు పేర్కొంది. బీఎస్‌ఈలో సోమవారం ఎస్‌బీఐ షేరు 1.44% క్షీణించి రూ. 274.65 వద్ద ముగిసింది.

పొదుపు ఖాతాలపై దేనా బ్యాంక్ వడ్డీ తగ్గింపు

దేనా బ్యాంక్ తాజాగా పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లు అరశాతం తగ్గించింది. ఇకపై రూ. 25 లక్షల దాకా డిపాజిట్లు ఉండే సేవింగ్స్ అకౌంట్లపై 3.5% వడ్డీ రేటు ఉంటుందని పేర్కొంది. అయితే, రూ. 25 లక్షలకు పైబడిన మొత్తాలపై మాత్రం యధాప్రకారంగా 4% వడ్డీ రేటు కొనసాగుతుందని వివరించింది.

షిప్‌యార్డ్ ఆస్తులు ఎస్సార్‌కు!

- 1998 నాటి బకాయిలపై కోర్టుకెక్కిన ఎస్సార్
- రూ. 204 కోట్ల ఆస్తుల అటాచ్ చేసిన సుప్రీం కోర్టు
- వాటిలో భూములు, విలువైన భవనాలు కూడా
- ఎస్సార్ న్యాయవాది ఆదిత్య వెల్లడి



విశాఖపట్నం: ముంబైకి చెందిన ఎస్సార్ ఆయిల్ లిమిటెడ్ కంపెనీకి విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు చెందిన రూ.204 కోట్ల విలువైన స్థిరాస్తులను అటాచ్ చేస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సార్ తెలియజేసింది. సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఎస్సార్ న్యాయవాది ఎం.ఎస్. ఆదిత్య ఈ వివరాలు వెల్లడించారు. ''హిందుస్థాన్ షిప్‌యార్డుతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎస్సార్ 1998లో రాజమండ్రి దగ్గరున్న రవ్వ గ్యాస్ ఫీల్డ్ వద్ద నాలుగు ఆయిల్ ప్లాట్‌ఫాంలను నిర్మించి అప్పగించింది. అప్పటి ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన రూ. 40 కోట్లను షిప్‌యార్డ్ చెల్లించలేదు. దీంతో ఎస్సార్ యాజమాన్యం కోర్టుకెళ్లింది. 2015లో సుప్రీంకోర్టు ఎస్సార్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇస్తూ... అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రూ.220 కోట్లు చెల్లించాలని మూడు ఈపీలు జారీ చేసింది. దీనిపై హెచ్‌ఎస్‌ఎల్ కోర్టుకు వెళ్లి... 1998 నాటి అమెరికన్ డాలర్ రేట్ ప్రకారం బకాయిలను రూపాయల్లో చెల్లిస్తామని, దానిపై వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని వాదించింది. దీని బదులు 2015 నాటి డాలర్ రేటు ప్రకారం బకాయిని వడ్డీతో సహా రూపాయల్లో చెల్లించాలని ఎస్సార్ వాదించింది. చివరకు 2001 నాటి డాలర్ రేటు తీసుకోవాలని సుప్రీం తీర్పునిచ్చింది'' అని ఆదిత్య తెలిపారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న రూ.104 కోట్ల విలువైన టీడీఆర్‌లు, రూ.100 కోట్ల విలువైన మల్కాపురం సర్వే నం.1లోని ఆస్తులు, వాల్తేర్ అప్‌ల్యాండ్స్‌లోని 2 ఎకరాల 'నియో నెస్ట్ క్వార్టర్స్' (షిప్‌యార్డ్ సీఎండీ నివాసం), సిరిపురంలో ఉన్న 'వరుణ్ పార్క్' (15 ఎకరాలు)ను ఎస్సార్‌కు అటాచ్ చేస్తూ కోర్టు తీర్పునిచ్చిందన్నారు.

బీఎస్‌ఈలో 200 కంపెనీల డీలిస్టింగ్



ముహూర్తం ఈ నెల 23వ తేదీ

రాయ్‌పూర్: గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 60 మందికిపైగా చిన్నారులు మరణించిన సంఘటన మరువకముందే ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోని ఓ ప్రభుత్వ వైద్యశాలలోనూ ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందారు. డా.బీఆర్ అంబేడ్కర్ స్మారక వైద్యశాలలో ఆదివారం జరిగిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి రమణ్ సింగ్ విచారణకు ఆదేశించారు. ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడమే పసికందుల మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం శిశువుల మృతికి ఇతర కారణాలు ఉన్నాయనీ, ఆక్సిజన్ సరఫరాలో ఏ లోపమూ లేదని వాదిస్తున్నారు. ఓ శిశువు తక్కువ బరువుతో పుట్టిందనీ, కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండటంతో మధ్యాహ్నం 12.30 గంటలకు మరణించిందని వైద్యులు చెప్పారు. మరో ఇద్దరు శిశువుల మృతికి శ్వాసకోస సంబంధ సమస్యలే కారణమన్నారు. మరోవైపు మద్యం సేవించి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆక్సిజన్ సరఫరా విభాగంలోని రవిచంద్ర అనే ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. రిజర్వాయర్‌లో ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండటాన్ని సాయంత్రం ఐదు గంటలకు ఓ డాక్టర్ గమనించారనీ, వెంటనే రవిచంద్రను పిలవగా అతను మద్యం తాగి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే ఆక్సిజన్ సరఫరాలో మాత్రం ఏ ఇబ్బందీ తలెత్తలేదనీ, రిజర్వాయర్‌లో కూడా ఆక్సిజన్ స్థాయి పడిపోవడాన్ని గుర్తించిన 15 నిమిషాల్లోనే సరిచేశారని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పారు. కాగా, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చిన్నారులు మరణించారని బంధువులు, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఆరోపించారు.

'డోక్లాం'కు త్వరలోనే తెర: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత్–చైనా మధ్య డోక్లాంలో నెలకొన్న ప్రతిష్టంభనకు తెర పడేలా త్వరలోనే పరిష్కారం కనుగొంటామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. అదే సమయంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకొనేందుకు అవసరమైన శక్తిసామర్థ్యాలూ భారత్‌కు పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. చైనా–భారత్ సరిహద్దు భద్రతా దళం ఐటీబీపీ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. 'డోక్లాం వ్యవహారంలో భారత్–చైనాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. త్వరలోనే దీనికో పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నా'అని రాజ్‌నాథ్ చెప్పారు.


ప్రపంచపు అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలు



మాలేగావ్ కేసులో పురోహిత్‌కు బెయిల్

న్యూఢిల్లీ: మాలేగావ్ పేలుళ్ల కేసులో లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌కు సోమవారం సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సాక్ష్యులను ప్రభావితం చేసే ప్రయత్నం చేయరాదని షరతులు విధించింది. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావ్‌లో 2008 సెప్టెంబర్ 29న జరిగిన బాంబు పేలుడులో ఆరుగురు మృతి చెందారు. ఈ కేసులో కీలక నిందితునిగా ఉన్న పురోహిత్ తొమ్మిదేళ్లుగా జైల్లో ఉన్నా రు. ఈ కేసు విచారణ సందర్భంగా యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్), జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వేసిన చార్జిషీట్లలో వ్యత్యాసం ఉందని కోర్టు గుర్తించింది. వీటిలో ఒక వెర్షన్‌ను పరిగణనలోకి తీసుకోలేమంటూ బెయిల్ మంజూరు చేసింది.

2018 నాటికి ఆన్‌లైన్‌లోనే పాస్‌పోర్ట్ వెరిఫికేషన్



న్యూఢిల్లీ: 2018 మార్చి నాటికి పాస్‌పోర్టుల జారీ కోసం పోలీసులు భౌతికంగా వెళ్లి వెరిఫికేషన్ చేయాల్సిన అవసరం ఉండదని హోంశాఖ కార్యదర్శి రాజీవ్ మహర్షి తెలిపారు. ఇందు కోసం క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ప్రాజెక్టు(సీసీటీఎన్ఎస్)ను విదేశాంగ శాఖ నేతృత్వంలోని పాస్‌పోర్టు సేవలకు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పోలీసులు భౌతికంగా వెరిఫికేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే వ్యక్తుల వివరాలు (గతంలో నేరచరిత్ర ఏమైనా ఉంటే) తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టులో భాగంగా హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారమిక్కడ డిజిటల్ పోలీస్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహర్షి మీడియాతో మాట్లాడుతూ.. 'కొన్ని రాష్ట్రాల్లో పోలీసులు ఇప్పటికే సీసీటీఎన్ఎస్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా అందించే స్మార్ట్‌ఫోన్ లాంటి పరికరంతో పోలీసులు పాస్‌పోర్ట్ దరఖాస్తుదారు ఇంటికి చేరుకుని వివరాలను అప్‌లోడ్ చేస్తారు. దీనివల్ల సమయం తగ్గుతుంద'ని వెల్లడించారు. దేశంలోని మొత్తం 15,398 పోలీస్ స్టేషన్లలో 13,775 స్టేషన్లను సీసీటీఎన్ఎస్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

బీజేపీ 'మిషన్ 350 ప్లస్'

అమిత్ షా, మోదీ దిశానిర్దేశం
- బీజేపీ పాలిత సీఎంల భేటీ



సమావేశంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: 2019 లోక్‌సభ ఎన్నికల్లో 350కి పైగా సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలకు ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీలు దిశానిర్దేశం చేశారు. 'మిషన్ 350 ప్లస్'లో భాగంగా ఇంతకవరకూ బీజేపీ గెలవని 120 నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. అమిత్ షా అధ్యక్షతన సోమవారం సాయంత్రం పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మూడున్నర గంటలు భేటీ జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, 13 రాష్ట్రాల సీఎంలు, ఆరు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు భేటీకి హాజరయ్యారు. రాష్ట్రాల్లో మోదీ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలు తీరుపై అమిత్‌షా ప్రధానంగా ఆరా తీశారు. పేదల అనుకూల పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రభావం చూపుతున్నాయా? పథకాల అమలుకు నిధుల కొరత ఉందా? అన్న అంశాలపై సీఎంలతో చర్చించారు. మోదీ ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై సీఎంలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రచారం చేయాలని, 'మిషన్ 350 ప్లస్' కోసం పార్టీ శ్రేణుల్ని ఉత్సాహపరుస్తూ, వారి అండగా ఉండాలని మోదీ, అమిత్‌షాలు సూచించారు. సిట్టింగ్ స్థానాల్ని నిలబెట్టుకొనేందుకు అమలు చేస్తున్న ప్రణాళికల గురించి సీఎంల్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాల్లో పార్టీ పట్టు పెంచుకునేందుకు క్రమం తప్పకుండా వాస్తవ పరిస్థితుల్ని బేరీజు వేసుకోవాలని సీఎంలకు షా సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలున్న అభ్యర్థుల జాబితా రూపొందించామని, నియోజకవర్గాల్లో పనితీరు, పార్లమెంట్ హాజరు మేరకు కొందరికి మొండిచేయి తప్పదని అధినాయకత్వం స్పష్టం చేసినట్లు సమాచారం. భేటీలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఎంపీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్తాన్ సీఎం వసుంధరా రాజే, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, అస్సాం, గోవా, ఇతర బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు.

సీట్ల కేటాయింపులో మిత్రపక్షాలకు నిరాశే!

2014లో బీజేపీ 428 సీట్లకు పోటీచేయగా 66 శాతం ఉత్తీర్ణతతో 282 స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి లక్ష్యం 350 కావడంతో మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు విషయంలో బీజేపీ అంత ఉదారంగా ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, పంజాబ్‌లో అకాలీదళ్ వంటి పార్టీలు కొన్ని స్థానాలతోనే సరిపెట్టుకోకతప్పదు.

వేగంగా విస్తరణ కసరత్తు

ఆగస్టు 24 లేదా 26న ముహూర్తం!
- అన్నాడీఎంకేకు 2, జేడీయూకు ఒక కేబినెట్ పదవి
- టీడీపీ నుంచి సీఎం రమేష్, బీజేపీ నుంచి హరిబాబుకు అవకాశం!

సాక్షి, న్యూఢిల్లీ: ఈ వారంలోనే కేంద్ర మంత్రివర్గ విస్తరణకు కసరత్తు కొనసాగుతోంది. జేడీయూ, అన్నాడీఎంకే పార్టీల్లో వివాదాలు కొలిక్కిరావడంతో ఆగస్టు 24 లేదా 26న విస్తరణ ఉండవచ్చని ప్రభుత్వ వర్గాల సమాచారం. జేడీయూ ఇప్పటికే ఎన్డీఏలో చేరగా అన్నాడీఎంకే త్వరలో చేరనుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ రెండు పార్టీలకూ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో స్థానం కల్పించనున్నారని సమాచారం. అందుకోసమే బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా తమిళనాడు పర్యటన రద్దు చేసుకుని ప్రధానితో కలసి మంత్రివర్గ కూర్పుపై తుదిమెరుగులు దిద్దుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అన్నాడీఎంకేకు రెండు కేబినెట్, రెండు సహాయ మంత్రి పదవులు, జేడీయూకు ఒక కేబినెట్, సహాయమంత్రి పదవి దక్కవచ్చు. 2019 లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ఈ విస్తరణ జరుగుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆశించిన పనితీరు కనపర్చని వారిని మంత్రివర్గం నుంచి తప్పించనున్నట్లు సమాచారం. వయసు పైబడ్డ కల్‌రాజ్ మిశ్రాను తప్పించి బిహార్ గవర్నర్‌గా పంపే అవకాశముంది. ఉత్తరప్రదేశ్, బిహార్‌కు ప్రాధాన్యత తగ్గించి త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి కొత్తవారిని మంత్రివర్గంలోకి తీసుకోవచ్చు.

తంబిదురైకి పట్టణాభివృద్ధి శాఖ?: లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదురైకి పట్టణాభివృద్ధి శాఖ, ఆయన స్థానంలో శివసేన ఎంపీ ఆనందరావ్ అడుసుకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వనున్నట్లు సమాచారం. శివసేన నుంచి అనిల్ దేశాయ్, టీడీపీ నుంచి సీఎం రమేష్‌కి మంత్రిపదవి ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఏపీ బీజేపీ కోటాలో వెంకయ్యనాయుడి స్థానంలో హరిబాబుకు సహాయ మంత్రి పదవి దక్కే అవకాశాలున్నాయి. కర్ణాటక నుంచి బీజేపీ ఎంపీ అనిల్ హెగ్డేకి చోటు కల్పిస్తారని సమాచారం. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో రక్షణ, అటవీ, పర్యావరణ శాఖ, పట్టణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖలకు పూర్తిస్థాయి మంత్రులు లేరు. కొందరు మంత్రుల వద్ద అదనపు శాఖలు ఉన్నాయి. కేబినెట్‌లో కొత్తగా చేరేవారికి వీటిని కేటాయించనున్నారు.



స్వామివారి ఆలయంలో పున్నయ్య చౌదరి తదితరులు

సింధు, శ్రీకాంత్‌ల విజయానికి పూజలు

అంతర్వేది (సఖినేటిపల్లి): బ్యాడ్మింటన్ క్రీడాకారులు సింధు, శ్రీకాంత్‌లు ప్రపంచ సిరీస్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో సోమవారం ఇండియన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పున్నయ్య చౌదరి ప్రత్యేక పూజలు చేశారు. స్కాట్‌ల్యాండ్‌లోని గ్లాస్‌గోవ్‌లో సోమవారం నుంచి ప్రారంభమైన పోటీల్లో వారు విజయం సాధించాలని ఈ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆయనకు వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఆయన వెంట రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి రవి కిరణ్, రాజోలు రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు ముదునూరి అక్కిరాజు, మ్యాచెస్ ఇంటర్నేషనల్ కంట్రోలర్ ఎం.ఎస్.ఎన్ ప్రసాద్, నేషనల్ కోచ్ ఎన్.వీరభద్రం, నేషనల్ అంపైర్ పాయసం శ్రీనివాసరావు, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి బళ్ల శ్రీను, పశ్చిమ గోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సోమరాజు ఉన్నారు.

గోదారి నీళ్లు కడలి పాలు

- ఇప్పటివరకు 424.54 టీఎంసీలు సముద్రంలోకి..
- ఒకేరోజు 22.35 టీఎంసీలు కడలిపాలైన వైనం
- వెలవెల బోతున్న కృష్ణా నది.. జలకళ లేని శ్రీశైలం, నాగార్జునసాగర్

సాక్షి, అమరావతి: గోదావరి పరవళ్లు తొక్కుతోంది. వందల కొలదీ టీంఎంసీల నీళ్లు వృధాగా సముద్రంలో కలసిపోతున్నాయి. సోమవారం నాటికే ధవళేశ్వరం బ్యారేజీ నుంచి 424.54 టీఎంసీల గోదావరి జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. సోమవారం ధవళేశ్వం బ్యారేజీకి 2,67,172 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. డెల్టాకు 8,400 క్యూసెక్కులు విడుదల చేసి.. మిగతా 2,58,772 క్యూసెక్కులు (22.35 టీఎంసీలు) సముద్రంలోకి వదిలేశారు. ఇలావుండగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) హెచ్చరించింది.

బోసిపోయిన కృష్ణానది

కృష్ణా నదిలో మాత్రం నీటి జాడ లేదు. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి కర్ణాటక ప్రభుత్వం భారీగా నీటిని మళ్లిస్తూ వాటిని ఖాళీ చేస్తోంది. రానున్న రోజుల్లో వరద వచ్చినా ఆ ప్రాజెక్టులు నిండటానికే సరిపోతుంది. నారాయణపూర్‌కు దిగువన కురిసిన వర్షాలతో జూరాలకు చేరుతోన్న అరకొర నీటిని తెలంగాణ సర్కార్ వినియోగించుకుంటోంది. దాంతో శ్రీశైలం జలాశయం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో జలకళ కన్పించడం లేదు. గతేడాది జూలై ఆఖరు నాటికే ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి వరద జలాలు చేరగా.. ఈ ఏడాది ఆగస్టు నెల ముగుస్తున్నా చుక్క నీరు రాకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో 650 టీఎంసీలకు పైగా నీటి కొరత ఉంది. పరిస్థితి ఇలానే కొనసాగితే సాగునీటి మాట దేవుడెరుగు.. గుక్కెడు తాగునీటి కోసం కూడా తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి.



కృష్ణా, తుంగభద్ర నదులపై ప్రాజెక్టుల్లో సోమవారం నాటికి నీటి నిల్వల పరిస్థితి ఇదీ..

ప్రాజెక్టు పేరు	పూర్తిస్థాయి సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో	గతేడాది ఇదే రోజు నిల్వ
ఆల్మట్టి	129.721	122.27	0	35,000	128.19
నారాయణపూర్	37.646	33.73	34,410	229	37.17
జూరాల	9.657	6.16	2,330	2,330	9.26
శ్రీశైలం	215.807	20.94	2,266	44	155.64
నాగార్జునసాగర్	312.045	115.626	0	529	139.44
పులిచింతల	45.77	3.71	0	0	6.47
తుంగభద్ర	100.86	53.49	6,326	963	52.63

(సామర్థ్యం, నిల్వ టీఎంసీల్లో, ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో క్యూసెక్కుల్లో..)

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ (గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం ఈ ఏడాది మేలో నిర్వహించిన ఎంఏ ఎకనామిక్స్, ఎమ్మెస్సీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కోర్సుల ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. ఈ ఫలితాలను www.anucde.info వెబ్‌సైట్‌లో పొందవచ్చని దూరవిద్య పీజీ పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ భవనం ఆంజనేయరెడ్డి తెలిపారు. అభ్యర్థులు సెప్టెంబర్ 2వ తేదీలోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని, ఒక్కో పేపర్‌కు రూ. 960 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

రాష్ట్రానికి రూ. 411 కోట్ల ‘ఉపాధి’ నిధులు

రాష్ట్రంలో కూలీలకు చెల్లించాల్సిన బకాయిలే రూ. 604 కోట్లు

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం అమలుకుగాను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ. 411 కోట్లు విడుదల చేసింది. కూలీలకు వేతనాల రూపేణా చెల్లించేందుకు రూ. 257.02 కోట్లు, మెటీరియల్ పనుల కోసం రూ. 154.23 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరక్టర్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు జరిగిన ఉపాధి పథకం పనులకే రూ. 699 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయిల రూపేణా చెల్లించాల్సి ఉంది. గత రెండు నెలలుగా పని చేసిన కూలీలకే రూ. 604 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, సిమెంట్ రోడ్ల నిర్మాణం వంటి పనులు చేసిన వారికి మరో రూ. 95 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆలయాల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి

ప్రతిష్ఠాన పీఠం అధిపతి కమలానంద భారతి



వెంకటగిరి రూరల్: ఆలయాల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రతిష్ఠాన పీఠం అధిపతి కమలానంద భారతి స్వామీజీ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రజలు, ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్రలో భాగంగా నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం బాలసముద్రం, చింతగుంట, పాళెంకోట, కొత్తూరు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హిందూ సంప్రదాయం, ఆలయాల ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ఆలయాల్లో నిత్యం పూజలు చేస్తే గ్రామాలు సుఖ సంతోషాలతో బాగుంటాయన్నారు. స్వామీజీ వెంట సమరత సేవా ఫౌండేషన్ మండల కో–ఆర్డినేటర్ శేషాద్రి, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు రామచంద్రయ్య, నాయకులు కేవీకే ప్రసాద్, సంజీవరెడ్డి ఉన్నారు.

సికింద్రాబాద్- హౌరా ప్రత్యేక రైలు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్– హౌరా మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్– హౌరా (02513/02514) ప్రత్యేక రైలు మంగళవారం(22న) సాయంత్రం 5.55కి సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30కి హౌరా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 25వ తేదీ తెల్లవారుజామున 1.05 గంటలకు హౌరా నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

ఏడీసీ అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష

సాక్షి, అమరావతి: అమరావతి రాజధానిలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి నారాయణ అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడలోని ఏడీసీ కార్యాలయంలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లు, శాఖమూరి పార్కు, కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి తదితర ప్రాజెక్టులకు సంబంధించి ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతితో చర్చించారు.

రాష్ట్ర ఉత్సవంగా టంగుటూరి జయంతి

సాక్షి, అమరావతి: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 23వ తేదీన ఆయన జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించాని ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పైసలివ్వండి.. పట్టుకెళ్లండి!

- రూ.50 వేలు కడితేనే నియామక పత్రాలు
- శాప్ ఔట్‌సోర్సింగ్ కోచ్‌ల నియామక సంస్థ డిమాండ్

విజయవాడ స్పోర్ట్స్: ‘హలో.. మీరు శాప్ కోచ్‌గా సెలెక్ట్ అయ్యారు. పాల్వంచ వచ్చి రూ.50 వేలు చెల్లించి నియామక పత్రం తీసుకెళ్లండి.. రశీదు కూడా ఇస్తాం’.. అంటూ ఏపీలోని 13 జిల్లాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో క్రీడా శిక్షకులు(కోచ్‌లు)గా ఎంపికయినవారికి తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఆ ఔట్ సోర్సింగ్ సంస్థ నుంచి ఫోన్లు రావడంతో అవాక్కవడం అభ్యర్థుల వంతైంది. ఆ ఔట్ సోర్సింగ్ సంస్థ పాల్వంచలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు దరఖాస్తులు ఇచ్చి, 19, 20 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో కోచ్ పోస్టులకు తెలంగాణలో ఇంటర్వ్యూలు జరపడమేంటని సాక్షి కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఎన్నో సంవత్సరాల పాటు క్రీడా శిక్షకుల నియామకం కోసం నోటిఫికేషన్లులేక అల్లాడిపోయిన నిరుద్యోగులు చివరకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో రూ.17,500 వేతనానికి కోచ్‌గా చేరేందుకు కూడా సిద్ధపడ్డారు. తీరా కోచ్‌గా ఎంపికయ్యాక రూ.50 వేలు తెచ్చుకుని నియామక పత్రం తీసుకెళ్లమనడంతో అభ్యర్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అసలే ఔట్‌సోర్సింగ్ పోస్టు.. అప్పోసాప్పో చేసి డబ్బు కట్టాక ఆ సంస్థ బోర్డు తిప్పేస్తే తమ పరిస్థితేంటని అభ్యర్థులు ఆందోళనవ్యక్తంచేస్తున్నారు.

ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటాం

ఔట్ సోర్సింగ్ పద్ధతిలో కోచ్‌ల నియామకాలు పొందిన అభ్యర్థులు రూ.50 వేలు చెల్లించాలని ఆ సంస్థ పేర్కొనడంపై రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి కొల్లు రవీంద్రను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని చెప్పారు. అభ్యర్థులు రూ.50 వేలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆ సంస్థ అలా డిమాండ్ చేస్తే అభ్యర్థులు ఎవరైనా రాతపూర్వక ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టంచేశారు.

అవినీతి పాలనను అంతమొందించండి

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స
- నంద్యాల, కాకినాడల్లో టీడీపీని తరిమికొట్టండి

కాకినాడ: ప్రజలకిచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, అవినీతిలో కూరుకుపోయిన మూడున్నరేళ్ళ తెలుగుదేశం పాలనకు రానున్న నంద్యాల, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్వీఎన్ ఫంక్షన్ హాలులో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నంద్యాల తరహాలో మోసాలు, ప్రలోభాలు కాకినాడలో కూడా ప్రారంభించేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. ఓటర్ల వద్దకు వెళ్ళి ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేస్తామంటూ అకౌంట్ నెంబర్లు తీసుకుంటున్న విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వమైనా చేసిన అభివృద్ధిని చూపించి ఓటు వేయమని అడుగుతుందని, కానీ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయకపోతే పింఛన్లు, ఇళ్లు రద్దు చేస్తామని బెదిరింపు ధోరణికి దిగుతున్నారని మండిపడ్డారు.

ఒక్క హామీ అమలయ్యిందా?

స్మార్ట్ సిటీ, పెట్రో యూనివర్సిటీ, ఎల్‌అండ్‌టీ టెర్మినల్, తుని నౌకా నిర్మాణ కేంద్రం, తెలుగు విశ్వవిద్యాలయం, కొబ్బరిపీచు పరిశ్రమ, ఆక్వాఫుడ్ పార్కు సహా ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలయ్యిందా? అని బొత్స నిలదీశారు. రూ.400 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నా పట్టుమని రూ.5 కోట్ల పనులు కూడా పూర్తి చేయలేకపోయారని చెప్పారు. అవినీతి దాహంతో కేంద్ర నిధులను కూడా కైంకర్యం చేయాలన్న చంద్రబాబు, లోకేష్, స్థానిక నేతల తీరు ఈ ప్రాంతం అభివృద్ధికి అవరోధంగా మారిందని చెప్పారు. విశాఖలో వేల కోట్ల విలువైన భూములను దోచేసిన చంద్రబాబు, ఆయన అనుయాయుల కన్ను ఇప్పుడు కాకినాడ తీరంపై పడిందని ధ్వజమెత్తారు. కాపులను బీసీల్లో చేరుస్తామంటూ ఎన్నికల ముందు ఊరువాడా ప్రచారంచేసిన టీడీపీ ఇప్పుడు ముద్రగడ ఉద్యమాన్ని అణిచివేస్తూ కాపుజాతిని అవమానిస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక స్మార్ట్‌సిటీ కన్నా భిన్నంగా రాష్ట్రంలోనే కాకినాడను ప్రత్యేక స్థానంలో నిలిపేలా కృషి చేస్తామన్నారు. కాకినాడ 34వ డివిజన్ కార్పొరేట్ అభ్యర్థి పసుపులేటి వెంకటలక్ష్మికి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణ, పినిపే విశ్వరూప్, కొప్పన మోహనరావు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ముదునూరి ప్రసాదరాజు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స. చిత్రంలో మోపిదేవి,చెవిరెడ్డి, వెలంపల్లి శ్రీనివాస్, ముదునూరి ప్రసాద్‌రాజు, చలమలశెట్టి సునీల్


భూములు కబ్జా చేస్తున్నా పట్టించుకోవట్లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఆరోపణ

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వ భూములను బడా నాయకులు కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని, జిల్లాలో పెద్ద భూస్కామ్ జరుగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు ఆరోపించారు. సోమవారం జిల్లాలోని కాశినాయన, బ్రహ్మంగారి మఠం మండల్లాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించిన అనంతరం మఠంలోని పొలాల వద్ద విలేకరులతో మాట్లాడారు. సావిశెట్టిపల్లె సమీపంలో సుమారు 18 వేల ఎకరాల ప్రభుత్వ భూములను బడా భూస్వాములు ఆక్రమించుకున్నట్లు తెలుస్తోందన్నారు. వైఎస్సార్ జిల్లాతో పాటు ఒంగోలు, గుంటూరు, విజయవాడ, నంద్యాల, హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు చెందిన బడా భూస్వాములు వందల ఎకరాలు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారన్నారు. మరి పేదలు భూములు అడిగితే.. మీకు పట్టాలు లేవు.. భూములు ఇవ్వటం కుదరదంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంపై గత 35 రోజులుగా బాధితులు పోరాటం చేస్తున్నారన్నారు. నిరుపేదలకు వైఎస్సార్ జిల్లా భూస్కాంపై అధికారులు స్పందించకపోతే త్వరలో కడప కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణ, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, చంద్రశేఖర్, అన్వేశ్ పాల్గొన్నారు.

పీవీఆర్‌కే ప్రసాద్ కన్నుమూత

పంజాగుట్ట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి



హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్ర సర్వీసుల్లో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ (77) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు తుదిశ్వాస విడిచారు. గత శుక్రవారం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు కేర్ ఆసుపత్రిలో చేర్చారు. ఐసీయూలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని బంజారాహిల్స్ రోడ్ నంబర్7లోని స్వగృహానికి తరలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ ముఖ్య సలహాదారు పరకాల ప్రభాకర్, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్‌నారాయణ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం పంజాగుట్ట శ్మశాన వాటికలో ఆయన కుమారుడు సంజీవి ప్రసాద్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఐవీఆర్ కృష్ణారావు, ఎంవీఎస్ ప్రసాద్, చెంగప్ప, రాంబాబు, ఎన్వీ భాస్కర్‌రావు, బీవీ రామారావు, కృష్ణారావు, సత్యనారాయణ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు సమాచార సలహాదారుగా ప్రసాద్ పనిచేశారు. టీటీడీ ఈవోగా తిరుమల విశిష్టతపై పలు రచనలు చేశారు.

పీవీఆర్‌కే ప్రసాద్ మృతిపై జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ ఈవో పీవీఆర్‌కే ప్రసాద్ (77) మృతి పట్ల ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ప్రసాద్ కుటుంబసభ్యులకు జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలు కీలక పదవుల్లో పనిచేసిన ఆయన విధి నిర్వహణలో చిత్తశుద్ధిగా వ్యవహరించారన్నారు. ఆయన గతంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు సలహాదారుగా సుదీర్ఘకాలం పని చేశారు. తిరుమల ప్రాశస్త్యంపై పలు పుస్తకాలు రాశారు. పీవీఆర్‌కేకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పీవీఆర్‌కే ప్రసాద్ మృతికి సీఎం సంతాపం

సాక్షి, అమరావతి: రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవిఆర్‌కే. ప్రసాద్ మృతిపట్ల సీఎం చంద్రబాబు ప్రగాఢ సంతాపం తెలిపారు. పీవీఆర్‌కే ప్రసాద్ సమర్థవంతమైన అధికారిగా వ్యవహరించారని, ప్రభుత్వానికి విశేషమైన సేవలు అందించారని కొనియాడారు. పీవీఆర్‌కే ప్రసాద్ మృతిపట్ల తెలంగాణ సీఎం కె.చంద్రశేఖర్‌రావు, పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి కూడా సంతాపం ప్రకటించారు.

వర్షాల మందగమనంతో వరిసాగుకు ఇబ్బందే

మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఏడీఆర్ పాలడుగు



అనకాపల్లి: ఉత్తరాంధ్రలో వరిపంట దిగుబడులు తక్కువగా ఉంటున్నాయని మార్టేరు వరి పరిశోధన కేంద్రం ఏడీఆర్ పాలడుగు వెంకట సత్యనారాయణ తెలిపారు. విశాఖ జిల్లా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానానికి సోమవారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు మందగించడంతో విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో వరి సాగు అరకొరగా సాగుతోందన్నారు. సెప్టెంబర్ 5 వరకు వరినాట్లకు అవకాశముందని తెలిపారు. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, శ్రీకాకుళం జిల్లాల్లో వరిసాగు ఆశాజనకంగా ఉందన్నారు. ప్రస్తుతం వరిని వెదజల్లే విధానంలో అధికంగా సాగు చేస్తున్నారని తెలిపారు. మారుతున్న వాతావరణ స్థితిగతులకు అనుగుణంగా చీడపీడలను దృష్టిలో పెట్టుకొని మధ్యస్త కాలపరిమితి రకాలపై పరిశోధనలు ముమ్మరం చేశామన్నారు. ఉత్తరకోస్తాలో వరిలో దిగుబడి పెంచాలంటే పచ్చిరొట్ట ఎరువులను వినియోగించాలని, భూసార పరీక్షలకు అనుగుణంగా యాంత్రీకరణను వినియోగించాలని సూచించారు. రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో 16 లక్షల హెక్టార్లలో వరి సాగు లక్ష్యమని, ఇప్పటి వరకు 70 శాతం మేర వరినాట్లు జరిగాయని తెలిపారు. దిగుబడిపరంగా రాష్ట్రం సరాసరితో పోలిస్తే విశాఖ జిల్లాలో వరి దిగుబడి తక్కువని పేర్కొన్నారు.

కారుణ్య నియామకాల ఎక్స్‌గ్రేషియా పెంపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ మృతి చెందిన వ్యక్తి కుటుంబాల్లో తిరిగి నియామకానికి (కారుణ్య నియామకానికి) ఆ కుటుంబంలో ఎవరూ అర్హులు లేకపోతే (పిల్లలు మైనర్లుగా ఉండి, భార్య లేదా భర్త అర్హులు కాకపోతే) అలాంటి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి లింగరాజుపాణిగ్రహి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నాలుగో తరగతి ఉద్యోగి మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.40 వేలు మంజూరయ్యేవి. ఇప్పుడా సొమ్మును రూ.5 లక్షలకు పెంచారు. ఎన్జీవో మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.60 వేలుగా ఉన్న సొమ్మును రూ.8 లక్షలకు, గెజిటెడ్ ఉద్యోగి మృతి చెందితే రూ.80 వేలు ఉండగా దాన్ని రూ.10 లక్షలకు పెంచారు.

కార్యకర్తను కాళ్లు పట్టమన్న ఎమ్మెల్యే..

వాట్సప్‌లో వైరల్ అయిన వీడియో

టీనగర్ (చెన్నై): తమిళనాడులో అన్నాడీఎంకేకి చెందిన ఓ ఎమ్మెల్యే బహిరంగ సభలో పార్టీ కార్యకర్తను కాళ్లు పట్టమనడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ దృశ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీయగా వాట్సప్‌లో ఇప్పుడది వైరల్ అయింది. కడలూరు జిల్లా విరుదలచలంలో మణిముత్తారు నదిని ఎన్ఎల్‌సీ సీఆర్ఎస్ పథకం కింద శుభ్రపరిచే పనిని నైవేలి ఎన్ఎల్‌సీ సంస్థ చేపట్టింది. ఆదివారం మణిత్తారు నది సమీపాన ఈ పనుల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఇందులో అన్నాడీఎంకే ఎమ్మెల్యే కలైసెల్వన్ పాల్గొన్నారు. తర్వాత నిర్వహించిన బహిరంగ సభలో ఆయన కుర్చీలో కూర్చున్నారు. ఆ సమయంలో కలైసెల్వన్ పార్టీకి చెందిన ఓ కార్యకర్తను తన కాళ్లు పట్టమన్నారు. దీంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యే కాళ్లు పడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీసి వాట్సప్‌లో పెట్టాడు. ఈ ప్రస్తుతం వీడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.

బ్రాహ్మణ వర్గంపై టీడీపీ కక్ష సాధింపు

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి


విలేకరులతో మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి. చిత్రంలో పార్టీ నేతలు

కాకినాడ: రాష్ట్రంలో బ్రాహ్మణ సామాజికవర్గంపై అధికార తెలుగుదేశం పార్టీ అనేక కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని గుంటూరు జిల్లా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణులకు అన్యాయం చేస్తున్న టీడీపీకి నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఏఎస్ అధికారిగా ఎన్నో సేవలు అందించిన ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కృష్ణారావుపై లేనిపోని నిందారోపణలు చేసి అవమాన పరిచారని గుర్తుచేశారు. ప్రతిపాదిత రాజధాని ప్రాంతంలో ఆయనకు సెంటు భూమి లేకపోయినా వందల ఎకరాలు ఉన్నాయంటూ అపనిందలు వేశారని విమర్శించారు. రూ.500 కోట్లతో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు ఆర్భాటం చేసి తొలి ఏడాది రూ.130 కోట్లు మాత్రమే విడుదల చేసి, రూ.90 కోట్లు కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. బడ్జెట్ కేటాయింపుల కోసం అడిగారని, బ్రాహ్మణ ఆస్తులపై కన్నేసినవారిని అడ్డుకుంటున్నారనే అక్కసుతోనే ఐవైఆర్‌ను తప్పించారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 23,800 దేవాలయాల అర్చకులను వీధిన పడేసేలా వ్యవహరించిందని విమర్శించారు. ఆదాయం తక్కువగా ఉన్న ఆలయాల్లోని అర్చకులను తగ్గించి, వారికి రూ.5 వేలు వేతనంగా నిర్ణయించడం ద్వారా అన్యాయం చేసిందని చెప్పారు. బ్రాహ్మణవర్గాలను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన వేణు, విశాఖ జిల్లా సీనియర్ నాయకులు సీతంరాజు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, మిండగుదిటి మోహన్ తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్
- సెప్టెంబర్ 23 నుంచి బ్రహ్మోత్సవాలు


శ్రీవారి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు

సాక్షి, తిరుమల: సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 1 వరకు జరగనున్న తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సోమవారం జేఈవోలు శ్రీనివాసరాజు, పోల భాస్కర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, సీవీఎస్‌వో ఆర్‌కే రవిక్రిష్ణతో ఆయన సమీక్ష జరిపారు. అనంతరం ఆయన మీడియాకు వెల్లడించిన వివరాలివి...

- ఈసారి బ్రహ్మోత్సవాల్లో కొత్త సర్వభూపాల వాహనంపై ఉత్సవమూర్తులు ఊరేగనున్నారు.
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబరు 27న రాత్రి 7.30 గంటలకే శ్రీవారి గరుడవాహన సేవ ప్రారంభిస్తారు. ఆ రోజు 550 ఆర్టీసీ బస్సులతో మొత్తం 4 వేల ట్రిప్పుల ద్వారా భక్తులకు ప్రయాణ సదుపాయం కల్పిస్తారు. ఆరోజు ద్విచక్రవాహనాలు ఘాట్‌రోడ్డులో అనుమతించరు.
- బ్రహ్మోత్సవాల పనుల కోసం రూ.8 కోట్లు మంజూరు
- మొత్తం 600 అధునాతన సీసీ టీవీలు ఏర్పాటు.
- ఆలయంలో 6 లక్షల లడ్డూలు సిద్ధంగా ఉంచుతారు.
- వాహన సేవల్లో స్వామిని దర్శించుకునేందుకు గ్యాలరీల్లో వేచి ఉండే భక్తులకు నిరంతరం మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదం పంపిణీ. అదనపు మరుగుదొడ్లు, అంబులెన్స్‌లు, ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు.
- సుమారు 3500 మందితో పోలీసు, విజిలెన్స్ నిఘా సిబ్బంది నియామకం.
- ఉత్సవాల్లో 9 రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు. కేవలం ప్రొటోకాల్ ప్రముఖులకే ప్రత్యేక దర్శనాలు.
- గదుల అడ్వాన్స్ బుకింగ్ రద్దు.
- సెప్టెంబరు 6న పౌర్ణమి గరుడవాహన సేవను బ్రహ్మోత్సవ గరుడవాహన సేవగా నిర్వహణ.
- 23న సీఎం చంద్రబాబు శ్రీవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

శ్రీవారి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవోలు శ్రీనివాసరాజు, పోల భాస్కర్, కలెక్టర్ ప్రద్యుమ్న, సీవీఎస్‌వో రవిక్రిష్ణతోపాటు ఆలయ ప్రధాన అర్చకులు గొల్లపల్లి రమణ దీక్షితులు, తిరుపతమ్మగారి నరసింహ దీక్షితులు, ఓఎస్‌డీ శేషాద్రి ఆవిష్కరించారు.

షటప్.. కొంగ బావా..



అమెరికాలోని ఫ్లోరిడా.. ఎవర్‌గ్లేడ్స్ జాతీయ పార్కు..మధ్యాహ్నం సమయం.. కొంగ బావ కడుపు మాడిపోతోంది.. ఒంటికాలిపై జపం చేసినా.. చేపలేమో చిక్కలేదాయె..మరేం చేయాలి అని ఆలోచనలో పడింది.. ఇంతలో అటుగా పోతున్న పచ్చ పాము కంటపడింది. ఎలాగూ నాన్‌వెజ్జే కదా.. ఏదైతే ఏమిటి అనుకుంది.. పామును అమాంతం మింగేద్దామని ప్లానేసింది.. ప్రయత్నమూ చేసింది. దీంతో పాముకేమో చిర్రెత్తుకొచ్చింది.. ఇద్దరి మధ్యా ఓ 20 నిమిషాలు భీకరమైన యుద్ధం నడిచింది. సడన్‌గా పాముకు లైటు వెలిగింది.. తనను మింగేద్దామనుకున్న కొంగ బావ మూతికే తాళమేసేస్తే.. అని అనుకుంది. వెంటనే.. మూతినిలా చుట్టుకుని.. సర్పబంధనం చేసేసింది.. అంతే.. కొంగ బావకు పరిస్థితి అర్థమైంది. తెల్ల జెండా ఎగరేసింది.. నోటికి బదులు కాళ్లకు పనిచెప్పింది..
ఈ ఆసక్తికర దృశ్యాన్ని అమెరికాకు చెందిన జోస్ గార్షియా అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు. 2017 బర్డ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీకి వచ్చిన ఎంట్రీల్లో మెచ్చదగిన చిత్రాలను తాజాగా విడుదల చేశారు. అందులో ఈ ఫొటోకూడా ఉంది.

ఉల్లిపాయల వ్యాను, అంబులెన్స్‌లో గంజాయి

- వలపన్ని పట్టుకున్న పోలీసులు.. నిందితుల అరెస్ట్
- రూ.కోటి నలభై లక్షల విలువైన గంజాయి స్వాధీనం



కాశీబుగ్గ పోలీసుల అదుపులో అంబులెన్స్ డ్రైవర్

కాశీబుగ్గ/చింతూరు (రంపచోడవరం): గంజాయి తరలింపునకు స్మగ్లర్లు నూతన మార్గాలను వెతుక్కుంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉల్లిపాయల వ్యానులో, తూర్పుగోదావరి జిల్లాలో అంబులెన్స్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండల పరిధిలోని లక్ష్మీపురం టోల్‌గేటు వద్ద సోమవారం రూ. కోటి విలువచేసే 1,000 కిలోల గంజాయి సంచులను కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. ఉల్లిపాయల వ్యాన్‌లో అడుగున 40 బస్తాల్లో గంజాయిని ఉంచి తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు టోల్‌గేట్ వద్ద విశాఖపట్టణానికి చెందిన వాహనాన్ని పట్టుకుని కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఒడిశాకు చెందిన నిర్మల బెహర అనే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ బండి అనకాపల్లి నుంచి కటక్ వెళ్తున్నట్లు సమాచారం.

పక్కా వ్యూహంతో పట్టుకున్న పోలీసులు

అంబులెన్స్‌లో గంజాయిని రవాణా చేసేందుకు ప్రయత్నించిన ఓ అంతర్రాష్ట్ర ముఠాను తూర్పు గోదావరి జిల్లా చింతూరు పోలీసులు పక్కా వ్యూహంతో పట్టుకున్నారు. రూ.40 లక్షల విలువైన 610 కిలోల గంజాయితోపాటు అంబులెన్స్‌ను, మరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతోన్న తెలంగాణలోని వరంగల్ జిల్లాకు చెందిన పోలుసాని శ్రీనివాస్, చిన్నబోయిన రమేశ్, అహ్మద్‌పాషా, అష్రార్, సాయికుమార్, సుమన్‌లను అరెస్టు చేసి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అడ్మిన్ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఇచ్చిన సమాచారం మేరకు ఎటపాక ఓఎస్డీ అంబురాజన్, చింతూరు డీఎస్పీ దిలీప్‌కిరణ్ ఆదేశాలతో చింతూరు సీఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్ సోమవారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. చింతూరు మండలం గొర్లగూడెం వద్ద కూనవరం జంక్షన్‌లో అంబులెన్స్‌ను, మరో వాహనాన్ని ఆపి తనిఖీలు చేయగా గంజాయి సంచులు కనిపించాయి. ప్రధాన నిందితుడు శ్రీనివాస్ తనకున్న పరిచయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌ను మృతదేహాన్ని తరలించాలంటూ కిరాయికి మాట్లాడుకున్నాడు. తర్వాత ఒడిశాలోని మల్కనగిరి జిల్లాకు చెందిన దినేశ్ వద్ద 25 సంచుల్లో 610 కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. శ్రీనివాస్, మరో ఐదుగురు కలిసి ఆరొందల కిలోల గంజాయిని అంబులెన్స్‌లో, 10 కిలోల గంజాయిని తుపాను వాహనంలో ఉంచి రెండు వాహనాల్లో ఒడిశా నుంచి వస్తూ గొర్లగూడెం వద్ద పోలీసులకు చిక్కారు.

రూటు మారిన స్మగ్లింగ్..: ఇప్పటివరకు ఒడిశా సరిహద్దుల నుంచి డొంకరాయి, చింతూరు మీదుగా తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు గంజాయి రవాణా జరుగుతుండేది. చింతూరు సర్కిల్ పరిధిలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడంతో స్మగ్లర్లు రూటు మార్చి ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా ఆంధ్రా, తెలంగాణకు రవాణా చేస్తున్నారు.

ఏపీ గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్‌గా రవి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఏపీ గిరిజన సంఘాల జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నికైంది. జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సమావేశంలో జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్‌గా పాలకీర్తి రవి, ప్రధాన కార్యదర్శిగా పరమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మడావత్ శివానాయక్, ఉపాధ్యక్షులుగా ఇట్టా బాబూరావు, దావీదు ఎన్నికయ్యారు. జేఏసీ మహిళా అధ్యక్షురాలుగా గుజరాత్ సుజాతను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. జిల్లాను యూనిట్‌గా తీసుకుని ఎస్టీలకు ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కడుపులో 6 బంగారు బిస్కెట్లు

- మలేసియా నుంచి అక్రమంగా తరలించేందుకు యువకుడి యత్నం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న తిరుచ్చి ఎయిర్‌పోర్ట్ అధికారులు

కేకే.నగర్ (చెన్నై): కడుపులో బంగారు బిస్కెట్లు దాచుకుని వచ్చిన యువకుడిని విమానాశ్రయం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కౌలాలంపూర్ నుంచి తిరుచ్చికి ఏయిర్ ఏషియా విమానం ఆదివారంవచ్చింది. ప్రయాణికులను అధికారులు తనిఖీలు జరుపుతుండగా, ఓ యువకుడిపై అనుమానం రావడంతో అతడిని విచారించారు. ఆయన మలేసియా నుంచి తిరుచ్చికి కడుపులో ఆరు బంగారు బిస్కెట్లు ఉంచుకుని వచ్చినట్లు విచారణలో తేలింది. నిందితుడిని మహ్మద్ ముస్తఫా సలీగా గుర్తించారు. అధికారులు ముస్తఫాను తిరుచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి, బంగారు బిస్కెట్లు వెలికితీయాలని వైద్యులకు సూచించారు. వైద్యులు ఒక బంగారు బిస్కెట్ మాత్రమే వెలికి తీయగలిగారు. మరో ఐదు బిస్కెట్లను తీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 120 కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్: రైళ్లలో జరుగుతోన్న గంజాయి అక్రమ రవాణాను జీఆర్‌పీ బృందం క్రమంగా అడ్డుకట్ట వేస్తోంది. ఈ నెల 12న ఒక క్వింటాలు గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన రైల్వే పోలీసులు సోమవారం 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని మరో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎస్.చంద్రయ్య, ఎస్ఐలు బి.ప్రమోద్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, వీరలింగం నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించింది. జనరల్ బోగీలో అనుమానాస్పదంగా లగేజీ బ్యాగులు కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా వారివద్ద 120 కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిని ఒడిశా నుంచి ముంబైకి రవాణా చేస్తున్నట్లు నిందితులు బసుదేబ్ (40), సంజయ్‌కుమార్ (21), గౌరవ్ చంచన్ (40) పోలీసుల విచారణలో అంగీకరించారు.

డ్రాయింగ్ టీచర్ బాపిరాజుకు 'ఆటా' జాతీయ అవార్డు



పుప్పాల బాపిరాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డు టీచర్స్ అసోసియేషన్ (ఆటా) అందజేసే జాతీయ ఉత్తమ చిత్రలేఖన ఉపాధ్యాయ పురస్కారానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శంభూనగర్‌లోని బీజీఆర్ హైస్కూలులో డ్రాయింగ్ టీచరుగా పని చేస్తోన్న పుప్పాల బాపిరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు చెక్కంటి శ్రీనివాసరావు సోమవారం ప్రకటన విడుదల చేశారు. బాపిరాజుకు ఈ అవార్డును అక్టోబర్ 8న భద్రాచలంలో అందజేస్తామన్నారు. బాపిరాజు వద్ద శిక్షణ తీసుకున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో 450 చిత్రలేఖన పోటీల్లో పాల్గొని 1,600 బహుమతులు గెలుచుకున్నారు. ఇంతవరకు బాపిరాజు కూడా 150 అవార్డులు అందుకున్నారు. ఆయన రూపొందించిన 1 నుంచి 1,000 అంకెలతో కూడిన చిత్రాలు, ఆంగ్ల అక్షరాల చిత్రాలకు 40 అంతర్జాతీయ అవార్డులు లభించాయి. బాపిరాజును వైఎస్సార్‌సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అభినందించారు.

'కాపులను బీసీ జాబితాలో చేర్చవద్దు'


హైదరాబాద్: కాపులను బీసీ జాబితాలో చేర్చవద్దని ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారం చేతిలో ఉందని అడ్డగోలుగా కాపులను బీసీ జాబితాలో చేర్చే ప్రయత్నం చేస్తే ఈ అన్యాయాన్ని చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజ్యాంగం అండతో, సామాజిక న్యాయపోరాటంతో తమ రిజర్వేషన్ హక్కులను పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు.

'రోడ్డు' నిర్మాణానికి రూ. 10 కోట్లు

సాక్షి, అమరావతి: మంగళగిరికి సమీపంలోని చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారి (ఎన్‌హెచ్–16) నుంచి ఎయిమ్స్ ఆస్పత్రి శంకుస్థాపన చేసిన ప్రాంతం వద్దకు రోడ్డు నిర్మించేందుకుగాను రూ. 10 కోట్లను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. 1.6 కిలోమీటర్ల మేర రహదారిని నిర్మించేందుకు స్వల్పకాలిక టెండర్లను ఆహ్వానిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సుమితా దావ్రా ఆదేశాలిచ్చారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్‌ఆర్ జిల్లా
మంగళవారం
22-8-2017



గొప్పగుణాల వల్ల దేవుణ్ణి మనం కొలుస్తాం.
గొప్ప స్నేహితుడిగా దేవుణ్ణి తలుస్తాం.
కష్టం వచ్చినా..
సంతోషం వచ్చినా
దేవాలయానికి చేరుతాం.
ఆ దైవత్వం మనిషిలోనే ఉంటే..!

మంచితనం సహాయగుణం
మనిషె అయితే ..!!
అప్పుడు
మనిషె మసీద్ అయిపోతాడు.
అలాంటి మంచితనానికి
ఆశీర్వచనం ఉంటుంది.

మంచికి ఆశీర్వచనం ఉంటుంది!

ఫోటో: శివ మల్లాల

నేను నా దైవం

ఎస్.ఎం. మలిక్‌కు ధార్మిక సమాజంలో మంచి పేరు ఉంది. ఇస్లాం ధార్మిక కార్యకర్తగా, ఇస్లాం ధార్మిక పత్రిక 'గీటురాయి'కి ముప్పై ఏళ్లుగా సంపాదకునిగా, వీటికంటే విశిష్టంగా ఖురాన్ తెలుగు అనువాదకునిగా సమాజంలో ఆయన గౌరవం, గుర్తింపు పొందారు. జమాతే ఇస్లామీ హింద్ సంస్థతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. దైవాన్ని కనుగొనడంలో, ఆరాధన ద్వారా దైవానికి చేరువ కావడంలో మలిక్ స్వీయ అనుభవాలు ఎలా ఉన్నాయి, ఇస్లాం ఒక మతంగా జీవన ధర్మంగా ఎటువంటి దైవమార్గాన్ని బోధిస్తుంది, తదితర సందేహాలకు ఏడు పదుల వయసు దాటిన మాలిక్ కూలంకషంగా జవాబులు చెప్పారు.

● **మీ జీవితంలో ఇదంతా దైవికం అనుకున్న సందర్భం?**

మాది కర్నూలు జిల్లా. నేను పెద్ద పెద్ద చదువులు చదువుకోలేదు. పది వరకు ఉర్దూ, తెలుగు, సంస్కృతం చదువుకున్నాను. కాలేజీ మెట్లు ఎక్కలేదు. పుస్తకాలు ముఖ్యంగా తెలుగుసాహిత్యం బాగా చదివాను. సింగరేణి కాలరీస్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో డెయిలీ మజ్దూర్‌గా పనిచేశాను. తర్వాత సదరన్ రైల్వేలో పదేళ్లు డ్రాఫ్ట్స్‌మన్‌గా పనిచేశాను. ఆ తర్వాత ధార్మిక సేవ చేయాలనిపించింది. జాబ్‌కు రిజైన్ చేసి ఇస్లాం అంశాల తెలుగు అనువాదకుడిగా ఉన్నాను. ఇదే నాకు పోషణ అయ్యింది. నేను ఉర్దూ మీడియంలో కాకుండా తెలుగు మీడియంలో చదువుకోవడానికి ఇదే కారణం అయ్యింటుందని ఆ తర్వాత నాకు అనిపించింది. ఆ తర్వాత గీటురాయి పత్రికను ఆరంభించాను. ఇదంతా దైవికంగా జరిగినదే.

● **దైవాన్ని తెలుసుకోవాలంటే మతం తప్పనిసరా?**

మనిషి సమాజంతో ఎలా నడుచుకోవాలో చెప్పేదే మతం. ప్రపంచంలో ఎలా జీవించాలో, కుటుంబంతో ఎలా ఉండాలో, భాగస్వామితో, పిల్లలతో ఎలా మెలగాలో ఇవన్నీ మతం చెప్పాలి. అలాగే రాజకీయ, ఆర్థిక వ్యవస్థల పనితీరు గురించి కూడా తెలియజెప్పాలి. ఇవేవీ చెప్పని మతం మూఢమైనదని, మత్తుమందు వంటిదని మార్క్స్ వంటి వారు అన్నారు. ఇది నిజం. ఇవేమీ తన ప్రవక్తల ద్వారా సంకేతాల ద్వారా సందేశం ఇవ్వని దైవం ఇక మనకేం ఇస్తాడు. ఇస్లాంలో చూసినట్లయితే మనిషి సమాజంతో ఎలా నడుచుకోవాలో చెప్పేవన్నీ ఖురాన్‌లో ఉన్నాయి. ఖురాన్‌లో ఉన్న ప్రకారం మనిషి నడుచుకుంటే చాలు దైవం దృష్టిలో గొప్ప గుణశీలుడే. మనిషికి నిత్య జీవితంలో ఏమేం అవసరమో అవన్నీ చెప్పే దైవాన్ని నేను కొలుస్తాను. అలాంటి దైవం పట్ల ఆరాధన భావం లేకుండా చేసే పూజ పనికిరాదు. అలాంటి బోధనలు ఇవ్వని దైవమూ పనికిరాదు.

● **దేవుడు మనిషిని ఎందుకు సృష్టించాడు?**

ఈ భూమ్మీద ఇంత జంతుజాలం ఉంది. అది ప్రకృతికి ఏదో విధంగా ఉపయోగపడుతుంది. మనిషి మాత్రం అలా ఉపయోగపడడు. మరి మనిషి దేనికి ఉపయోగపడతాడు? దైవాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడతాడు. అందుకే సృష్టించబడ్డాడు. ఈ సృష్టిలో మానవుని సృజన దైవం కోసమే! దైవంలో ఏమున్నాయో అవన్నీ మనిషిలో ఉన్నాయి. ఇక్కడ మినియేచర్ గాడ్ మనిషి. అందుకే అతను కోరుకున్నవి తప్పక అవుతాయి. అయితే దైవంలో ఉన్న శక్తి అనంతం. మనిషిలో అవి పరిమితం. మనిషి తన శక్తులను సద్వియోగం చేస్తున్నాడా? దుర్వినియోగం చేస్తున్నాడా అనేది తెలుసుకోవడానికే మతం.

● **దైవం గురించి తెలుసుకోవడానికి సమయం, సందర్భం రావాలంటారా?**

దైవం తన గురించి తెలుసుకోవడానికి మనకు ఎన్నో అవకాశాలు ఇస్తుంటాడు. వాటిని మనం అందిపుచ్చుకోవాలి. ఇందుకు నా జీవితంలో జరిగిన ఒక సంఘటన చెబుతాను. మద్రాస్‌లో ఉద్యోగం చేసుకుంటున్న రోజులు. అప్పుడు నా వయసు 21. ఓ రోజు మా నాన్న ఉత్తరం రాశాడు... నువ్వేం చేయకపోయినా ఫజర్ నమాజ్ (సూర్యోదయానికి ముందు చేసే నమాజ్) మాత్రం తప్పక చేయమని అందులో ఉంది. మా నాన్న చెప్పినట్టు చేయాలని సంకల్పించుకున్నాను. అప్పుడు లాడ్జ్‌లో ఉండేవాడిని. లాడ్జి మేనేజర్‌ని కలిసి, ఉదయాన్నే నమాజ్‌కి వెళ్లాలి, గేటు తీస్తారా.. అని అడిగాను. వాళ్లు కుదరదన్నారు. అప్పుడు నా నెల జీతం 110 రూపాయలు. లాడ్జ్‌కి 10 రూపాయలు చెల్లిస్తున్నాను. 20 రూపాయలు అయినా సరే, అలాంటి రూమ్ కావాలని వెతికాను. కానీ, ఎక్కడా దొరకలేదు. ఎవరో దారిలో కలిసి ఆఫీసుకు దగ్గరలోనే మసీదు ఉంది అక్కడ రూమ్‌లు ఉన్నాయి అన్నారు. అక్కడకెళ్లి ఎవర్ని సంప్రదించాలో తెలియక నమాజు చేసుకోవడానికి కాళ్లూ చేతులు కడుక్కుం టున్నాను. ఇమామ్ పిలిచి 'వేళకాని వేళలో నమాజ్ చేసుకోవడానికి వచ్చావేంటి?' అని అడిగాడు. చెప్పాను. ''మా నాన్న నమాజ్ చేయమన్నాడు అందుకు రూమ్ కోసం వెతుకుతున్నాను'' అన్నాను. అప్పుడు అతను అన్నాడు.. నాన్న చెప్పాడనో.. అన్న చేయమన్నాడనో ... ఇంకెవరో ఆర్డర్ వేశారనో కాదు.. నీకు దైవాన్ని తలవాలనిపిస్తేనే చెయ్యి అన్నాడు. రూమ్ ఇప్పిస్తే చేసుకుంటాను అన్నాను. రూమ్ ఇచ్చాడు. నాకు చాలా నిశ్చింత అనిపించింది. అయితే, తెల్లవారు ఝామున జరిగే ఫజర్ నమాజ్‌కి ఎవరూ నన్ను నిద్ర లేపలేదు. వరుసగా నాలుగురోజులు చూశాను. నాకు దుఃఖం వస్తోంది. ఇమామ్‌ను కలిసి కంప్లైంట్ చేశాను, ఎవరూ నన్ను నిద్రలేపడం లేదని. నీకు నమాజ్ చేయాలనిపిస్తే నువ్వే లేస్తావు ఎవరో వచ్చి ఎందుకు లేపుతారు అన్నాడు. ఆ రోజు నమాజ్‌లో నాకు విపరీతమైన ఏడుపు వచ్చింది. ఏడుస్తూనే ప్రార్థన చేశాను. 'అల్లా నేను సిన్సియర్‌గా ప్రార్థన చేయాలనుకుంటున్నాను. నన్ను అనుగ్రహించు' అని కోరుకున్నాను. ఆశ్చర్యం... ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఎవరూ నన్ను నిద్ర లేపలేదు. కానీ, ఫజర్ నమాజ్ టైమ్‌కన్నా ముందే మెలకువ వచ్చేస్తుంది. స్వామిని కోరితే ఇవ్వలేనిదేముంది?

● **మనం కోరుకున్నవన్నీ ఇలా విని, అలా ఇచ్చేస్తాడా దేవుడు?**

ఖురాన్‌లో ఒక చోట– 'ప్రవక్తా.. మానవులు అడిగినప్పుడు ఇలా చెప్పు. నా దాసుల హృదయం కన్నా అత్యంత చేరువలో నేను ఉన్నాను అని చెప్పు. వారు నన్ను ఆర్తిగా పిలిచినప్పుడల్లా నేను వారికి బదులిస్తాను అని చెప్పు' అని ఉంది. ఆయన ఉన్నాడు కాబట్టే మనం ఈ భూమ్మీద మనగలుగుతున్నాం. మనకు మేలైనది ఏదో అది కోరుకుంటే దానిని ఆయనే పూర్తి చేస్తాడు. ఎదుటివాడికి చెడు చేయాలనే తలంపు ఉంటే మాత్రం దానికి ఆయన అనుగ్రహం ఉండదు. నా విషయమే ఒకటి చెబుతాను. ఇరవై ఏళ్ల క్రితం గుండెకు మూడు స్టంట్లు వేశారు. అప్పటికి నేను మొదలెట్టిన ఖురాన్ అనువాదం పూర్తి కాలేదు. అందుకని ఆ సమయంలో ఆసుపత్రి నుంచే అల్లాను ప్రార్థించాను. 'అల్లా... దివ్య ఖురాన్ తెలుగు అనువాదం, వ్యాఖ్యానం పూర్తిచేసే బాధ్యతలు ఉన్నాయి. వీటిని పూర్తి చేసే శక్తి, వ్యవధి ఇవ్వు' అని కోరుకున్నాను. ఆ దైవం నాకు ఆ సమయం ఇచ్చాడు. ఇప్పుడు అనువాదం ప్రింటింగ్ దశలో ఉంది. నా జీవితాన్ని పొడిగించే శక్తిని ఆ అల్లానే ఇచ్చాడు.

● సంతృప్తిగా జీవించాలంటే దైవాన్ని ఏమని కోరుకోవాలి?

దైవంతో మమేకమైతే సంతోషం కలుగుతుంది. ఆ సంతోషానికి మాటలు ఉండవు. దైవాన్ని కోరుకున్నవన్నీ జరుగుతాయని లేదు. కానీ, చిన్న ఆశ, నమ్మకం ఉంటాయి. అది జరిగిందనుకోండి. ఎంతో సంతోషం. అలాంటి ప్రత్యక్ష సాయం అందుతుండగా నేను నా కళ్లారా చూశాను. వాటి గురించి నా పుస్తకాల్లో రాశాను. ఆ సంతోషమే తృప్తి. ఆ సమయంలో దైవం గుర్తుండాలి. ఆ సమయంలో కృతజ్ఞతాభావం ఏదైతే ఉందో అదే దైవానికి మనం ఇచ్చే కానుక.

● **దైవం నుంచి సరే... మరి ప్రజలు పాలకుల నుంచి ఏం కోరుకోవాలి?**

ప్రజలు ఫలానా వారు మాకు నాయకుడు కావాలని బలంగా కోరుకోవాలి. ఎవరైతే ప్రజలకు సేవ చేస్తాడో అతనే నాయకుడవుతాడు. అంతేకానీ పెత్తనం చెలాయించేవాడు నాయకుడు కాదు. 'సాటి మనిషి కష్టాన్ని అంత త్వరగా గుర్తించి, చేయూతనివ్వు. అప్పుడే నువ్వు మనిషిగా ఎదుగుతావు' అంటారు ప్రవక్త. పాలకుడు అలా ఉండాలి. కులం, మతం, ప్రాంతం, భాష, రంగులు.. వీటితో దైవానికి సంబంధం లేదు. అలాగే పాలకుడికీ సంబంధం ఉండకూడదు. దైవం దృష్టిలో ఏ మనిషి ధర్మబద్ధంగా నడుచుకుంటాడో. అతనే గొప్ప గుణశీలుడు.

● **ఆత్మను ఎలా శుద్ధి చేసుకోవాలి?**

మనం చాలా బలహీనులం. ఎన్నో బలహీనతలు ఉంటాయి. అందుకే, ఎన్నో తప్పులు చేస్తాం. నేనూ చేశాను. వాటివల్ల వచ్చే కష్టాలు ఏవైనా అవి శిక్షగా కాదు. పరీక్షగా వస్తాయి. శిక్షలు ఏమైనా పరలోకంలో ఉంటాయి. మనం చేయాల్సింది తప్పు చేశానని దైవం ముందు ఒప్పుకోగలగాలి. 'దైవమా నేను చాలా బలహీనుడిని, అనుగ్రహించు' అని కోరుకోవాలి. నేను బాధతో ఎప్పుడు ఏడ్చినా దైవం సమక్షంలోనే ఏడ్చాను. ఎవరి ముందూ కన్నీరు పెట్టుకోలేదు. పశ్చాత్తాపంతో రాల్చే ఒక్క కన్నీటి బిందువు మన ఆత్మను పరిశుద్ధం చేస్తుంది. అలా రాల్చే కన్నీటిబొట్టు నేల రాలకముందే దైవకటాక్షం లభిస్తుంది. ఆత్మపరిశుద్ధత బయట ఎక్కడో వెతకనక్కర్లేదు. మనలోనే ఉంది. ఎవరికి వారే తమ ఆత్మను పరిశుద్ధ పరుచుకోవాలే తప్ప మరొకరి వల్ల కాదు.

● **దైవం స్త్రీయా, పురుషుడా?**

దైవానికి రూపం లేదు. లింగం లేదు. దైవం మహాశక్తి. అయితే, ప్రాచీన కాలం నుంచి ఏ సామ్రాజ్యంలో చూసినా, ఏ భాషలో అయినా దేవుడు పుంలింగంగానే పరిగణించబడుతున్నాడు. మానవ స్త్రీ, పురుషుల్లో లైంగిక పరమైన విభేదాలు ఉన్నాయి. మానసిక, శారీరక రూపాల్లో విభేదాలు ఉన్నాయి. అయితే, దైవం దృష్టిలో ఇద్దరూ సమానమే! ఖురాన్‌లో పురుషునికి ఉన్నట్టే స్త్రీకీ సమాన హక్కులు ఉన్నాయి. బాధ్యతలు మాత్రమే వేరు. ఆర్థికరంగంలో బాధ్యత పురుషుడిది. కుటుంబపోషణకు ఖర్చుపెట్టే బాధ్యత స్త్రీది. అయితే, ప్రాక్టికల్‌గా వచ్చేసరికి కొన్ని తారతమ్యాలు వచ్చేశాయి. వాటిని సరిదిద్దుకోవాలి.

● **సమాజ శ్రేయస్సు కోసం దైవాన్ని ఏమని కోరుకోవాలి?**

మన కోసం మనం ఎంత చేసుకున్నా కలగని తృప్తి ఎదుటివాడికి సాయపడటంలో కలుగుతుంది. జమాతే ఇస్లామ్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి సమాజసేవలో పాల్గొంటున్నాను. ఈ సంస్థ మెటర్నిటీ ఆసుపత్రిని నిర్వహిస్తుంది. దాదాపు 50 శాతం మంది ముస్లిం స్త్రీలు ఈ ఆసుపత్రిలో పురుడు పోసుకుంటారు. సేవలో స్వార్థచింతన కూడదు. మేము అనే భావన పోయి, మనం అనే భావన రావాలి. హిందూ, ముస్లిం వైరుధ్యాలు పోవాలంటే ఉభయవర్గాలు కష్టపడాలి. త్యాగం చేయాలి. ఓర్పు, సంయమనం పాటించాలి. ప్రార్థనలు చేయాలి. అప్పుడే సమాజంలో మంచి పెరుగుతుంది. ఏది కోరినా ఇచ్చే అల్లా మంచితనాన్ని కోరితే ఇవ్వడా?! ఈ లోకంలో మంచిని నింపు అని వేడుకోవడంతో పాటు మనమూ సాటివారితో మంచిగా ఉండాలి. తారతమ్యాలు లేని ప్రపంచాన్ని చేరువచేయమని కోరుకోవాలి. అప్పుడు దైవం తప్పక కరుణిస్తాడు. మంచిలోనే మనల్ని ఉంచుతాడు. ఎందుకంటే మంచికి ఎప్పుడూ ఆశీర్వచనం ఉంటుంది.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి



ఆత్మీయం

మతం కాదు... మానవ ధర్మం



'బౌద్ధం' మతమా లేక దర్శనమా? అని చాలామందికి అనుమానం. దానిని ఏ పేరుతో పిలిచినా తప్పులేదు. 'బౌద్ధం' బౌద్ధంగానే ఉంటుంది కాని మారదు. పేరులోనేముంది? మనం 'మల్లె' అని పిలిచే పదాన్ని మరేపేరుతో పిలిచినా దాని సుగంధం ఒకటే. మధురంగా ఉంటుంది. రాజకుటుంబంలో జన్మించి, అతిలోక సౌందర్యవతి అయిన భార్యను, ముద్దులు మూటగట్టే కుమారుని పొందాడు గౌతముడు. సుఖభోగాలు పొందడం ఆయనకు అతి సులభమైన పని. అయితేనేం, సర్వ మానవ సంక్షేమం కోసం, మానవాళిని దుఃఖ విముక్తులను చేయడం కోసం రాజ్యాన్ని, రాజభోగాలను, సంసార సుఖాలను గడ్డిపోచతో సమానంగా త్యజించి 'త్యాగం' అంటే ఇలా ఉండాలి అని చూపిన ఆచరణశీలి. అంతులేని ధనరాశులతో పొందలేని ఆత్మజ్ఞానం అనంతమైన జ్ఞానసాగరంలోని కేవలం ఒక్క బిందువుతోనే అపారంగా పొందవచ్చని గ్రహించాడు. తానేది గ్రహించాడో దానిని బోధించాడు. ఏది బోధించాడో దానినే అక్షరాలా ఆచరించాడు. ఆయన బోధనలు మానవ ధర్మబద్ధమైన, హేతుబద్ధమైన, పవిత్రమైన జీవనానికి వెలుగు బాటలు పరిచాయి. శాంతంతో కోపాన్ని, సాత్వికతతో హింసను, దానంతో లోభాన్ని, సత్యంతో అసత్యాన్ని జయించవచ్చునని, ప్రేమ వల్లనే ద్వేషం నశిస్తుందని ఆయన బోధించాడు. మతమంటే మరేదో కాదు, అన్ని ప్రాణుల పట్ల సానుభూతి కలిగి ఉండడమేనని, అందరినీ ప్రేమించడమే మానవత్వమని నిరూపించాడు. అందువల్ల బౌద్ధమతం అనేకంటే, బౌద్ధం అనడమే సరైనది.

బ్యూటిప్స్

బ్లాక్ హెడ్స్ నివారణ కోసం...

- అయిదారు కప్పుల నీటిలో టేబుల్ స్పూన్ నిమ్మరసం వేసి మరగబెట్టాలి. మరిగిన తరవాత ఆ పాత్రని టేబుల్ మీద ఉంచి ముఖానికి ఆవిరి పట్టించాలి. టవల్‌తో బ్లాక్ హెడ్స్ ఉన్న చోట నెమ్మదిగా రుద్దాలి. ఇలా రెండు, మూడుసార్లు చేయాలి. అయిదు నిమిషాల తరవాత చన్నీటితో ముఖాన్ని కడగాలి. ఆ తరవాత చర్మానికి సరిపోయే ఫేస్‌ప్యాక్ వేసి ఆరిన తరవాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.



- టేబుల్ స్పూన్ పెరుగులో టీ స్పూన్ బియ్యం పిండి కలిపి పెట్టుకోవాలి. ముఖానికి ఆవిరి పట్టించిన తరవాత ఈ మిశ్రమాన్ని బ్లాక్ హెడ్స్ ఉన్నచోట అప్లై చేసి, వేళ్లతో వలయాకారంలో నెమ్మదిగా రుద్దాలి. ఇలా వారంలో రెండుసార్లు క్రమం తప్ప కుండా చేయడం వల్ల ముఖంపై ఏర్పడ్డ బ్లాక్‌హెడ్స్ తగ్గుతాయి.



రంగస్థలం




ఇరవై ఏళ్ల క్రితం శ్రీనివాస్ దెంచనాల వయసు అటూ ఇటుగా ఇరవై ఐదేళ్లు. అది మరీ చిన్న వయసేం కాదు కానీ, అప్పటికే అతడు ఓ తట్టెడు నాటకాల ప్రేక్షకుడు! ఒక్కటీ నచ్చడం లేదు! పక్కన థియేటర్‌లో సూపర్‌స్టార్‌ల సినిమా అడుతుంటే, ఈ పక్కన స్టేజి ఆర్టిస్టులు ఎవరికైనా ఎలా ఎక్కుతారు?! అది కాదు రీజన్. దెంచనాల యునీక్. అతడికి రంగస్థల నటులే అప్పటికీ.. ఇప్పటికీ.. ఎప్పటికీ 'మెగా'లు, 'సూపర్'లు, 'రైజింగ్'లు. అంతిష్టం నాటకం అంటే! కానీ తెలుగు నాటకమేంటీ ఇలా చివికి పోతోంది? మంచి బట్టలేవు. మంచి తిండి లేదు. మంచి 'లుక్' లేదు! నాటకం మధ్యలో బయటికొచ్చి సమోసా తిని, చాయ్ తాగి మళ్లీ లోపలకి వెళ్లేవాడే కానీ నీరసంగా వెళ్లేవాడు. 'ఇలా కాదు' అనుకున్నాడొక రోజు. అనుకుని.. 'జనపదం' థియేటర్ రిపర్టరీని స్టార్ట్ చేశాడు. టూరింగ్ టాకీస్‌లా.. జనం మధ్యలోకి వెళ్లి, జనం చేతే ప్రదర్శింపజేసే కళాసంస్థ అది! జనపదం రిపర్టరీ ఆవిర్భావానికి.. ముందు.. తర్వాత.. ప్రస్తుతం.. రంగస్థలం ఏమిటన్నది ఆయన మాటల్లోనే...

కవి, రచయిత, రంగస్థల దర్శకుడు, నటుడు శ్రీనివాస్ దెంచనాల తో 'సాక్షి' ఇంటర్వ్యూ

జనపదం

బరువు మోస్తున్న బాటసారి

■ **కంగ్రాట్స్! రంగస్థలానికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపును తెచ్చిపెట్టారు.**
ఆవిర్భావ వేడుకల్లో మా థియేటర్ రిపర్టరీ అందుకున్న అవార్డు గురించేనా?
■ **అవును.**
అది ప్రజా కళాకారుల ఘనత.
■ **కానీ ఆ ఘనత వెనుక ఉన్నది మీరే కదా! మీ దర్శకత్వం, స్టేజ్ ప్లే, రైటింగ్.. ఔట్‌స్టాండింగ్.**
మీరు అంటున్న ఔట్‌స్టాండింగ్ ఒక్కరి వల్ల వచ్చే ఫలితం కాదు.
■ **బాధితులనే నటులుగా చేయాలని ఎందుకనిపించింది?**
అనిపించడం కాదు. అది నాలో ఇన్‌బిల్ట్‌గా ఉన్నట్లుంది. హబీబ్ తన్వీర్ నాటకాలు చూశాక, నేను కోరుకుంటున్నది ఏదో తెలిసింది. ఆయన నాటకాలు ఆగ్రా బజార్, చరణ్‌దాస్ చోర్.. నన్ను ఇన్‌స్పైర్ చేశాయి.
■ **ఏమిటి ఆయన ప్రత్యేకత? బాధితులను నటులుగా చేసి చూపించడమేనా?**
అదొక్కటే కాదు. ఆయన నాటకాలు ఇంగ్లిషు నాటకాల్లా ఉండవు. మామూలు జానపద నాటకాల్లా ఉండవు. మోడర్న్‌గా ఉంటాయి. సంప్రదాయాన్ని వదలకుండానే నాటకాన్ని ఆధునీకరిస్తారు.
■ **హబీబ్ తన్వీర్.. ఉర్దూ నాటక రంగ ప్రముఖులు. తెలుగులో మిమ్మల్ని ఆయనతో పోల్చవచ్చా?**
రెండేళ్లు ఆయన దగ్గర పని చేశాను. ఆయన నాటక బృందంతో కలిసి దేశమంతా కలియదిరిగాను. బృందంతో చేరి వారికి కాస్ట్యూమ్స్, సెట్టింగ్స్ మోయడం, నాటకాలను అబ్జర్వ్ చేయడం మొదలుపెట్టాను. హబీబ్ తన్వీర్‌తో పాటు బాదల్ సర్కార్, ధవళం నారాయణ ఫణిక్కర్, బీవీ కారత్ వంటివారు ఆధునిక నాటకాన్ని తమదైన శైలిలో అప్పటికే ప్రదర్శిస్తున్నారు. కానీ నన్ను గట్టిగా పట్టుకుంది మాత్రం హబీబ్ తన్వీర్.
■ **తెలుగులో ఆధునిక నాటకం లేదనేనా అంతదూరం వెళ్లారు?**
అంత దూరం అంటే..?
■ **ఖమ్మంలోని మీరు పుట్టిన పెద్దకిష్టాపురం తండా నుంచి.. ఛత్తీస్‌గఢ్‌లో హబీబ్ పుట్టి పెరిగిన గిరులలోకి!**
అది దూరం వెళ్లడం కాదు. ఆధునిక నాటకానికి దగ్గరగా వెళ్లడం.
■ **తెలుగు నాటకం ఇంతకాలానికీ ఆధునికతను చేరుకోలేకపోయిందని మీరు అంటున్నారు!**
అనడం కాదు. అసలు తెలుగులో ఆధునిక నాటకం లేనే లేదు. ఇది చాలా మంది అంగీకరించరు.
■ **అధునికం అంటే?**
భారతదేశంలోకి బ్రిటిషర్స్ ద్వారా వచ్చిన ఇంగ్లీషు నాటకానికీ, జానపద నాటకాలకూ భిన్నమైన శాస్త్రీయ సంప్రదాయక ప్రభావంగల నాటకం. అది 1950–55 మధ్యలో మన దేశంలో ప్రారంభమైంది. దానికి ఆద్యులు హబీబ్ తన్వీర్.
■ **కానీ ఆయన విదేశాలలో కదా శిక్షణ పొంది వచ్చారు?!**
అవును. లండన్‌లోని రాయల్ ఎకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్ (రాడా)లో శిక్షణ పొందారు. అయితే ఆ ధోరణి మన దేశానికి సరిపోదని ఆయనకు అనిపించి, తన సొంత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో నిరక్షరాస్యులైన ఆదివాసీ ప్రజల స్థానిక సంప్రదాయాన్ని తన నాటకాల్లోకి తీసుకున్నారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని, షేక్స్‌పియర్ నాటకాలను వేశారు.
■ **మీరు ఆదివాసీ కళాకారులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లున్నారు..?**
వాళ్ల సమస్యల్ని వాళ్లైతేనే చక్కగా ప్రజెంట్ చెయ్యగలరని నా నమ్మకం. ఆదివాసీల అతి ముఖ్యమైన సమస్య మైగ్రేషన్. అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలూ, అటవీ సంపద, తమదైన సంస్కృతి నుంచి వారు దూరం కావడం, ఆదివాసీ ఉపాధ్యాయులే వారిని మోసం చేయడం.. ఇవన్నీ నా జీవితంలోని చిన్ననాటి చేదు జ్ఞాపకాలే. ఆ అనుభవాలతో 'మావా నాటే మావా రాజ్' (మా వూళ్ళో మా రాజ్యం) ఉట్నూర్‌లో ప్రదర్శించాం. మూడు వేల మంది ఆదివాసీలు ఆ నాటకాన్ని చూసారు. 1994లో ఈ నాటకం చూసిన ప్రభుత్వాధికారులు ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని విమర్శించామన్న నెపంతో తదుపరి ప్రదర్శనలను నిషేధించారు. అయినా మా ప్రయత్నం ఆగలేదు. సెప్టెంబర్‌లో 'కుమ్రుం భీము కల' నాటకాన్ని ప్రదర్శిస్తున్నాం.
■ **మీ 'జనపదం' రిపర్టరీకి సపోర్ట్ లభిస్తోందా?**
కేంద్రప్రభుత్వం, మిత్రులు, ప్రేక్షకులు అందించే ఆర్థిక సాయంతో నడుపుతున్నాం. అప్పుడప్పుడూ సాయం చేసే రాష్ట్రప్రభుత్వాల మద్దతు కూడా ఉంది.
■ **అంటే.. నెట్టుకొస్తున్నాం అంటున్నారా?**
ఒకవిధంగా నెట్టుకు రావడం. ఇంకోవిధంగా ఎదురీదడం. 'తెలుగు ప్రజల సంస్కృతీ సాంప్రదాయాలనూ నాటకం ద్వారా దశదిశలా వ్యాపింపజేయడం మా లక్ష్యం. అయితే అందుకు ప్రభుత్వం కూడా తన సహకారం అందించవలసి ఉంటుంది. కేవలం వ్యక్తుల వల్ల జరిగే పని కాదు ఇది.
■ **ఒక రిపర్టరీ వ్యవస్థాపకులుగా రంగస్థల అభివృద్ధికి ఇంకా జరగవలసింది ఏమైనా ఉందా?**
